www.peoplesnews.in

హైదరాబాద్
# పీపుల్స్ న్యూస్
ప్రజల గొంతుక... దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 138 శుక్రవారం, అక్టోబర్ 02, 2026 , పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad




# రెండు డీఏలు మంజూరు

- ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రభుత్వం శుభవార్త
- ఏడాదికి రెండున్నర వేలకోట్ల అదనపు భారం
- ఒక డీఏ రాబోయే జీతాలతో కలిపి పంపిణీ
- తెలంగాణ రాష్ట్ర కేబినెట్ కీలక నిర్ణయాలు
- ఎల్?నినో పరిస్థితులపై భేటీలో సుదీర్ఘ చర్చ
- ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లపై పలు సూచనలు
- ప్రాజెక్టులపై పునస్సమీక్షించాలని నిర్ణయం
- 10 ఈపీసీ సాగునీటి ప్రాజెక్టుల నిలిపివేత
- డిజిటల్ మీడియా అడ్వర్టైజింగ్‌కు న్యూ పాలసీ




**హైదరాబాద్,అక్టోబర్ 01 :** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు ప్రభుత్వం ఊరట కల్పించింది. 2024 నుంచి పెండింగ్‌లో ఉన్న రెండు కరవు భత్యాలను విడుదల చేసేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఉద్యోగులకు రెండు కరవు భత్యాలు, విశ్రాంత ఉద్యోగులకు రెండు కరవు భత్య ఉపశమనాలను మంజూరు చేయాలని నిర్ణయించింది.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న కరవు భత్యాలను అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.ఏడాదికి రూ.2,500 కోట్ల మిగతా2లో...

# యువత ఆకాంక్షలకు ప్రతీక యూపీఎస్సీ

● ప్రతి ఉద్యోగి పేదల ఆవేదనను అర్థం చేసుకోవాలి ● సిటిజన్ ఫస్ట్ అనేది సివిల్ సర్వీస్ ఉద్యోగుల లక్ష్యం ● ఢిల్లీలో యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని మోదీ ● స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్‌ను ఆవిష్కరించిన ప్రధాని



**న్యూఢిల్లీ,అక్టోబర్ 01 :** యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) వందేళ్ల ప్రస్థానం లక్షలాది మంది యువత ఆకాంక్షలకు, దేశ ప్రజల నమ్మకానికి ప్రతీక అని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. గురువారం ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూపీఎస్సీ శతాబ్ది స్మారక నాణెం, మిగతా2లో...



## పైలట్ స్మిత్ మచ్చర్‌కు 'విశిష్ట గుజరాత్ గరిమా అవార్డు'

- 174 మంది ప్రయాణికుల ప్రాణాలు కాపాడిన ధైర్యసాహసాలకు గౌరవం

**గుజరాత్,అక్టోబర్ 01 :** దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళు_న్న విమానంలో జరిగిన ఘటనలో అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించిన భారతీయ పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌కు గుజరాత్ ప్రభుత్వం మిగతా2లో...

## ఖైరతాబాద్ ఉప ఎన్నికకు తాత్కాలిక బ్రేక్

- నోటిఫికేషన్ జారీ చేయబోమని ఈసీఐ స్పష్టం
- ఖైరతాబాద్ ఉపఎన్నిక విజయారెడ్డి పిటిషన్
- నోటిఫికేషన్ ఇవ్వకుండా ఆదేశించాలని వినతి




**హైదరాబాద్,అక్టోబర్ 01 :** హైకోర్టులో పిటిషన్ పై తుది పరిష్కారం వచ్చేంత వరకూ ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి బై పోల్ నోటిఫికేషన్ జారీ చేయబోమని ఈసీఐ స్పష్టం చేసింది. దీంతో ఈ నియోజకవర్గంలో ఉప ఎన్నిక నిర్వహణ ప్రక్రియపై విచారణ తేలేంత వరకు తాత్కాలికంగా బ్రేక్ పడినట్లు అయింది. ఇక 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో దానం నాగేందర్ ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన అఫిడవిట్‌లో మిగతా2లో...

# మద్దతు ధర ప్రకటించిన పంటలన్నింటినీ కేంద్రం కొనుగోలు చేయాలి

● ప్రకటించిన మద్దతు ధర ప్రతి రైతుకు అందేలా కేంద్రం చిత్తశుద్ధి చూపించాలి ● కరువు మండలాల ప్రతిపాదనలకు అవసరమైన సమాచారాన్ని అందించాలి ● మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి



**హైదరాబాద్,అక్టోబర్ 01 :** రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న ప్రాంతాలను గుర్తించి, రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకొని మండలం యూనిట్‌గా కరువు మండలాల ప్రతిపాదనలకు డిపార్ట్ మెంట్ సేకరించిన సమాచారాన్ని వారికి అందచేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. కేంద్ర వ్యవసాయ శాఖ రూపొందించిన కరువు నిర్వహణ మార్గదర్శకాల ప్రకారం కేవలం వర్షపాతం లోటును మాత్రమే పరిగణనలోకి తీసుకోకుండా, వర్షపాతం వ్యత్యాసం, SPI, పొడి కాలం, విత్తిన విస్తీర్ణం, నేల తేమ, రిజర్వాయర్ నిల్వలు, భూగర్భజల పరిస్థితులు, ప్రవాహ జలాలు, పశుగ్రాసం, తాగునీరు, ఉపాధి, వలసలు తదితర అంశాలను సమగ్రంగా మిగతా2లో...




## సర్ ప్రక్రియ పొడిగింపు లేదు

- 92 లక్షల మందికి నోటీసులు ఇచ్చాం
- సర్‌లో ఈసీ కొన్ని మార్పులు చేసింది
- ఎన్నికల కమిషనర్ సుదర్శన్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్,అక్టోబర్ 01 :** తెలంగాణ రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)లో భాగంగా 92 లక్షల మందికి నోటీసులు ఇచ్చినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ సుదర్శన్ రెడ్డి మిగతా2లో...

## అక్టోబర్ 4న తెలంగాణలో అమిత్ షా పర్యటన

- బీజేపీ ఆపరేషన్ తెలంగాణకు ప్రణాళిక
- వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా ముందుకు
- కొత్త వ్యూహాలను సిద్దం చేస్తోన్న కమల దళం
- ఖైరతాబాద్ ఉప ఎన్నికకూ సంసిద్ధమైన బీజేపీ
- రాష్ట్రంలో కేంద్ర మంత్రుల వరుస పర్యటనలు



**హైదరాబాద్,అక్టోబర్ 01 :** తెలంగాణ కేంద్రంగా బీజేపీ కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా కొత్త వ్యూహాలను సిద్ధం చేస్తోంది. ఇప్పటికే పలువురు కేంద్ర మంత్రులు తెలంగాణలో వరుస పర్య టనలు చేస్తున్నారు. గ్రేటర్, ఖైరతాబాద్ ఉప ఎన్నికతో పాటుగా పంచాయితీ ఎన్నికలకు సిద్ధం మిగతా2లో...

## ఖైరతాబాద్ ఉప ఎన్నికకు బీజేపీ సన్నద్ధం

● ఖైరతాబాద్ ఉప ఎన్నికపై కిషన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు ● పార్టీ అభ్యర్థి ఎంపికపై త్వరలో నిర్ణయం.. కార్యకర్తల అభిప్రాయాలకూ ప్రాధాన్యం




## మా ఆస్తులు.. మీ ఆస్తులు.. విచారణకు సిద్ధమా?

- తప్పు తేలితే శిక్షకు సిద్ధం.. నువ్వు సిద్ధమా..!?
- రెండు కుటుంబాల ఆస్తులపై విచారణకు రెడీ
- సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ బహిరంగ సవాల్
- సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించడానికి సిద్ధమా?
- రేవంత్ ఏ పార్టీలో కాలు పెడితే ఆ పార్టీ మటాష్
- రాష్ట్రంలో తెలుగుదేశంను బొందపెట్టి పోయిండు
- ఏదో శత్రు దేశం మీద దండయాత్రకు పోయారా!
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు



# యువత ఆకాంక్షలకు ప్రతీక యూపీఎస్సీ

(మొదటి పేజీ తరువాయి)

పోస్టల్ స్టాంప్‌తో పాటు '100 ల్యాండ్‌మార్క్ జడ్జిమెంట్స్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. నిన్న జరిగిన ఒక విమాన ప్రమాద ఘటనలో అసాధారణ ధైర్య సాహసాలు ప్రదర్శించిన భారత పైలట్, కెప్టెన్ స్మిత్ మచ్చర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. "నిన్న జరిగిన ఘటనలో భారత పైలట్ కెప్టెన్ స్మిత్ చూపిన ధైర్యం, సమయస్ఫూర్తి, నిబద్ధత ప్రశంసనీయం. ఇజ్రాయెల్ ప్రధాని చెప్పినట్లుగా, 9/11 తరహా ఘోర విషాదాన్ని ఒక భారతీయుడు అడ్డుకున్నాడు" అని మోదీ అన్నారు. స్మిత్ ఘనత మనందరికీ గర్వకారణమని, తాను ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడానని తెలిపారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న స్మిత్ సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని దేశ ప్రజలందరూ ప్రార్థించాలని పిలుపునిచ్చారు. యూపీఎస్సీ వందేళ్ల ప్రస్థానంపై మోదీ మాట్లాడుతూ.. "ఇది కేవలం ఒక సంస్థ వందేళ్లు పూర్తి చేసుకోవడం కాదు, ఇది లక్షలాది యువత ఆశయాల వేడుక. ప్రతి భారతీయుడు ఈ సంస్థపై ఉంచిన అచంచల విశ్వాసానికి ఇది నిలువుటద్దం. ఈ సంస్థను ఉన్నత శిఖరాలకు చేర్చిన ప్రతి ఒక్కరికీ నా అభినందనలు" అని పేర్కొన్నారు. సివిల్ సర్వీసుల చరిత్రను, మహనీయుల సేవలను మోదీ గుర్తుచేసుకున్నారు. "1920లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఈ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. ఆనాడు బ్రిటిష్ పాలన ఉన్నప్పటికీ ఆయన సంస్కృతంలో పేపర్ రాశారని ఇక్కడి గ్యాలరీలో చూశాను. అదేవిధంగా, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశాన్ని నడపడంలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారు. స్వతంత్ర భారతానికి అవసరమైన 'ఉక్కు చట్రాన్ని' (స్టీల్ ఫ్రేమ్) సర్దార్ పటేల్ అందించారు. ఈ సంస్థను దేశానికి ఒక ప్రధాన స్తంభంగా తీర్చిదిద్దారు" అని మోదీ వివరించారు. 1926 అక్టోబర్ 1న పబ్లిక్ సర్వీస్ కమిషన్‌గా ప్రారంభమైన ఈ సంస్థ, శతాబ్ద కాలంలో ఎన్నో మార్పులకు లోనై స్వతంత్ర రాజ్యాంగబద్ధ సంస్థగా రూపుదిద్దుకుందని ప్రధాని గుర్తుచేశారు. గతేడాది అక్టోబర్ 1న ప్రారంభమైన శతాబ్ది ఉత్సవాలు ముగిశాయి. సెప్టెంబర్ 30, అక్టోబర్ 1 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగిన ఈ వేడుకల్లో వివిధ రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ల చైర్మన్లు, సభ్యులు, కేంద్ర ప్రభుత్వ సీనియర్ అధికారులు, విద్యావేత్తలు, యూపీఎస్సీ అధికారులు పాల్గొన్నారు.

# రెండు డీఏలు మంజూరు

(మొదటి పేజీ తరువాయి)

**అదనపు భారం** రెండు కరవు భత్యాలను అమలు చేయడం వల్ల ప్రభుత్వంపై ఏడాదికి సుమారు రూ. 2,500 కోట్ల అదనపు ఆర్థిక భారం పడుతుందని మంత్రి తెలిపారు. అయినప్పటికీ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. కరవు భత్యం ఉద్యోగుల వేతనంలో భాగంగా ఉండటంతో పాటు ధరల పెరుగుదల ప్రభావాన్ని కొంతమేర తగ్గించేందుకు ఉపయోగ పడుతుంది. అదే విధంగా విశ్రాంత ఉద్యోగులకు అందించే కరవు భత్య ఉపశమనం వారి పింఛన్‌లో భాగంగా ఉంటుంది. **బకాయిలు విడతల వారీగా చెల్లింపు** పెండింగ్‌లో ఉన్న కరవు భత్యాల బకాయిలను ఉద్యోగుల జీతాలు, విశ్రాంత ఉద్యోగుల పింఛన్లతో కలిపి విడతల వారీగా చెల్లించనున్నట్లు మంత్రి తెలిపారు. దీనికి సంబంధించిన విధివిధానాలను ప్రభుత్వం ఖరారు చేయనుంది. 2024 నుంచి కరవు భత్యాల కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు తాజా నిర్ణయం ఆర్థికంగా కొంత ఊరటనివ్వనుంది. రెండు కరవు భత్యాల అమలుతో పాటు గత బకాయిలను కూడా దశలవారీగా చెల్లించేందుకు ప్రభు త్వం చర్యలు తీసుకో నుంది. **ఉద్యోగ, విశ్రాంత ఉద్యోగ వర్గాల్లో హర్షం** కరవు భత్యాల పెండింగ్ అంశంపై మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడంతో ఉద్యోగ, విశ్రాంత ఉద్యోగ సంఘాల్లో హర్షం వ్యక్తమవుతోంది. బకాయిలను విడతల వారీగా చెల్లించడంతో తమకు ఆర్థిక ప్రయోజనం కలుగుతుందని వారు పేర్కొంటున్నారు.

# ఖైరతాబాద్ ఉప ఎన్నికకు తాత్కాలిక బ్రేక్

(మొదటి పేజీ తరువాయి)

తప్పుడు సమాచారం ఇచ్చారని.. ఈ మేరకు ఆయన్ను అనర్హుడిగా ప్రకటించాలంటూ 2024 జనవరిలోనే విజయారెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఈ పిటిషన్ సింగిల్ బెంచ్‌జడ్జి వద్ద పెండింగ్‌లో ఉందని విజయారెడ్డి తరఫు న్యాయవాది సీజే ధర్మాసనం దృష్టికి తాజాగా తీసుకెళ్లారు. ఈ క్రమంలో దానిపై తుది తీర్పు వచ్చేదాకా ఖైరతాబాద్ ఉప ఎన్నికకు నోటిఫికేషన్ ఇవ్వకూడదని ఎన్నికల సంఘానికి ఆదేశాలు ఇవ్వాలని హైకోర్టుని కోరారు. ఈలోపు ఎన్నికల సంఘమే స్పందిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఆ పిటిషన్ పై తుది తీర్పు వచ్చేదాకా ఖైరతాబాద్ ఉప ఎన్నిక నోటిపికేషన్ జారీ చేయమని హైకోర్టుకు ఈసీ తెలిపింది. కాగా.. ప్రస్తుతం తెలంగాణలో ఖైరతాబాద్ ఉప ఎన్నిక హాట్ టాపిక్ గా మారిన సంగతి తెలిసిందే. పార్టీ ఫిరాయింపుల నేపథ్యంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా ఉన్న దానం నాగేందర్ అనర్హతకు గురైన నేపథ్యంలో ఆ అసెంబ్లీ నియోజకవర్గం ఖాళీ అయింది. ఈ క్రమంలో ఖైరతాబాద్ ఎలక్షన్ షెడ్యూల్ ను భారత ఎన్నికల కమిషన్ ప్రకటించాల్సి ఉంది. అయితే ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయకుండా ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలు జారీ చేయాలంటూ దివంగత నేత పీజేఆర్ కుమార్తె విజయారెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ పై ఇంకా హైకోర్టు తుది తీర్పు వెల్లడించక ముందే భారత ఎన్నికల సంఘం తెలంగాణ హైకోర్టు కు కీలక విషయాన్ని తెలిపింది. విజయారెడ్డి దాఖలు చేసిన ఎన్నికల పిటిషన్ పై తుది పరిష్కారం వచ్చేంత వరకూ ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గా నికి బై పోల్ నోటిఫికేషన్ జారీ చేయబోమని ఈసీఐ స్పష్టం చేసింది. దీంతో ఈ నియోజకవర్గంలో ఉప ఎన్నిక నిర్వహణ ప్రక్రియపై విచారణ తేలేంత వరకు తాత్కాలికంగా బ్రేక్ పడినట్లు అయింది. ఇక 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో దానం నాగేందర్ ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇచ్చారని.. ఈ మేరకు ఆయన్ను అనర్హుడిగా ప్రకటించాలంటూ 2024 జనవరిలోనే విజయారెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఈ పిటిషన్ సింగిల్ బెంచ్‌జడ్జి వద్ద పెండింగ్‌లో ఉందని విజయారెడ్డి తరఫు న్యాయవాది సీజే ధర్మాసనం దృష్టికి తాజాగా తీసుకెళ్లారు. ఈ క్రమంలో దానిపై తుది తీర్పు వచ్చేదాకా ఖైరతాబాద్ ఉప ఎన్నికకు నోటిఫికేషన్ ఇవ్వకూడదని ఎన్నికల సంఘానికి ఆదేశాలు ఇవ్వాలని హైకోర్టుని కోరారు. ఈలోపు ఎన్నికల సంఘమే స్పందిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఆ పిటిషన్ పై తుది తీర్పు వచ్చేదాకా ఖైరతాబాద్ ఉప ఎన్నిక నోటిపికేషన్ జారీ చేయమని హైకోర్టుకు ఈసీ తెలిపింది. ఇక దానం నాగేందర్ అనర్హతకు గురికావడంతో ప్రస్తుతం ఖైరతాబాద్ స్థానం ఖాళీగానే ఉంది. ఇదిలాఉంటే దిల్లీలోని తెలంగాణ భవన్ ఎదుట దానం నాగేందర్ కు వ్యతిరేకంగా ఫ్లెక్సీలు ఏర్పాటయ్యాయి. బీఆర్ఎస్ పార్టీ తరఫున గెలిచి కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్‌పై అనర్హత వేటు పడిందని ఆయన ఖైరతాబాద్ నుంచి పోటీ చేస్తే మరోసారి ఓడిపోవడం తథ్యమంటూ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఖైరతాబాద్ టికెట్ సీపీ వేణుగోపాల్ స్వామికి ఇవ్వాలంటూ డిమాండ్ చేస్తున్నారు.

# మద్దతు ధర ప్రకటించిన పంటలన్నింటినీ కేంద్రం కొనుగోలు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుందని, దీనికి గాను వ్యవసాయశాఖ ద్వారా అందించాల్సిన నివేదికలను వారికి ఇవ్వాల్సిందిగా మంత్రి ఆదేశించారు. కరువు తీవ్రతను బహుళ సూచికల ఆధారంగా అంచనా వేసి, అవసరమైన చోట క్షేత్రస్థాయి పరిశీలనతో పంట నష్టాన్ని నిర్ధారించాలని పేర్కొన్నారు. సాధారణ వర్షపాతంతో పోలిస్తే 20 నుంచి 59 శాతం లోటు ఉంటే లోటు వర్షపాతంగా, 60 నుంచి 99 శాతం లోటు ఉంటే భారీ లోటుగా, వర్షం పూర్తిగా లేకపోతే అత్యంత తీవ్రమైన పరిస్థితిగా పరిగణించాలని కరువు నిర్వహణ మార్గదర్శకాలు పేర్కొంటున్నాయి. అదే విధంగా, సాగు విస్తీర్ణం సాధారణంతో పోలిస్తే 85 శాతం కంటే తక్కువగా ఉండటం కరువు పరిస్థితికి, 75 శాతం లేదా అంతకంటే తక్కువగా ఉండటం తీవ్రమైన కరువు పరిస్థితికి సూచికగా పరిగణించాలని పేర్కొన్నట్లు మంత్రి తెలిపారు. మద్దతు ధర ప్రకటించడంతో కేంద్రం బాధ్యత అయిపోదని, ఆ మద్దతు ధర ప్రతి రైతుకు అందేలా చూడటం కూడా కేంద్ర ప్రభుత్వం యొక్క బాధ్యతే అని మంత్రి తుమ్మల అన్నారు. నిన్న కేంద్ర కేబినెట్ రబీ మార్కెటింగ్ సీజన్ 2027-28కు సంబంధించి కనీస మద్దతు ధరలను పెంచింది. ఇందులో కుసుమ పంటకు క్వింటాల్‌కు రూ. 675, రేప్‌సీడ్--ఆవాలకు రూ. 413, మసూర్‌కు రూ. 390, బార్లీకి రూ. 136, శనగకు రూ. 83, గోధుమకు రూ. 25 చొప్పున పెంపు ప్రకటించింది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం పిఎస్ఎస్ లో ఆయా రాష్ట్రాలలో సాగవుతున్న పప్పుధాన్యాలు, నూనెగింజల మొత్తం ఉత్పత్తిలో నాఫెడ్ ద్వారా కేవలం 25 శాతం మాత్రమే సేకరిస్తుందని, అలా కాకుండా ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితులు, వాతావరణ మార్పుల నేపథ్యంలో మద్దతు ధర ప్రకటించిన పంటలన్నింటినీ మద్దతు ధరకు కేంద్ర ప్రభుత్వం 100 శాతం కొనుగోలు చేయాలని మంత్రి తుమ్మల సూచించారు. మద్దతు ధర ప్రకటించడం మాత్రమే కాకుండా, రైతు పండించిన పంటను ఆ ధరకు విక్రయించుకునే అవకాశం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రతి రైతుకు అందేలా చిత్తశుద్ధితో కేంద్రం చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల కోరారు. ప్రకటించిన మద్దతు ధరకు 100 శాతం పంటల సేకరణ జరిగినప్పుడే రైతులకు కలుగుతుందని ఆయన అన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ సెక్రటరీ సురేంద్ర మోహన్, మార్కెటింగ్ ఎండి రాహుల్ రాజ్ మరియు హార్టికల్చర్ ఎండి యాస్మిన్ బాషా పాల్గొన్నారు.

# ఖైరతాబాద్ ఉప ఎన్నికకు బీజేపీ సన్నద్ధం

**ఖైరతాబాద్ ఉప ఎన్నికపై**

**కిషన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు**

**పార్టీ అభ్యర్థి ఎంపికపై త్వరలో నిర్ణయం..**

**కార్యకర్తల అభిప్రాయాలకూ ప్రాధాన్యం**



**హైదరాబాద్,అక్టోబర్ 01 :** ఖైరతాబాద్ నియోజకవర్గ ఉప ఎన్నిక నేపథ్యంలో కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర నాయకుడు జి. కిషన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఉప ఎన్నికకు సంబంధించి పార్టీ తరఫున అభ్యర్థి ఎంపిక, ఎన్నికల వ్యూహంపై పార్టీ నాయకత్వం చర్చిస్తున్నట్లు తెలిపారు. **అభ్యర్థి ఎంపికపై కసరత్తు** ఖైరతాబాద్ ఉప ఎన్నికలో పార్టీ తరఫున బలమైన అభ్యర్థిని బరిలోకి దించేందుకు కసరత్తు జరుగుతున్నట్లు కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. అభ్యర్థి ఎంపిక విషయంలో పార్టీ నాయకత్వం అన్ని అంశాలను పరిశీలిస్తుందని తెలిపారు. **కార్యకర్తలతో సమన్వయం** ఎన్నికల నేపథ్యంలో పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని కిషన్‌రెడ్డి సూచించారు. స్థానిక నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని తదుపరి నిర్ణయాలు ఉంటాయని తెలిపారు. **ఎన్నికలపై దృష్టి** ఖైరతాబాద్ ఉప ఎన్నికకు సంబంధించిన ఏర్పాట్లు, రాజకీయ పరిణామాలపై అన్ని పార్టీలు దృష్టి సారిస్తున్నాయి. ఈ నేపథ్యంలో బీజేపీ కూడా నియోజకవర్గంలో తన కార్యకలాపాలను ముమ్మరం చేయనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

# పైలట్ స్మిత్ మచ్చర్‌కు 'విశిష్ట గుజరాత్ గరిమా అవార్డు'

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర పురస్కారాన్ని ప్రకటించింది. ఆయనకు 'విశిష్ట గుజరాత్ గరిమా అవార్డు' అందించనున్నట్లు గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ ప్రకటించారు. **ప్రాణాలకు తెగించి ప్రయాణికుల రక్షణ** విమానంలో తీవ్ర పరిస్థితులు నెలకొన్న సమయంలో కెప్టెన్ స్మిత్ మచ్చర్ ధైర్యంగా వ్యవహరించి 174 మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడినట్లు గుజరాత్ ప్రభుత్వం పేర్కొంది. తీవ్రంగా గాయపడి రక్తస్రావం జరిగినప్పటికీ ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం ఇచ్చిన ఆయన ధైర్యసాహసాలను ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ ప్రశంసించారు. స్మిత్ మచ్చర్ ధైర్యం, మానవతా దృక్పథం గుజరాత్‌తో పాటు దేశానికి గర్వకారణమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఆయన సేవలను గౌరవిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రత్యేక పురస్కారాన్ని అందించనున్నట్లు తెలిపారు. **త్వరగా కోలుకోవాలని ప్రార్థనలు** కెప్టెన్ స్మిత్ మచ్చర్ త్వరగా కోలుకోవాలని గుజరాత్ ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. ఆయన ఆరోగ్యం కోసం సోమనాథ్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, మహా మృత్యుంజయ మంత్ర జపం చేపట్టినట్లు సమాచారం. స్మిత్ మచ్చర్ కుటుంబం గుజరాత్‌కు చెందినదని, చాలా కాలం క్రితమే ముంబైకి వెళ్లి స్థిరపడినట్లు అధికారులు తెలిపారు. స్మిత్ ప్రస్తుతం దుబాయిలో నివసిస్తున్నట్లు పేర్కొన్నారు.

# అక్టోబర్ 4న తెలంగాణలో అమిత్ షా పర్యటన

(మొదటి పేజీ తరువాయి)

అవుతున్న వేళ బీజేపీ నాయకత్వం కొత్త ప్రణాళిలతో బరిలోకి దిగుతోంది. అందులో భాగంగా నేరుగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన ఆసక్తిగా మారుతోంది. తెలంగాణలో బీజేపీ ఈ సారి కొత్త వ్యూహాలను అమలు చేస్తోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా పావులు కదుపుతోంది. గ్రేటర్ ఎన్నికల్లో సత్తా చాటేందుకు బీజేపీ అగ్రనాయకత్వం ఇప్పటికే పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేసింది. ఈ క్రమంలోనే కేంద్ర హోంమంత్రి అమిత్ షా అక్టోబర్ 4న తెలంగాణలో పర్యటించనున్నారు. అమిత్ షా పర్యటన కేవలం అధికారిక కార్యక్రమాలకే పరిమితం కాకుండా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలతో పాటుగా భవిష్యత్ వ్యూహాలకు కీలకంగా మారుతోంది. కాంగ్రెస్ – బీఆర్ఎస్ లక్ష్యంగా అమిత్ షా తెలంగాణలో పార్టీ నేతలకు ఇప్పటికే దిశా నిర్దేశం చేసారు. కేంద్ర మంత్రులు తరచూ తెలంగాణలో పర్యటిస్తూ... ప్రత్యేకంగా తటస్థులతో మమేకం కావాలని పార్టీ ఆదేశించింది. కాగా, తెలంగాణలో పార్టీ కార్యాచరణ పైన ఢిల్లీలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, రాష్ట్ర నాయకత్వానికి ఇప్పటికే దిశానిర్దేశం చేశారు. తెలంగాణలో ఎన్నికల హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, ప్రజా వ్యతిరేకతను అనుకూలంగా మలుచుకోవడానికి "సడక్ సే సదన్ తక్" కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే అమిత్ షా పర్యటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పర్యటనలో అమిత్ షా కరీంనగర్, మెదక్ జిల్లాలలో పర్యటించనున్నారు. కరీంనగర్‌లోని ప్రతిమ కాలేజ్ లో జరిగే కార్యక్రమంలో ఆయన పాల్గొనున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడమే ప్రధాన లక్ష్యంగా అమిత్ షా పర్యటన సాగనుందని పార్టీ నేతలు చెబుతున్నారు. అమిత్ షా పర్యటన ద్వారా పార్టీ క్యాడర్‌లో జోష్ నింపాలని, ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల్లోకి గట్టిగా తీసుకెళ్లాలని వ్యూహం సిద్ధం చేస్తున్నారు. దీంతో, అమిత్ షా పర్యటన పైన రాజకీయంగా ఆసక్తి నెలకొంది.

# మా ఆస్తులు.. మీ ఆస్తులు.. విచారణకు సిద్ధమా?

**హైదరాబాద్,అక్టోబర్ 01 :** మాజీ ముఖ్యమంత్రి, భారత రాష్ట్ర సమితి అధినేత కె. చంద్రశేఖర్‌రావు కుటుంబం, ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి కుటుంబ ఆస్తులపై సిట్టింగ్ హైకోర్టు లేదా సుప్రీంకోర్టు న్యాయమూర్తితో సమగ్ర విచారణ జరిపించేందుకు సిద్ధమా అని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. ఇరువర్గాల కుటుంబాల ఆస్తులు, భూముల వివరాలను సమగ్రంగా పరిశీలించేలా స్వతంత్ర న్యాయ విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. జాతీయ సమైక్యతా దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం కేటీఆర్ విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే ప్రత్యేక దర్యాప్తు బృందాల కంటే సిట్టింగ్ న్యాయమూర్తి నేతృత్వంలో విచారణ జరగాలని ఆయన పేర్కొన్నారు. న్యాయవ్యవస్థపై తమకు విశ్వాసం ఉందని, ఇరువర్గాలకూ ఒకే విధమైన ప్రమాణాలతో విచారణ జరగాలని కోరారు. **పుట్టినప్పటి నుంచి ఆస్తులపై పరిశీలన** కేసీఆర్ కుటుంబ ఆస్తులను ఆయన జన్మించినప్పటి నుంచి ఇప్పటి వరకు పరిశీలించినట్లే, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుటుంబ ఆస్తులను కూడా ఆయన జన్మించినప్పటి నుంచి ప్రస్తుత పరిస్థితి వరకు పరిశీలించాలని కేటీఆర్ ప్రతిపాదించారు. భూముల కొనుగోళ్లు, ఆస్తుల వివరాలు, వాటి పెరుగుదల, సంబంధిత లావాదేవీలను విచారణ పరిధిలోకి తీసుకురావాలని కోరారు. రాజకీయ నాయకులు, వారి కుటుంబ సభ్యుల ఆస్తులపై వస్తున్న ఆరోపణలకు అధికారిక పత్రాలు, భూ రికార్డులు, ఎన్నికల అఫిడవిట్లు తదితర ఆధారాల ద్వారా స్పష్టత రావాల్సి ఉంటుందని కేటీఆర్ పేర్కొన్నారు. తమ పార్టీ నేతలు ఎన్నికల సమయంలో సమర్పించిన ఆస్తుల వివరాలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. **ఎర్రవల్లి భూముల అంశంపై కేటీఆర్ వ్యాఖ్యలు** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు చెందిన ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రం చుట్టూ ఉన్న భూములపై రాష్ట్ర ప్రభుత్వం విచారణకు చర్యలు చేపట్టిన నేపథ్యంలో కేటీఆర్ ఈ సవాల్ చేశారు. కేసీఆర్ కుటుంబానికి సంబంధించిన భూములపై ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరగాలని, అదే సమయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి కుటుంబ ఆస్తులపై కూడా విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎర్రవల్లి భూముల విషయంలో భూమి విస్తీర్ణంపై వేర్వేరు సంఖ్యలు ప్రస్తావనకు వచ్చిన విషయాన్ని కేటీఆర్ ప్రస్తావించారు. ఈ అంశంలో వాస్తవాలను అధికారిక భూ రికార్డులు, విచారణ ద్వారానే తేల్చాలని ఆయన పేర్కొన్నారు. ఆరోపణలు, రాజకీయ ప్రకటనల ఆధారంగా తుది నిర్ణయాలకు రావడం కంటే న్యాయపరమైన ప్రక్రియ ద్వారా వాస్తవాలను నిర్ధారించాల్సిన అవసరం ఉందని ఆయన వాదించారు. **రెండు ప్రభుత్వాల కాలంలోని భూములపైనా విచారణ** గత భారత రాష్ట్ర సమితి ప్రభుత్వ కాలంలో అమలైన ధరణి వ్యవస్థతో పాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ కాలంలో అమలవుతున్న భూ భారతి వ్యవస్థలో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న భూ లావాదేవీలు, భూ రికార్డుల అంశాలను కూడా విచారణ పరిధిలోకి తీసుకురావాలని కేటీఆర్ కోరారు. ఇరువైపులా ఒకే విధమైన ప్రమాణాలతో పరిశీలన జరగాలని ఆయన పేర్కొన్నారు. తమ కుటుంబం లేదా పార్టీ నేతల ఆస్తుల్లో అక్రమాలు ఉన్నట్లు న్యాయ విచారణలో తేలితే చట్టపరమైన పరిణామాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని కేటీఆర్ తెలిపారు. ఇదే విధంగా ముఖ్యమంత్రి కూడా న్యాయ విచారణకు అంగీకరించాలని ఆయన సవాల్ చేశారు.

# సర్ ప్రక్రియ పొడిగింపు లేదు

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించారు. ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 80 వేల మందికి నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. వారిలో 20 శాతం మంది సమాధానం ఇచ్చారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 92 లక్షల మందిలో 65 లక్షల మంది నోటీసులపై స్పందించినట్లు చెప్పారు. నోటీసులు అందిన వారి ఇళ్ల వద్దకు బీఎల్‌ఓలు వెళ్లి సంబంధిత పత్రాలను తీసుకుంటున్నారని పేర్కొన్నారు. నోటీసులు అందిన కుటుంబ సభ్యులు అందరూ అందుబాటులో ఉండవల్సిన అవసరం లేదని, ఒక్కరు ఉండి, మిగిలిన అందరి కుటుంబ సభ్యుల వివరాలు ఇస్తే సరిపోతుందని అన్నారు. సర్ ప్రక్రియను మరోసారి పొడిగించే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు.

# భరత్‌నగర్ కాలనీలో పారిశుద్ధ్య కార్యక్రమం

- పరిశుభ్రతతోనే ఆరోగ్య పరిరక్షణ..

తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేయాలి:

- డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి



**బాలానగర్ అక్టోబర్ 02 ( పీపుల్స్ న్యూస్)**
కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని భరత్‌నగర్ కాలనీలో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరిచే లక్ష్యంతో గురువారం ఉదయం ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. మూసాపేట సర్కిల్ ఉప కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొని పారిశుద్ధ్య పనులను చేపట్టారు. కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని భరత్‌నగర్ కాలనీలో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరిచే లక్ష్యంతో గురువారం ఉదయం ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. మూసాపేట సర్కిల్ ఉప కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొని పారిశుద్ధ్య పనులను చేపట్టారు.ఈ కార్యక్రమంలో ఉప కమిషనర్ శ్రీనివాస్ రెడ్డితో పాటు సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్ శంకర్, నిరంజన్ తదితరులు పాల్గొని కాలనీలో పరిశుభ్రత పనులను పర్యవేక్షించారు. పరిసరాల్లో చెత్తాచెదారం పేరుకుపోకుండా చూడటంతో పాటు, కాలనీలో పరిశుభ్రమైన వాతావరణాన్ని నెలకొల్పేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఉప కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, కాలనీలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అంటువ్యాధుల వ్యాప్తిని అరికట్టవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఇంటి నుంచి వెలువడే తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి, ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ వాహనాలకు అందించాలని సూచించారు. చెత్తను రోడ్లపై, ఖాళీ స్థలాల్లో పడవేయకుండా ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ పి. నాగిరెడ్డి మాట్లాడుతూ, కాలనీ పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, పారిశుద్ధ్య నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని తెలిపారు. కాలనీలో ఎలాంటి అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, చెత్తను తడి, పొడిగా వేరు చేసి పారిశుద్ధ్య సిబ్బందికి అందించడం అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు నాగేశ్వర్ రావు, ప్రధాన కార్యదర్శి బాబు, కోశాధికారి నరేష్ కుమార్, రత్నారావు, మధు, వెంకటేష్ యాదవ్, డేవిడ్, వెంకటేష్, శ్రీనివాస్, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాలనీని పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా సహకరించాలని అధికారులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.

# దివంగత ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి అసెంబ్లీ నివాళి



**నర్సంపేట, అక్టోబరు 1::** నర్సంపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యుడు, దివంగత నేత పెద్ది సుదర్శన్‌రెడ్డి మృతికి తెలంగాణ శాసనసభ సంతాపం వ్యక్తం చేసింది. ఈ మేరకు సెప్టెంబరు 8న అసెంబ్లీలో శ్రద్ధాంజలి తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించి, ఆయన సేవలను స్మరించుకుంటూ నివాళులర్పించింది.తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సంతకం చేసిన శ్రద్ధాంజలి తీర్మానం ఫొటోకాపీని గురువారం నల్లబెల్లి ఎంఆర్‌ఓ ముప్పు కృష్ణ వరంగల్ జిల్లా మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న సుదర్శన్‌రెడ్డికి అందజేశారు.“వరంగల్ జిల్లాలోని నర్సంపేట శాసనసభ నియోజకవర్గ మాజీ సభ్యుడు పెద్ది సుదర్శన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు అందించిన నిరుపమాన సేవలను స్మరిస్తూ శాసనసభ ఘనంగా నివాళులర్పించింది. ఆయన మృతి పట్ల సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, శోకసంతప్త కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తోంది” అని తీర్మానంలో పేర్కొన్నారు. అనంతరం సభ కొద్దిసేపు మౌనం పాటించి దివంగత నేతకు శ్రద్ధాంజలి ఘటించింది

# ఆరోగ్య కేంద్రానికి ‘స్వచ్ఛ’ రూపు

- ఘనంగా ‘స్వచ్ఛతే మా సేవ’కార్యక్రమం
- మన్నద్ సబ్ సెంటర్ ఆవరణలో శ్రమదానం చేసిన సర్పంచ్, గ్రామస్థులు



**ముధోల్ (లోకేశ్వరం), అక్టోబర్ 1:** మండల పరిధిలోని మన్మద్ గ్రామంలో గల హెల్త్ సబ్ సెంటర్ (ఆరోగ్య ఉప కేంద్రం) ఆవరణలో గ్రామ పంచాయతీ సర్పంచ్ లలిత భోజన్న ఆధ్వర్యంలో గురువారం స్థానిక మహిళలు,గ్రామస్థులు కలిసి పెద్ద ఎత్తున శ్రమదానం నిర్వహించారు. ‘స్వచ్ఛతే మా సేవ’ కార్యక్రమంలో భాగంగా సబ్ సెంటర్ పరిసరాల్లో ఈ పారిశుధ్య పనులు చేపట్టారు.గత కొన్ని రోజులుగా ఆసుపత్రి పరిసర ప్రాంతాల్లో విపరీతంగా పెరిగిన పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు, చెత్తాచెదారాన్ని గ్రామానికి చెందిన మహిళా సంఘాల సభ్యులు, ఆశా కార్యకర్తలు, విడిసి సభ్యులు దగ్గరుండి తొలగించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇన్ఫెక్షన్లు సోకకుండా,పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా శ్రద్ధ తీసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ లలిత భోజన్న మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లతో పాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని, స్వచ్ఛతను ఒక అలవాటుగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో విడిసి సభ్యులు,సబ్ సెంటర్ సిబ్బంది,స్థానిక మహిళలు మరియు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# బాలనగర్ లోని సాయి రాజ్ కమర్షియల్ కిచెన్ ఎక్విప్‌మెంట్స్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదం మరచిపోయారా...? లేక అధికారుల నిర్లక్ష్యమా..?

- అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారా?
- నిబంధనలు బేఖాతరు.. రహదారిపైనే సిమెంట్ రోడ్డు!
- బాలానగర్ ఆర్ ఎన్ సి ఆసుపత్రి నిర్వాహకుల తీరుపై స్థానికుల ఆగ్రహం.. పట్టించుకోని అధికారులు? రోడ్డుపైనే అక్రమ పార్కింగ్ ......ఎన్ ఆర్ ఎస్ ఏ యూటర్న్ లో యదేచ్ఛగా అక్రమ పార్కింగ్.....



**బాలానగర్ అక్టోబర్ 02 ( పీపుల్స్ న్యూస్)**
సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మూసా పేట సర్కిల్ బాలా నగర్ డివిజన్ పరిధిలో ఆర్‌ఎన్ సీ ఆసుపత్రి యాజమాన్యం రహదారి నిబంధనలను ఉల్లంఘించి ప్రధాన రహదారిపై సిమెంట్ కాంక్రీట్ రోడ్డు నిర్మించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ పరిధిలోని రహదారిపై సంబంధిత శాఖల నుంచి ముందస్తు అనుమతులు తీసుకోకుండా ప్రైవేటు వ్యక్తులు లేదా సంస్థలు తమకు ఇష్టాను సారంగా నిర్మాణాలు చేపట్టడం నిబంధనలకు విరుద్ధమని స్థానికులు పేర్కొంటున్నారు. అయితే ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**-- అనుమతులు లేకుండా నిర్మాణం ఎలా?**
బాలానగర్‌లోని ప్రధాన రహదారులు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ పరిధిలో ఉంటాయి. ప్రైవేటు ఆసుపత్రి ముందు వాహనాల రాకపోకలకు సౌకర్యంగా ఉండేందుకు, నీరు నిల్వ ఉండకుండా చేసేందుకు లేదా రహదారికి అనుసంధానంగా అదనపు మార్గం ఏర్పాటు చేయాలన్నా ముందుగా సంబంధిత అధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. రహదారి హక్కు లేదా ప్రవేశ అనుమతి కోసం అధికారికంగా దరఖాస్తు చేసుకుని, అధికారులు స్థలాన్ని పరిశీలించిన అనంతరం నిబంధనలకు అనుగుణంగా ఉంటేనే అనుమతి పొందాల్సి ఉంటుందని వారు తెలిపారు. అవసరమైన రుసుము చెల్లించిన తర్వాతే అధికారిక అనుమతితో పనులు చేపట్టాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

**-- ప్రధాన తారు రోడ్డుపై నేరుగా సీసీ రోడ్డు?**
ఆర్‌ఎంసీ ఆసుపత్రి వద్ద ఇప్పటికే ఉన్న తారు రహదారిపై నేరుగా సిమెంట్ కాంక్రీట్ రోడ్డు నిర్మించడం వల్ల రహదారి ఎత్తు పెరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ప్రధాన రహదారిపై ప్రయాణించే వాహనాలకు ఎత్తు, దిగువల తేడాలు ఏర్పడి ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని చెబుతున్నారు.
అదేవిధంగా రహదారి పక్కన ఎలాంటి ప్రణాళిక లేకుండా నిర్మాణాలు చేపట్టడం వల్ల వర్షపు నీరు వెళ్లే కాలువలు మూసుకుపోయే ప్రమాదం ఉందని, ఫలితంగా వర్షాకాలంలో రోడ్లపై నీరు నిలిచిపోయి రహదారి దెబ్బతినే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

**-- అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారా?**
ప్రభుత్వ రహదారి పరిధిలో ప్రైవేటు యాజమాన్యం అనుమతులు లేకుండా పనులు చేపడుతున్నట్లు ఆరోపణలు ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రహదారి నిర్మాణానికి అనుమతి ఉందా? లేక నిబంధనలను ఉల్లంఘించి పనులు చేపట్టారా? అనే విషయాలను అధికారులు వెంటనే పరిశీలించాలని కోరుతున్నారు.ప్రభుత్వ ఆస్తికి నష్టం కలిగించేలా అనధికారిక నిర్మాణం చేపట్టినట్లు నిర్ధారణ అయితే, సంబంధిత నిబంధనల ప్రకారం బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, అవసరమైతే నిర్మాణాన్ని తొలగించి రహదారిని యథావిధిగా పునరుద్ధరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**-- సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలి!?**
ఆసుపత్రి ముందు రహదారి సౌకర్యం లేకపోయినా, వాహనాల రాకపోకలకు అనుసంధానం అవసరమైనా అధికారిక మార్గంలో దరఖాస్తు చేసుకోవాల్సిందేనని స్థానికులు స్పష్టం చేస్తున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా ఉంటేనే అనుమతి మంజూరు చేయాలని కోరుతున్నారు.ప్రైవేటు సంస్థలకు ఒక న్యాయం.. సామాన్యులకు మరో న్యాయం అన్నట్లుగా వ్యవహరించకుండా, రహదారి నిర్మాణంపై పూర్తి స్థాయి విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు. ఆర్‌ఎంసీ ఆసుపత్రి వద్ద నిర్మించిన సిమెంట్ రహదారికి అనుమతులు ఉన్నాయా లేదా అనే విషయాన్ని అధికారులు స్పష్టం చేయాలని, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# బాసర బాలుడి అరుదైన ఘనత: చిన్న వయసులోనే ఋుగ్వేద ఘనాంతం పూర్తి



**ముధోల్ (బాసర),అక్టోబరు ):** నిర్మల్ జిల్లా బాసరకు చెందిన అధర్వ బాసార్కర్ అనే బాలుడు అత్యంత చిన్న వయసులోనే ఋుగ్వేద ఘనాంతాన్ని పూర్తి చేసి విశేష గుర్తింపు సాధించాడు. వ్యాసపుర చరిత్రలోనే ఇంత చిన్న వయసులో ఈ ఘనత సాధించడం అత్యంత అరుదైన విషయమని శ్రీ జ్ఞానసరస్వతి ఆలయ వైదిక బృందం ప్రశంసించింది.
బాలుడి పట్టుదల, ఏకాగ్రతతో పాటు వేదవిద్యపై ఉన్న ఆసక్తి, నిరంతర సాధనే ఈ విజయానికి కారణమని పండితులు కొనియాడారు. అధర్వ సాధించిన ఈ ఘనత మన ఆధ్యాత్మిక, వేదవిద్యా సాంప్రదాయానికి మరింత వన్నె తెచ్చిందని ఆలయ అర్చకులు పేర్కొన్నారు. ఈసందర్భంగా బాలుడిని, అతని తల్లిదండ్రులను వేద పండితులు ప్రత్యేకంగా అభినందించారు.

# తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం.. హైదరాబాద్ సిటీ పోలీస్ పరిధిలో భారీ పునర్వ్యవస్థీకరణ..

**హైదరాబాద్** సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో తెలంగాణ ప్రభుత్వం భారీ స్థాయిలో పునర్వ్యవస్థీకరణ చేపట్టింది. పోలీస్ జోన్లు, డివిజన్లు, పోలీస్‌స్టేషన్ల పరిధులను పునర్విభజిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మొత్తం 76 ప్రాంతాలకు సంబంధించి పరిధుల్లో మార్పులు చేసింది. పరిపాలనా సౌలభ్యం, పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు పలు పోలీస్‌స్టేషన్ల పరిధులను ఇతర జోన్లు, డివిజన్లకు అధికారులు బదిలీ చేశారు. ముఖ్యంగా మార్కెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న పలు ప్రాంతాలను మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోకి తెచ్చారు.శంషాబాద్ డివిజన్‌లోనూ పోలీస్‌స్టేషన్ల పరిధులను అధికారులు పునర్వ్యవస్థీకరించారు. ఆర్జీఐఏ పోలీస్‌స్టేషన్ పేరును శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌గా మార్చడంతో పాటు మహేశ్వరం, శంషాబాద్, సైబరాబాద్ పరిధుల్లోనూ మార్పులు చేశారు. శంషాబాద్ డివిజన్‌లోని ఆర్జీఐఏ పీఎస్, శంషాబాద్ పీఎస్‌లను పునర్వ్యవస్థీకరించారు. అలాగే రాజేంద్రనగర్ పీఎస్ పరిధిలోని పలు ప్రాంతాల్లోనూ మార్పులు చేశారు. అబ్దుల్లాపూర్‌మెట్, మీర్‌పేట్ ప్రాంతాల పోలీస్ పరిధుల్లో మార్పులు జరిగాయి. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, సనత్‌నగర్ ప్రాంతాల్లోనూ పరిధుల పునర్విభజన జరిగింది.

# ఘనంగా ప్రారంభమైన బొడ్డెమ్మ సంబరాలు

- మహాత్మా గాంధీ రోడ్డులో బొడ్డెమ్మ వేడుకలు



**నల్లబెల్లి,అక్టోబర్ 1:**
మండలంలోని మహాత్మా గాంధీ రోడ్డు కాలనీలో బొడ్డెమ్మ సంబరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తెలంగాణ ఆడపడుచుల సంప్రదాయ పండుగల్లో ప్రత్యేక స్థానం కలిగిన బొడ్డెమ్మ వేడుకలను మహిళలు, యువతులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా బొడ్డెమ్మను వివిధ రకాల పూలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బొడ్డెమ్మ చుట్టూ తిరుగుతూ సంప్రదాయ పాటలు పాడి సంబరాలు జరుపుకున్నారు. చిన్నారులు, యువతులు సైతం ఉత్సాహంగా పాల్గొని వేడుకలకు మరింత కళను తీసుకొచ్చారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బొడ్డెమ్మ పండుగను మహిళలు ప్రతి ఏటా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తుంటారు. పూలతో బొడ్డెమ్మను అలంకరించి పూజలు నిర్వహించడం, అనంతరం మహిళలంతా కలిసి సంప్రదాయ పాటలు పాడుతూ సామూహికంగా వేడుకలు జరుపుకోవడం ఈ పండుగ ప్రత్యేకత.మహాత్మా గాంధీ రోడ్డు కాలనీలో బొడ్డెమ్మ సంబరాలు ప్రారంభం కావడంతో కాలనీలో పండుగ సందడి నెలకొంది. మహిళలు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని పాటలు పాడుతూ ఆనందోత్సాహాల మధ్య వేడుకలను నిర్వహించారు.

శుక్రవారం,
అక్టోబర్ 02, 2026
హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక



# పోర్తెట్టి బుచ్చిరాం మృతి తీరని లోటు: ఎమ్మెల్సీ దండే విఠల్



**కొమరం భీం /పెంచికల్‌పేట్, అక్టోబర్ :** మండలంలోని మారుమూల గిరిజన ప్రాంతమైన కమ్మర్‌గాం గ్రామానికి చెందిన సీనియర్ గిరిజన నాయకుడు పోర్తెట్టి బుచ్చిరాం మృతి గిరిజన సమాజానికి తీరని లోటని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. కమ్మర్‌గాం గ్రామపంచాయతీకి సుమారు 30 ఏళ్ల పాటు సర్పంచ్‌గా సేవలందిస్తూ, గ్రామ అభివృద్ధితో పాటు గిరిజనుల హక్కులు, సంక్షేమం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు.గిరిజనుల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంలో, సమాజాన్ని ఐక్యంగా ముందుకు నడిపించడంలో బుచ్చిరాం కీలక పాత్ర పోషించారని అన్నారు. అనంతరం ఆయన పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన ఎమ్మెల్సీ దండే విఠల్ గారు, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# మామునూరు విమానాశ్రయానికి దొడ్డి కొమురయ్య పేరు పెట్టాలి

- నేడు హన్మకొండ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం
- తెలంగాణ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహణ
- సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి హాజరు
- ప్రజా, విద్యార్థి, యువజన సంఘాలు పాల్గొనాలని పిలుపు

**హన్మకొండ, అక్టోబర్ 2 :** వరంగల్ మామునూరు విమానాశ్రయానికి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరుడు దొడ్డి కొమురయ్య పేరు పెట్టాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఇంట లెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో నేడు రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు హన్మకొండ ప్రెస్‌క్లబ్‌లో జరిగే ఈ సమావేశానికి సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి హాజరవుతారని ఫోరం ప్రతినిధులు తెలిపారు.తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రలో దొడ్డి కొమురయ్యకు ప్రత్యేక స్థానం ఉందని పేర్కొన్నారు. 1946 జూలై 4న ఆయన అమరుడయ్యారని, ప్రజల కోసం ప్రాణత్యాగం చేసిన పోరాట యోధుల చరిత్రను భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. మామునూరు విమానాశ్రయానికి దొడ్డి కొమురయ్య పేరు పెట్టడం సాయుధ పోరాట అమరవీరులకు ఇచ్చే గౌరవంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ, షేక్ బందగీ, దొడ్డి కొమురయ్యతో పాటు అనేక మంది ప్రజల హక్కుల కోసం పోరాడారని ఫోరం ప్రతినిధులు పేర్కొన్నారు. తెలంగాణలోని ముఖ్యమైన నిర్మాణాలు, సంస్థలకు ప్రజల కోసం పోరాడిన అమరవీరుల పేర్లకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కుల, మతాలకు అతీతంగా దొడ్డి కొమురయ్య పేరు సముచితంగా ఉంటుందని తెలిపారు.మామునూరు విమానాశ్రయానికి దొడ్డి కొమురయ్య పేరు పెట్టే అంశాన్ని ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించి సానుకూల నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. రౌండ్‌టేబుల్ సమావేశంలో అన్ని వర్గాల ప్రజలు, ప్రజాసంఘాలు, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ ఇంటలెక్చువల్ ఫోరం పిలుపునిచ్చింది.

# ఒకే ఇంట్లో ఇద్దరు డాక్టర్లు: నిరుపేద రైతు బిడ్డల ప్రతిభను అభినందించిన మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి



**ముధోల్ (నర్సాపూర్), అక్టోబర్ 01):** నర్సాపూర్ మండలంలోని బూరుగుపల్లి జి తండాకు చెందిన ఓ నిరుపేద రైతు కుటుంబంలో అద్భుతం ఆవిష్కృతమైంది. కష్టాలెన్నెదురైనా వెనకడుగు వేయకుండా ఆ తండ్రి పడ్డ శ్రమకు తగ్గట్టుగానే..అతని ఇద్దరు పిల్లలు వైద్య విద్యకు ఎంపికై ఆ కుటుంబానికి తీరని కీర్తిని తెచ్చిపెట్టారు.తండాకు చెందిన జాదవ్ అనిల్ కుమార్తె జాదవ్ అనితకు తాజాగా ఎంబీబీఎస్ లో సీటులభించింది.కుటుంబానికి చెందిన అనిల్ కుమారుడు జాదవ్ యు వరాజ్ సైతం గత సంవత్సరమే ఎంబీబీఎస్ సీటు సాధించి ప్రస్తుతం వైద్య విద్యాభ్యాసం కొన సాగిస్తున్నారు.నిరుపేద రైతు కుటుంబంలో జన్మించి,ఎన్నో ఆర్థిక ఇబ్బందులను ఓర్చి, పిల్లలను ఇంత గొప్ప స్థాయికి చేర్చడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.ఈ క్రమంలోనే ముథోల్ నియో జకవర్గ మాజీ శాసనసభ్యులు శ్రీ జి.విఠల్ రెడ్డి గారు సదరు రైతు జాదవ్ అనిల్ నివాసానికి వెళ్లి, ఆయనను ప్రత్యేకంగా కలిసి అభినందించారు.ఒకే ఇంట్లో ఇద్దరు పిల్లలు డాక్టర్ చదువులకు ఎం పికవ్వడం ఆదర్శనీయమని కొనియాడుతూ,ఆ కుటుంబానికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.

# సింగరేణి బకాయిలు వెంటనే విడుదల చేయాలి: మాజీ ఎమ్మెల్యే అమూరాజుల శ్రీదేవి



**బెల్లంపల్లి , అక్టోబర్ 1 :**
రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థకు చెల్లించాల్సిన రూ.55 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన “సింగరేణి బకాయి బీజేపీ లడాయి” కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అమూరాజుల శ్రీదేవి మాట్లాడారు.
బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వేరబెల్లి నాయకత్వంలో మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆమె పాల్గొని, సింగరేణి సంస్థకు రావాల్సిన బకాయిల చెల్లింపుపై తన అభిప్రాయాలను వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని సింగరేణి సంస్థకు రావాల్సిన నిధుల చెల్లింపుపై తమ నిరసనను వ్యక్తం చేశారు.

# యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌కు రూ.2 కోట్ల చేయూత

**●విద్యకు చేసే సాయం తరతరాలకు ఉపయోగం: డీజీపీ సి.వి. ఆనంద్**




**హైదరాబాద్, క్రైమ్ బ్యూరో అక్టోబర్ 1 (పీపుల్స్ న్యూస్)** యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ నిర్మాణానికి కార్పొరేట్ సంస్థలు, దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని డీజీపీ సి.వి. ఆనంద్ అన్నారు. విద్య కోసం అందించే సహాయం సమాజంపై శాశ్వత ప్రభావాన్ని చూపుతుందని, దాని ప్రయోజనాలు భవిష్యత్ తరాలకు కూడా అందుతాయని పేర్కొన్నారు.మంచిరేవులలోని యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ (౯ూూ) అకడమిక్ బ్లాక్ నిర్మాణానికి ఎంవైకే లాటిక్రెట్ (ఎంవైకే ఫౌండేషన్) సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత (జూ=)లో భాగంగా రూ.2 కోట్ల విరాళాన్ని అందించింది. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, వైస్ చైర్మన్ మురళీ యాదమ గురువారం డీజీపీ కార్యాలయంలో సి.వి. ఆనంద్‌కు రూ.2 కోట్ల చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది పిల్లలతో పాటు సాధారణ ప్రజల పిల్లలకు నాణ్యమైన విద్య, మెరుగైన అవకాశాలు కల్పించడమే యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ లక్ష్యమని తెలిపారు. విద్యా సంస్థల నిర్మాణానికి కార్పొరేట్ సంస్థలు, దా తలు, ఇతర భాగస్వాములు అందిస్తున్న సహకారం ప్రాజెక్టుకు మరింత బలాన్నిస్తుందని చెప్పారు.విద్యారంగానికి అందించే విరా ళాలు, చేయూత ఎప్పటికీ విలువైనవేనని, సమాజ అభివృద్ధికి దీర్ఘకాలిక ప్రయోజనాలను అందిస్తాయనిడీజీపీ సి.వి. ఆనంద్ పేర్కొన్నారు.

# పల్లవి మోడల్ స్కూల్‌లో స్వచ్ఛతపై అవగాహన

**‘క్లీన్ రోడ్--సేఫ్ రోడ్’పై విద్యార్థులకు అవగాహన**











**మల్కాజిగిరి కమిషనరేట్, క్రైమ్ బ్యూరో అక్టోబరు 1 (పీపుల్స్ న్యూస్)** స్వచ్ఛత హీ సేవా--2026 కార్యక్రమంలో భాగంగా బోయిన్‌పల్లిలోని పల్లవి మోడల్ స్కూల్‌లో ట్రాఫిక్ పోలీసులు స్వచ్ఛతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్ ఆదేశాల మేరకు, ట్రాఫిక్--× డీసీపీ కె. రాహుల్ రెడ్డి, ఐపీఎస్ పర్యవేక్షణలో కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ట్రాఫిక్ తిరుమలగిరి డివిజన్ ఏసీపీ జి. శంకర్ రాజు మాట్లాడుతూ స్వచ్ఛత అనేది కేవలం ఇల్లు, కార్యాలయం, పరిసరాలను శుభ్రంగా ఉంచడం మాత్రమే కాదని, ప్రతి పౌరుడి బాధ్యత, అలవాటు, సామాజిక కర్తవ్యమని తెలిపారు.రోడ్లు, ఫుట్‌పాత్‌లు, కాలువలు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడేయడం వల్ల కాలువలు మూసుకుపోయి వర్షపు నీటి ప్రవాహానికి అంతరాయం కలగడంతో పాటు పర్యావరణం, ప్రజారోగ్యం, ట్రాఫిక్‌పై ప్రతికూల ప్రభావం పడుతుందని వివరించారు.‘క్లీన్ రోడ్--సేఫ్ రోడ్’ భావనను ప్రతి ఒక్కరిలో పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. పరిశుభ్రమైన, అడ్డంకులు లేని రహదారులు సురక్షితమైన, సాఫీ ట్రాఫిక్‌కు దోహదపడతాయని పేర్కొన్నారు.విద్యార్థులు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా డస్ట్‌బిన్‌లను వినియోగించాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, రోడ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఇతరులు కూడా పరిశుభ్రతను పాటించేలా అవగాహన కల్పించాలని కోరారు.‘మార్పు మన నుంచే ప్రారంభం కావాలి’ అని ఏసీపీ శంకర్ రాజు పేర్కొంటూ స్వచ్ఛత కేవలం ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థల బాధ్యత కాదని, ప్రతి పౌరుడి సామూహిక బాధ్యత అని తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులు ‘నా ఇల్లు--నా బాధ్యత, నా వీధి--నా బాధ్యత, నా నగరం--నా బాధ్యత, నా దేశం--నా బాధ్యత’ అంటూ స్వచ్ఛత సంకల్పం చేశారు.విద్యార్థులు, ప్రజల్లో స్వచ్ఛత, పౌర బాధ్యత, పర్యావరణ పరిరక్షణతో పాటు పరిశుభ్రమైన, సురక్షితమైన రహదారుల ప్రాధాన్యతపై అవగాహన కల్పించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు..

# జేబీఎస్‌లో డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన

**- ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల నివారణకు సహకరించాలి: ఏసీపీ శంకర్ రాజు**





**మల్కాజిగిరి కమిషనరేట్, క్రైమ్ బ్యూరో అక్టోబర్ 1 (పీపుల్స్ న్యూస్)** జూబ్లీ బస్ స్టేషన్ (జేబీఎస్)లో డ్రైవర్లకు రోడ్డు భద్రతపై ట్రాఫిక్ పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్ ఆదేశాల మేరకు, ట్రాఫిక్--× డీసీపీ కె. రాహుల్ రెడ్డి, ఐపీఎస్ పర్యవేక్షణలో కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ట్రాఫిక్ తిరుమలగిరి డివిజన్ ఏసీపీ జి. శంకర్ రాజు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణలో డ్రైవర్ల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. ప్రయాణికులు, పాదచారులు, ఇతర రహదారి వినియోగదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా వాహనాలు నడపాలని సూచించారు.ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని, నిర్ణీత వేగ పరిమితులకు లోబడి వాహనాలు నడపాలని సూచించారు. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని, మద్యం సేవించి వాహనం నడపకూడదని స్పష్టం చేశారు.వాహనం నడుపుతున్న సమయంలో మొబైల్ ఫోన్ వినియోగించరాదని, వర్తించే సందర్భాల్లో సీటు బెల్ట్ ధరించాలని తెలిపారు. ట్రాఫిక్ సిగ్నళ్లు, రహదారి సూచికలు, లేన్ నిబంధనలు పాటించడంతో పాటు వాహనాల్లో అధిక లోడును నివారించాలని సూచించారు.
వాహనాలు రోడ్డు ప్రయాణానికి అనువైన స్థితిలో ఉన్నాయో లేదో ముందుగానే నిర్ధారించుకోవాలని, ప్రయాణికుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఏసీపీ సూచించారు. పాదచారు లు, ఇతర రహదారి వినియోగదారుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.రోడ్డు ప్రమాదాలను నివారించి ప్రాణాలను కాపాడేందుకు డ్రైవర్లు సంయమనం, క్రమశిక్షణ పాటిస్తూ వాహనాలు నడపాలని శంకర్ రాజు సూచించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి ఉమ్మడి బాధ్యత అని, ప్రమాదాల నివారణలో డ్రైవర్ల పాత్ర అత్యంత కీలకమని తెలిపారు.

# నెక్లెస్ రోడ్డుపై సైబర్ భద్రతకు వెలుగుల బాట

**-- సుమారు 3 వేల మందితో 'ఫ్లాష్--పాజ్ ఫర్ సేఫ్టీ' లైట్ మార్చ్**













**హైదరాబాద్ : క్రైమ్ బ్యూరో, అక్టోబర్ 1 (పీపుల్స్ న్యూస్)**
సైబర్ మోసాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్డుపై 'సైబర్ సెక్యూరిటీ ఫ్లాష్--పాజ్ ఫర్ సేఫ్టీ' లైట్ మార్చ్ నిర్వహించారు. పీపుల్స్ ప్లాజా నుంచి సుమారు రెండు కిలోమీటర్ల మేర సాగిన ఈ నడకతో అక్టోబరు నెల సైబర్ సెక్యూరిటీ అవేర్‌నెస్ మాసానికి శ్రీకారం చుట్టారు.డీజీపీ సి.వి. ఆనంద్ జెండా ఊపి మార్చ్‌ను ప్రారంభించారు. హోంశాఖ ముఖ్య కార్యదర్శి, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్, సినీ నటుడు అడివి శేష్, హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ల పోలీస్ కమిషనర్లు, పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.కార్యక్రమంలో సుమారు మూడు వేల మంది పాల్గొన్నారు. పోలీసులు, విద్యార్థులు, మాజీ సైనికులు, కార్మికులు, మహిళా వాలంటీర్లు, కుటుంబాలతో కలిసి నగరవాసులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మొబైల్ ఫోన్ ఫ్లాష్‌లైట్లు, ఎల్‌ఈడీ రిస్ట్‌బ్యాండ్లతో పాల్గొన్న వారి ప్రదర్శన సైబర్ మోసాలపై అప్రమత్తతకు ప్రతీకగా నిలిచింది.'ఆగండి.. ఆలోచించండి.. అడుగు వేయండి' (Pause. Think. Verify.) అనే సందేశాన్ని కార్యక్రమంలో ప్రధానంగా ప్రచారం చేశారు. అనుమానాస్పద లింకులపై క్లిక్ చేసే ముందు, వ్యక్తిగత సమాచారాన్ని పంచుకునే ముందు, డబ్బు చెల్లించే ముందు క్షణం ఆలోచించి వివరాలను ధ్రువీకరించుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా డీజీపీ సి.వి. ఆనంద్ మాట్లాడుతూ సైబర్ మోసగాళ్లు ప్రజలు తొందరపడి నిర్ణయాలు తీసుకోవడంపైనే ఆధారపడుతున్నారని అన్నారు. క్లిక్ చేసే ముందు, సమాచారం పంచుకునే ముందు, డబ్బు చెల్లించే ముందు కొన్ని క్షణాలు ఆగితే అనేక మోసాలను ముందుగానే అడ్డుకోవచ్చని తెలిపారు. సైబర్ నేరాల నివారణలో అప్రమత్తమైన పౌరుడే తొలి రక్షణ కవచమన్నారు.శిఖా గోయల్ మాట్లాడుతూ అక్టోబరు నెలంతా రాష్ట్రవ్యాప్తంగా సైబర్ భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థులు, మహిళలు, సీనియర్ సిటిజన్లు, ఉద్యోగులు, వ్యాపారులకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. సైబర్ భద్రతను కేవలం ప్రచార సందేశంగా కాకుండా ప్రతి ఒక్కరి దైనందిన అలవాటుగా మార్చడమే లక్ష్యమన్నారు.కార్యక్రమంలో సైబర్ భద్రతతో పాటు మాదకద్రవ్యాల నివారణ, మహిళల భద్రత, ట్రాఫిక్, అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేశారు. , ఈగల్, షీ టీమ్స్, సైబరాబాద్ ట్రాఫిక్ విభాగం, అగ్నిమాపక శాఖలు ప్రజలకు అవగాహన కల్పించాయి.ఆర్థిక సైబర్ మోసానికి గురైన వెంటనే 1930కు ఫోన్ చేయాలని అధికారులు సూచించారు. అలాగే cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలని కోరారు. మోసం జరిగిన తొలి గంటలో ఫిర్యాదు చేస్తే డబ్బును నిలిపివేయడం లేదా తిరిగి పొందే అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు.అక్టోబరు 31న రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో సైబర్ సెక్యూరిటీ ఫ్లాష్ నడకలతో అవగాహన మాసాన్ని ముగించనున్నట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో వెల్లడించింది. తాజా సైబర్ స్కామ్ హెచ్చరికల కోసం @tgcy-berbureau అనుసరించాలని పౌరులకు సూచించింది.

# చట్టసభలకు బీసీలు పనికిరారా!

**బీజేపీ నాయకులు నలువాల తిరుపతి, మర్రిపెల్లి సత్యం**



**జగిత్యాల**
రాష్ట్రంలో 56 శాతం ఉన్న బీసీలకు రాజకీయ పదవుల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించడం లేదని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నలువాల తిరుపతి, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మర్రిపెల్లి సత్యం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. త్వరలో జరగనున్న రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో బీసీలకు అవకాశం ఇవ్వకుండా అగ్రవర్ణాలకు కేటాయించడం ఏంటని ప్రశ్నించారు.బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. మంత్రి పదవులు, ప్రభుత్వ సలహాదారు, కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లోనూ బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించలేదన్నారు. బీసీలను మభ్యపెట్టే విధానాలను ప్రభుత్వం విడనాడి, రాజకీయంగా తగిన ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో రాగిల్ల సత్యనారాయణ, జుంబర్తి దివాకర్, ఇట్నేని రమేష్, రాము పాల్గొన్నారు.

# ప్రతిభను వెలికితీయడమే లక్ష్యం

**-- ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామి**
**ఘనంగా జూనియర్ కళాశాలల అండర్--19 లాన్ టెన్నిస్ సెలక్షన్స్**



**హనుమకొండ:** వరంగల్ ఉమ్మడి జిల్లా పరిధిలోని జూనియర్ కళాశాలల విద్యార్థులకు అండర్--19 లాన్ టెన్నిస్ సెలక్షన్స్ గురువారం ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి జిల్లా జూనియర్ కళాశాలల క్రీడా కార్యదర్శి శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎంపిక పోటీలకు హనుమకొండ లాన్ టెన్నిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడంలో ఇలాంటి సెలక్షన్స్ ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. లాన్ టెన్నిస్‌లో ప్రతిభను చాటుకుని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని క్రీడాకారులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో హనుమకొండ పాఠశాలల క్రీడా కార్యదర్శి వాసుదేవరావు, ఫిజికల్ డైరెక్టర్లు సతీష్, రామ్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, సిరికొండ సుదర్శన్, వెంకట్, వినీల్, మల్లయ్య, శ్రీనివాస్, రాధిక తదితరులు పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని వివిధ జూనియర్ కళాశాలలకు చెందిన క్రీడాకారులు సెలక్షన్స్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీల బిల్లుల చెల్లింపులపై రాష్ట్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు




**హైదరాబాద్:** తెలంగాణలోని గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనుల బిల్లుల చెల్లింపులకు ఎదురవుతున్న అడ్డంకులకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పంచాయతీల్లో చెక్కుల చెల్లింపులు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారులకు ఉత్తర్వులు జారీ అయ్యాయి.నూతన ఉత్తర్వుల ప్రకారం.. ఇకపై బిల్లుల చెల్లింపుల విషయంలో సర్పంచ్, ఉప సర్పంచ్‌ల మధ్య తలెత్తే విభేదాల కారణంగా చెక్కులపై సంతకాలు ఆలస్యం కాకుండా ప్రభుత్వం నిబంధనలు కఠినతరం చేసింది. చెక్కులపై సంతకం చేయాల్సిన ఉప సర్పంచ్ కారణం లేకుండా జాప్యం చేస్తే చర్యలు తీసుకునేలా అధికారులకు ఆదేశాలిచ్చింది. ఉప సర్పంచ్ ఎలాంటి కారణం లేకుండా ఏడు రోజులకు మించి జాప్యం చేస్తే, సంబంధిత జిల్లా కలెక్టర్ విచారణ చేపట్టాల్సి ఉంటుంది. విచారణలో ఉద్దేశపూర్వకంగానే సంతకం చేయకుండా జాప్యం చేసినట్లు తేలితే, సంబంధిత నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.సంతకాల విషయంలో అనవసర జాప్యం కొనసాగితే పంచాయతీల్లో అభివృద్ధి పనులు, బిల్లుల చెల్లింపులు నిలిచిపోకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం సూచించింది. అవసరమైన సందర్భాల్లో ఉప సర్పంచ్ స్థానంలో పంచాయతీ కార్యదర్శి, ఎంపీవో లేదా ఎంపీడీవోల్లో ఒకరికి జాయింట్ చెక్ పవర్ ఇచ్చేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ప్రభుత్వ తాజా ఆదేశాలతో గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపులు వేగవంతం కావడంతో పాటు, చెక్కుల సంతకాల విషయంలో నెలకొనే వివాదాలకు పరిష్కారం లభించినట్లు అయ్యింది.

# 329 ప్రభుత్వ భూమిలో రంగులతో ముస్తాబవుతున్న అక్రమ భవనం!

- నోటీసులు ఇచ్చి, నోట్లో కట్టలు పుచ్చుకున్నారా..?
- మాజీ కార్పొరేటర్‌కు వత్తాసు పలుకుతున్న రెవెన్యూ అధికారులు
- ప్రజలకు ఒక న్యాయం.. మాజీ కార్పొరేటర్‌కు మరో న్యాయమా?
- అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోలేకపోతున్న రెవెన్యూ అధికారులు!






**కుత్బుల్లాపూర్ : అక్టోబర్ 1 (పీపుల్స్ న్యూస్)**
సర్వే నంబర్ 329 ప్రభుత్వ భూమిలో అక్రమ భవనం నిర్మాణం కొనసాగుతున్నా కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. నిర్మాణం దాదాపు పూర్తికావడంతో ప్రస్తుతం భవనానికి రంగులు వేస్తుండటం అధికారుల పనితీరుపై అనేక అనుమానాలకు తావిస్తోంది.అక్రమ నిర్మాణంపై నోటీసులు ఇచ్చిన అధికారులు.. ఆ తర్వాత చర్యలు ఎందుకు తీసుకోలేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారా..? లేక నిర్మాణం పూర్తయ్యే వరకు మౌనం వహిస్తున్నారా..? అంటూ నిలదీస్తున్నారు.ఈ భవనం మాజీ కార్పొరేటర్‌కు సంబంధించినదిగా స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతోనే రెవెన్యూ అధికారులు అక్రమ నిర్మాణానికి వత్తాసు పలుకుతున్నారనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి.సామాన్య ప్రజలు నిర్మాణం చేపడితే నిబంధనలు గుర్తొస్తాయి.. మాజీ కార్పొరేటర్ విషయంలో మాత్రం నిబంధనలు కనిపించవా? అంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన రెవెన్యూ అధికారులు అక్రమ నిర్మాణంపై ఎందుకు కఠిన చర్యలు తీసుకోవడం లేదన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. సర్వే నంబర్ 329పై అధికారులు ఇప్పటికైనా స్పందించి వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.ప్రభుత్వ భూమి పరిరక్షణలో రెవెన్యూ శాఖ వైఖరి ఏమిటి? అక్రమ నిర్మాణానికి అడ్డుకట్ట ఎప్పుడు? అన్న ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

# ఫారం- 6లో మార్పులకు ఎవరు ఆదేశించారు: ఈసీపై రాహుల్ గాంధీ ప్రశ్నలు

**న్యూ ఢిల్లీ :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై రాజకీయం దుమారం రేగుతోంది. ఈ క్రమంలో కేంద్ర ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గురువారం ప్రశ్నల వర్షం కురిపించారు. కొత్త ఓటర్ల నమోదు కోసం ఉపయోగించే ఆన్‌లైన్ ఫారం- 6 మార్పులపై ఎక్స్ వేదికగా ప్రశ్నలు లేవనెత్తారు."ఆన్‌లైన్ ఫారం- 6లో జరిగిన మార్పులు చట్టవిరుద్ధంగా జరిగాయి. ఈ విషయాన్ని ఎన్నికల సంఘంలోని కమిషనర్లే స్వయంగా చెప్పారు. ఆ మార్పులు చేయాలని టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) ను ఎన్నికల సంఘంలో ఎవరు ఆదేశించారు? దీనిపై టీసీఎస్ సంస్థలో ఎవరు సంతకం చేశారు ఈ మార్పులు చేయడానికి ఆ సంస్థపై ఎవరైనా ఒత్తిడి తీసుకొచ్చారా"- రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అగ్రనేతడిక్లరేషన్ ఫారాన్ని ఉపసంహరించుకున్న ఈసీపోర్టల్‌లోని ఆన్‌లైన్ ఫారం- 6లో, మునుపటి ఓటర్ల జాబితాకు



సంబంధించిన ఒక అదనపు ప్రకటనను చేర్చారు. ఆ ప్రకటన ప్రకారం, దరఖాస్తుదారు పేరు గానీ, వారి తల్లిదండ్రులు లేదా తాతముత్తాతల పేర్లు గానీ మునుపటి ఎస్ఐఆర్ జాబితాలో ఉన్నాయా? లేదా? అనే సమాచారాన్ని ఈసీ కోరింది. దీంతో ఈ అంశంపై రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశమై ంది. ఈ నేపథ్యంలో ఫారం- 6 గురించి ఈసీ ఇటీవల కీలక ప్రకటన చేసింది. ూ×= పూర్తైన రాష్ట్రాల్లో కొత్తగా దరఖాస్తు చేసుకునే ఓటర్లు ఇక నుంచీ ఫారం-6కు అదనంగా డిక్లరేషన్ ఫారాన్ని ఈసీ ఉపసంహరించుకు ంది.'యువతను ఓటరు జాబితా నుంచి తొలగించడానికే ఈ అడ్డంకి' మరోవైపు, ఆన్‌లైన్ ఫారం-6 లో తీసుకొచ్చిన మార్పులు పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్స్ ఇన్‌ఛార్జ్ జైరాం రమేశ్? గురువారం ఎక్స్ వేదికగా ఆరోపించారు. కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునే యువకులు (+వఱ్గ ఓటర్లు) తమ తల్లిదండ్రులు లేదా తాతముత్తాతల పేర్లను పాత ఓటర్ల జాబితాతో లింక్ చేయాలనే నిబంధన వెనుక ఒక వ్యూహం ఉందని ఆరోపించారు. మొదటిసారి ఓటు హక్కు పొందే యువతను ఓటర్ల జాబితా నుంచి తొలగించడానికి ఈ అడ్డంకిని సృష్టించారని దుయ్యబట్టారు. ఈ మొత్తం వ్యవహారం వెనుక ప్రధానమంత్రి, హోంమంత్రి ప్రమేయం ఉందని ఆయన ఆరోపించారు.ఇదిలా ఉండగా, ఎస్?ఐఆర్? ప్రక్రియ, ఎన్నికల సంఘం పనితీరు గురించి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో బుధవారం ఇండి కూటమి సమావేశం నిర్వహించింది. 19 రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఎస్?ఐఆర్‌లో జరిగిన అవకతవకల గురించి, అక్టోబర్ 6న ప్రతిపక్ష ఎంపీలందరూ ఎన్నికల కమిషన్ వద్దకు పాదయాత్ర చేయాలని, అనంతరం రాష్ట్రపతిని కలవాలని నిర్ణయించుకున్నారు. తమకు తెలియకుండా లేదా తమ సిఫార్సు లేకుండా నిర్ణయాలు, ఉత్తర్వులు జారీ అయ్యా యని, ఎన్నికల కమిషనర్లు సంధు, జోషి ఆరోపించినట్లు వార్తలు వచ్చాయి. గత 10 నెలల్లో కనీసం 14 సార్లు రికార్డులో అభ్యంతరం వ్యక్తం చేశారని కథనాలు పేర్కొన్నాయి.

## తొమ్మిదేళ్ల విరామం తర్వాత మళ్లీ 'కాంగ్రెస్' వైపు వాఘేలా.. అధిష్ఠానం నిర్ణయంపై ఉత్కంఠ



**గుజరాత్:** గుజరాత్ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, సీనియర్ నేత శంకర్‌సింహ్ వాఘేలా తొమ్మిదేళ్ల విరామం తర్వాత తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధమవుతున్నారు. 2027 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని గద్దె దించడమే లక్ష్యంగా తాను కాంగ్రెస్‌లో చేరడానికి సిద్ధమని ఆయన ప్రకటించారు. ఈ మేరకు పార్టీ పెద్దలతో చర్చలు తుది దశకు చేరుకున్నాయని, అయితే రాహుల్ గాంధీతో భేటీ తర్వాతే తన చేరికపై తుది నిర్ణయం ఉంటుందని స్పష్టం చేశారు. 86 ఏళ్ల వాఘేలా ఇప్పటికే ఏఐసీసీ గుజరాత్ ఇన్‌ఛార్జ్ రణ్‌దీప్ సూర్జేవాలా, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు అమిత్ చావ్డా, కేంద్ర మాజీ మంత్రి భరత్‌సింహ్ సోలంకి వంటి నేతలతో చర్చలు జరిపారు. "బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి నేను కాంగ్రెస్‌లో చేరడానికి సిద్ధంగా ఉన్నాను. రాబోయే అసెంబ్లీ ఎన్నికలే నాకు చివరి అవకాశం. బీజేపీకి వ్యతిరేకంగా పోరాడటంలో నా వంతు పాత్ర పోషించాలనుకుంటున్నాను" అని వాఘేలా పేర్కొన్నారు. పార్టీ నుంచి తాను ఏమీ ఆశించడం లేదని, పార్టీకి తన వంతు సహకారం అందించడానికే వస్తున్నానని ఆయన తెలిపారు.వాఘేలాతో చర్చలు జరుగుతున్న విషయాన్ని గుజరాత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అమిత్ చావ్డా కూడా ధ్రువీకరించారు. బీజేపీ పాలనపై అసంతృప్తితో ఉన్న పలువురు నేతలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని.. వాఘేలా, ఆయన మద్దతుదారులతో సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు.2017లో కాంగ్రెస్ పార్టీని వీడిన వాఘేలా, మళ్లీ ఇన్నాళ్లకు సొంత గూటికి చేరాలని నిర్ణయించుకున్నారు. వాస్తవానికి, అక్టోబర్ 2న తన సొంత పార్టీ 'ప్రజా శక్తి డెమోక్రటిక్ పార్టీ' ని పునరుద్ధరించాలని భావించినప్పటికీ, కాంగ్రెస్‌తో చర్చల నేపథ్యంలో ఆ కార్యక్రమాన్ని వాయిదా వేసుకున్నారు.

## మమతా వర్గానికి సుప్రీంలో చుక్కెదురు. రూ.804 కోట్ల ఖాతాలపై పిటిషన్ కొట్టివేత

**పశ్చిమ బెంగాల్:** పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ వర్గానికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. స్తంభింపజేసిన నాలుగు బ్యాంకు ఖాతాలను వినియోగించుకు నేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ దాఖ లైన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం గురు వారం తోసిపుచ్చింది. ఈ ఖాతాల్లో సుమారు రూ. 804 కోట్ల మేర నిధులు ఉన్నట్లు సమా చారం.జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ పి.బి. వరాలేలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. కలకత్తా హైకోర్టు గతంలో జారీ చేసిన ఉత్తర్వులలో జోక్యం చేసుకునే ందుకు ధర్మాసనం నిరాకరించింది. పార్టీలో నెలకొన్న వర్గపోరు కారణంగా కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే పార్టీ గుర్తును స్తంభింప జేసిందని, ఈ నేపథ్యంలో సదరు నిధులు యాజమాన్య హక్కులపై స్పష్టత రావాల్సి ఉందని కోర్టు అభిప్రాయపడింది. ఈ దశలో నిధుల వినియోగంపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేమని స్పష్టం చేస్తూ, కేసు విచారణను వేగవంతం చేయాలని కలకత్తా హైకోర్టును ఆదేశించింది.ఆర్థిక అవకతవకల ఆరోపణలు,



పలు ఎఫ్ఐఆర్‌ల నమోదు నేపథ్యంలో పశ్చిమ బెంగాల్ పోలీసులు ఈ నాలుగు ఖాతాలను స్తంభింపజేశారు. దీనిపై మమతా వర్గం కలకత్తా హైకోర్టును ఆశ్రయించగా, ఆగస్టు 27న వారికి ఎటువంటి మధ్యంతర ఊరట లభించలేదు. అయితే, రోజువారీ పార్టీ నిర్వహణ ఖర్చుల కోసం కోర్టు నియమించిన ప్రత్యేక అధికారి పర్యవేక్షణలో ఇతర ఖాతాలను పరిమితంగా వినియోగించుకోవడానికి హైకోర్టు అనుమతినిచ్చింది. ఖాతాల స్తంభనతో పార్టీ కార్యకలాపాలు నిలిచిపోతున్నాయని మమతా వర్గం వాదించినప్పటికీ, సుప్రీంకోర్టు మాత్రం హైకోర్టు నిర్ణయాన్నే సమర్థించింది.

# 174 మంది ప్రాణాలు కాపాడిన కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై ప్రధాని మోదీ ప్రశంసలు

**న్యూ ఢిల్లీ :** ప్రాణాలకు తెగించి 174 మంది ప్రయాణికుల ప్రాణాలు కాపాడిన భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై ధైర్యసాహసాలను ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. మచ్చర్‌ను 'హీరో'గా అభివర్ణించిన ప్రధాని దేశం మొత్తం స్మిత్‌ను చూసి గర్విస్తోందని పేర్కొన్నారు. ప్రమాదం ఎదురైన సమయంలో, తీవ్రంగా గాయపడినప్పటికీ ఇతరుల ప్రాణాలను రక్షించేందుకు మచ్చర్ గొప్ప ధైర్యసాహసాలను ప్రదర్శించారని కొనియాడారు. ఆయన తెగువ ప్రయాణికుల ప్రాణాలను కాపాడటంతో పాటు పెను విషాదాన్ని అడ్డుకుందన్నారు. ఆయన వేగంగా కోలుకుని, మరింత సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని ప్రార్థిస్తున్నాన్నట్లు పేర్కొన్నారు."కెప్టెన్ స్మిత్ మచ్చర్ ఒక హీరో. అత్యంత తీవ్రమైన ప్రమాదాన్ని ఎదుర్కొంటూ, తీవ్రంగా గాయపడినప్పటికీ, ఇతరుల ప్రాణాలను కాపాడటానికి ఆయన అపారమైన ధైర్యాన్ని, అచంచలమైన సంకల్పాన్ని



ప్రదర్శించారు. ఆయన శౌర్యం వందలాది ప్రాణాలను కాపాడి, ఒక పెద్ద విషాదాన్ని నివారించింది. కెప్టెన్ మచ్చర్‌ను చూసి భారతదేశం గర్విస్తోంది. ఆయన త్వరగా కోలుకోవాలని, నూతన శక్తిని పొంది మంచి ఆరోగ్యంతో ఉండాలని ప్రార్థిస్తున్నాం."- భారత ప్రధాని నరేంద్ర మోదీకెప్టెన్ స్మిత్ మచ్చర్ భార్య, తల్లిదండ్రులతో కూడా ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. వందలాది మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన కెప్టెన్ స్మిత్ మచ్చర్ ధైర్యసాహసాలను, సమయస్ఫూర్తిని ప్రశంసించారు. అంతే కాకుండా ఆయన కుటుంబానికి భారతదేశం తరఫున సాధ్యమైన అన్ని సహాయ సహకారాలను అందిస్తామని హామీ ఇచ్చారు.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. తన పరిస్థితి విషమంగా ఉన్నప్పటికీ విమానాన్ని కూల్చివేసే కుట్రను అడ్డుకోవడంలో ఎంతో సమయస ్ఫూర్తితో వ్యవహరించారని కొనియాడారు. మచ్చర్‌ను ట్రంప్ ఒక హీరోగా అభివర్ణించారు. ఘటనపై ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో తాను మాట్లాడానన్న ట్రంప్ మచ్చర్‌కు సాయం చేసిన తోటి ప్రయాణికులను అభినందించారు. విమానం నడపడంలో ఎలాంటి అనుభవం లేని ఓ ఇజ్రాయెల్ ప్రయాణికుడు నిందితుడిని నిలువరించడంతో సాయపడ్డాడని ట్రంప్ తెలిపారు. ఆ ప్రయాణికుడు చేసిన సాహసం అద్భుతమని ట్రంప్ కొనియాడారు."ఇది నమ్మశక్యం కాని కథ అని నేను అనుకుంటున్నాను. అయితే, ఈ సంఘటనపై నేను ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో సుదీర్ఘంగా మాట్లాడాను. కో-పైలట్ బహుశాఉగ్రవాది లేదా ఒక పిచ్చివాడై ఉండొచ్చని అనిపిస్తోంది. అతడు పైలట్ (కెప్టెన్ స్మిత్ మచ్చర్)ను కత్తితో పొడిచాడు. పైలట్ పరిస్థితి చాలా విషమంగా ఉంది. కానీ అతడు (మచ్చర్) అద్భుతమైన సమయస్ఫూర్తితో కాక్‌పిట్ తలుపు తెరిచాడు. ఒక రకంగా అతడు?? (మచ్చర్) ఒక హీరో అని చెప్పాలి. మీకు తెలుసు కదా కాక్‌పిట్ తలుపులు దృఢమైన ఉక్కుతో చేస్తారు. బయట నుంచి వాటిని ఎవరూ తెరవలేరు. ఆ స్థితిలో కూడా అతడు(మచ్చర్) కాక్‌పిట్ తలుపును తెరిచి గట్టిగా అరవగలిగాడు"

# శబరిమల ప్రసాదంలో హలాల్ బెల్లం వినియోగం

**శబరిమల** ప్రసాదం తయారీలో హలాల్ సింబల్ కలిగిన బెల్లం వాడకంపై కేరళ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రసాదం తయారీకి అవసరమైన ముడి సరుకు కొనేముందు వాటి లేబుల్స్‌ను జాగ్రత్తగా పరిశీలించాలని, అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఈ మేరకు శబరిమల దేవస్థానాన్ని నిర్వహించే ట్రావెన్‌కోర్ దేవస్థాన బోర్డ్ (టీడీబీ)కి హైకోర్టు సూచించింది. ప్రసాదం తయారీలో హలాల్ వాడకంపై దాఖలైన ఒక పిటిషన్ విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.శబరిమల అయ్యప్ప ఆలయంలో అరవణ, అప్పం ప్రసాదాల తయారీకి అనేక రకాల ముడి పదార్థాలు వినియోగిస్తుంటారు. ఈ ముడి పదార్థాలలో హలాల్ సర్టిఫైడ్ బెల్లం కూడా ఉంది. దీంతో ఈ పదార్థం వినియోగాన్ని వ్యతిరేకిస్తూ కేరళ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. మహారాష్ట్రకు చెందిన ఒక సంస్థ ఈ బెల్లాన్ని తయారు చేస్తుందని, ఇదే సంస్థ పశ్చిమాసియాలోని పలు ముస్లిం దేశాలకు కూడా బెల్లం సరఫరా చేస్తుండటంతో హలాల్ సర్టిఫికేషన్ కలిగి ఉందని కోర్టు గుర్తించింది. అందుకే, ఇలాంటి



ఉత్పత్తుల కొనుగోలు విషయంలో అప్రమత్తంగా ఉండాలని కోర్టు సూచించింది.
ప్రసాదం తయారీలో వాడే పదార్థాలు ఎలాంటి సూచికలు, ప్రకటనలు కలిగి ఉండరాదని కోర్టు పేర్కొంది. వేరే మతపరమైన సూచనల వల్ల శబరిమలలో అనుసరించే మత విశ్వాసాలు, సంప్రదాయాలు దెబ్బతింటాయని కోర్టు అభిప్రాయపడింది. అయితే, ప్రసాదం తయారీలో వాడుతున్న బెల్లం సర్టిఫికేషన్ విషయంలోనే అప్రమత్తంగా ఉండాలని, అంతేకానీ, పదార్థం నాణ్యత విషయంలో ఎలాంటి ఇబ్బందీ లేదని కోర్టు వ్యాఖ్యానించింది. ఇది 2021లో దాఖలైన కేసు. జస్టిస్ రాజా విజయరాఘవన్ వి. జస్టిస్ కేవీ జయక ుమార్ ఆధ్వర్యంలోని బెంచ్ దీనిపై తాజాగా విచారణ జరిపి కీలక సూచనలు చేసింది. శబరిమలలో తయారు చేసే ప్రసాదంలో హలాల్ సర్టిఫికేషన్ కలిగిన బెల్లం వాడుతున్నారని, దీన్నే భక్తులకు అందిస్తున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. భక్తుల విశ్వాసాలు, సంప్రదాయాలను దెబ్బతీసే ఇలాంటి పదార్థాలను నిషేధించాలి కోరుతూ ఈ పిటిషన్ దాఖలైంది. శబరిమలలో అత్యంత ప్రత్యేకమైన, వి ప్రసాదం అరవణ. పాయసంలాంటి ఈ ప్రసాదాన్ని బెల్లం, బియ్యంతో తయారు చేస్తారు. అప్పం అనే స్వీట్‌ను కూడా బెల్లం, బియ్యాన్ని ఉఎతయారు చేస్తారు. ఇక, ఇప్పటివరకు ల ఆలయానికి 19,96,034 సరఫరా చేసింది. ఈ నేపథ్యంలో మత విశ్వాసాలు దెబ్బ తినకుండా చూడాలని కోర్టు సూచించింది.

## అస్సాంలో 9 మంది బంగ్లాదేశీయుల అరెస్ట్.. నకిలీ ఆధార్ కార్డులు స్వాధీనం..

**అస్సాం:** దేశంలోకి అక్రమంగా ప్రవేశించిన తొమ్మిది మంది బంగ్లాదేశీయులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బొంగాయిగావ్ జిల్లాలోని న్యూ బొంగాయిగావ్ రైల్వే స్టేషన్‌లో 9 మంది బంగ్లాదేశ్ జాతీయులను పోలీసులు అరెస్ట్ చేశారు. బొంగాయిగావ్ సరిహద్దు పోలీసులు, ప్రభుత్వ రైల్వే పోలీసుల సంయుక్త ఆపరేషన్‌లో వీరిని పట్టుకున్నట్లు అధికారులు తెలిపారు.
రైల్వే టికెట్ కౌంటర్ సమీపంలో తొలుత ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి సమాచారం సేకరించి మరో ముగ్గురిని కూడా పట్టుకున్నారు. మొత్తం తొమ్మిది మందిని పోలీసులు ప్రశ్నిస్తున్నారు. వారి గుర్తింపు, భారత్‌లోకి వచ్చిన మార్గం, ప్రయాణ ఉద్దేశం తదితర అంశాలపై విచారణ జరుగుతోంది. వారి నుంచి 6 మొబైల్ ఫోన్లు, 4 బంగ్లాదేశ్ జాతీయ గుర్తింపు కార్డులు, ఒక బంగ్లాదేశ్ పాస్‌పోర్ట్, మూడు నకిలీ భారతీయ ఆధార్ కార్డులు, 5 రైల్వే టికెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ పత్రాలపై మరింత పరిశీలన జరుగుతోంది వీరు పొరుగు రాష్ట్రం మీదుగా అస్సాంలోకి ప్రవేశించినట్లు పోలీసులు గుర్తించారు . న్యూ బొంగాయిగావ్ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు వారు ప్రయత్నిస్తున్నట్లు అధికారులు తెలిపారు. పని కోసం వెళ్లేందుకు వారు ప్రణాళిక వేసుకున్నారని పోలీసు అధికారి పేర్కొన్నారు. అయితే, వారు భారత్‌లోకి ఏ మార్గంలో ప్రవేశించారు? వారికి నకిలీ భారతీయ గుర్తింపు కార్డులు ఎలా లభించాయి? ఈ వ్యవహారంలో మరెవరైనా ఉన్నారా? అనే అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది.



## ఫ్లైదుబాయ్‌లో పైలట్‌పై దాడి .. గొడ్డలితో ఆ అటాక్ జరిగినట్లు అనుమానం

**టెల్ అవివ్:** ఇజ్రాయిలీ దేశస్థులతో వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానంపైలట్‌పై కోపైలట్ అటాక్ చేసిన విషయం తెలిసిందే. అయితే కాక్‌పిట్‌లోకి ఎలా వెపన్‌ను తీసుకెళ్లారన్న ప్రశ్న ఉత్పన్నం అయ్యింది. ఒమన్‌కు చెందిన కోపైలట్ కత్తి వాడినట్లు తొలుత భావించారు. కానీ ఇండియన్ పైలట్ స్మిత్ మచ్చర్‌ను గొడ్డలితో నరికినట్లు అనుమానిస్తున్నారు. కాక్‌పిట్‌లోకి వెళ్లే సమయంలో కోపైలట్ వద్ద కత్తి కానీ, మరో ఆయుధం కానీ లేదని, కానీ అతను ఆ కాక్‌పిట్‌లో ఉన్న క్రాష్ యాక్స్ లేదా ఫైర్ యాక్స్ వాడినట్లు భావిస్తున్నారు. దాడి కోసం గొడ్డలి వాడి ఉంటాడని ప్రధాని బెంజిమన్ నెతన్యహూ కూడా తొలుత అనుమానాలు వ్యక్తం చేశారు.దుబాయ్ నుంచి విమానం బయలుదేరిన రెండున్నర గంటల తర్వాత అకస్మాత్తుగా 33వేల ఫీట్ల ఎత్తు నుంచి 17 వేల ఫీట్లకు గాలిలోనే విమానం దిగజారింది. జోర్డాన్ బోర్డర్ సమీపంలో ఆ విమానం ఒక్కసారిగా వెనక్కి తరిగింది. సౌదీ సిటీ తబుక్‌లో ఆ విమానం ల్యాండ్ అయినట్లు ఫ్లైట్‌రేడార్24 పేర్కొన్నది. ఒకవైపు ప్రయాణికులు అరుస్తుండగా, రక్తంతో తడిసిన పైలట్ మేడే అంటూ ఏటీసీతో పేర్కొన్నాడు. విమానాన్ని హైజాక్ చేస్తున్నట్లు అతను ఏటీసీకి చెప్పాడు. అయితే అంతర్జాతీయ విమాన నిబంధనల ప్రకారం ప్రతి కమర్షియల్ విమానంలో ఓ చిన్నపాటి గొడ్డలి ఉంటుంది. ఒకవేళ ఎమర్జెన్సీలో అవసరం వస్తే, ఆ గొడ్డలిని వాడే రీతిలో దాన్ని విమానాల్లో తీసుకెళ్తుంటారు. సెప్టెంబర్ లెవన్ దాడులకు ముందు ప్రధాన క్యాబిన్లలో గొడ్డలిని స్టోర్ చేసేవాళ్లు.




# 'రాహుల్ అతిపెద్ద మోసగాడు'- కాంగ్రెస్ విమర్శలకు బీజేపీ కౌంటర్

**న్యూ ఢిల్లీ :** ఎన్నికల సంఘం, ప్రభుత్వంపై విమర్శలు చేసిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై బీజేపీ తీవ్రస్థాయిలో మండిపడింది. రాహుల్ అతిపెద్ద మోసగాడని, అబద్ధాలు, తప్పుడు సమాచారంపై ఆధారపడే నకిలీ రాజకీయ నాయకుడని మండిపడింది. రాహుల్ గాంధీ లౌకికవాదానికి గానీ, రాజ్యాంగానికి గానీ రక్షకుడు కాదని కేవలం ఆయన తన కుటుంబ ప్రయోజనాలకు మాత్రమే రక్షకుడని బీజేపీ నేత రాజీవ్ చంద్రశేఖర్ విమర్శించారు. ఫామ్-6లో మార్పులపై కాంగ్రెస్ చేసిన ఆరోపణలను ఆయన తిప్పికొట్టారు.కట్టుకథలు, తప్పుడు సమాచారం సృష్టించడం రాహుల్‌కు అలవాటుగా మారిందని రాజీవ్? చంద్రశేఖర్? వ్యాఖ్యానించారు. హిట్లర్ ప్రచారమంత్రి జోసెఫ్ గోబెల్స్ సిద్ధాంతాన్ని రాహుల్? నరనరాన జీర్ణించుకున్నారని ఎద్దేవాచేశారు. గతంలో ఈవీఎంలు హ్యాక్ అయ్యాయని, ప్రజాస్వామ్యం అపహరణకు గురవుతోందని రాహుల్ చేసిన ఆరోపణలు కాంగ్రెస్ పార్టీ గెలిచిన ఎన్నికలతోనే



పదేపదే తప్పని తేలిపోయాయని చంద్రశేఖర్ గుర్తుచేశారు. వయనాడ్‌కు ఎందుకు వెళ్లడం లేదు?మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్‌లో గిరిజన కుటుంబాలను కలిసేందుకు వెళ్తున్న రాహుల్ గాంధీ, తన సొంత నియోజకవర్గమైన వయనాడ్ సమస్యల గురించి ఎందుకు ప్రస్తావించడం లేదని చంద్రశేఖర్? ప్రశ్నించారు. "వయనాడ్‌లో గిరిజనుల కోసం కార్యక్రమాలు ఎందుకు చేపట్టడం లేదు వయనాడ్‌లోని షెడ్యూల్డ్ తెగల సమస్యలను ఎందుకు పట్టించుకోవడం లేదు? కేరళంలో 'ఛాత్రోం కీ గూంజ్' వంటి కార్యక్రమాలు ఎందుకు నిర్వహించడం లేదు? అలాగే, ఆయన సోదరి ప్రియాంకా గాంధీ కేరళంకు ఎందుకు రావడం లేదు?" అని ఆయన ప్రశ్నించారు.రాహుల్? తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తున్నారు!ఇదిలా ఉండగా, రాహుల్ గాంధీ ఎప్పుడూ తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తుంటారని చంద్రశేఖర్? విమర్శించారు. భారత ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోయిందన్న మాట అవాస్తవమని, ప్రభుత్వం అంబానీ, అదానీల కోసమే పనిచేస్తుందని చేసిన ఆరోపణ కూడా అబద్ధమేనని తెలిపారు. మరోవైపు, "సీఈసీ జ్ఞానేశ్? కుమార్‌ను బీజేపీ ఏజెంట్ అని పిలుస్తారు. కానీ ఎస్ఐఆర్ ప్రక్రియ ఎంత ముఖ్యమో కేరళంలోని కాంగ్రెస్ నేతలే గతంలో చెప్పారు" అని చంద్రశేఖర్? వ్యాఖ్యానించారు.

# సంపాదకీయం




## నష్ట నివారణలో ఇసి

ఎన్నికల ప్రధాన కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్ తీసుకున్న నిర్ణయాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి 14 అభ్యంతరాలు వ్యక్తం చేసిన విషయం బయటపడి తీవ్ర సంచలనం కలిగించిన సంగతి తెలిసిందే. దీంతో కాక్రోచ్ జనతా పార్టీ, విపక్షాలు ఆందోళనకు దిగడం, ఎన్నికల కమిషన్‌పై ప్రజల్లో ప్రతికూల అభిప్రాయం ఏర్పడడంతో ఎన్నికల కమిషన్ తన అప్రతిష్ఠను నివారించుకునే చర్యలు చేపట్టింది. ఈమేరకు శనివారం ఎన్నికల సంఘం పత్రికా ప్రకటన విడుదల చేసింది. ఈ ప్రకటనలో కమిషనర్ల ఫిర్యాదులను కొంతవరకు అంగీకరించింది. ఇకపై సమావేశాలకు ముందే అజెండాను పంపుతామని, సమావేశాల తరువాత మినిట్స్ (నిర్ణయాల వివరాలను) అందజేస్తామని, తదితర వివరణలతోపాటు 'సర్' లో లోపాలు ఉన్నాయని పరోక్షంగా అంగీకరించింది. ఓటరు జాబితానుంచి ఎవరి పేరైనా తొలగించినట్టయితే వారిని తిరిగి జాబితాలో చేర్చేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టాలని ఎలెక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లకు సూచించింది. అయితే 'పశ్చిమబెంగాల్‌లో న్యాయాధికారులు చేర్చిన ఓటర్లను తొలగించేందుకు 16.1లక్షల అప్పీళ్లను ఎవరు అనుమతించారు?' అని ఎన్నికల కమిషనర్ సుఖ్‌బీర్ సింగ్ సంధు అడిగిన ప్రశ్నకు ఇప్పటికీ సమాధానం లేకపోవడం గమనార్హం. జ్ఞానేశ్ కుమార్ నేతృత్వం లోని ఎన్నికల కమిషన్ 'సర్' ప్రక్రియ ద్వారా ముసాయిదా ఓటర్ల జాబితాలనుంచి 13కోట్లకు పైగా పేర్లను తొలగించింది.స్వయంగా అర్హులైన ఓటర్లను నమోదు చేయాల్సిన ప్రభుత్వ బాధ్యతను ఓటర్లపైనే మోపుతున్నారన్న విమర్శలు వచ్చాయి అంటే పేర్లను ముందుగా తొలగించి, తరువాత వాటిని ధ్రువీకరించే విధానం అమలైంది. తిరిగి ఓటర్ల జాబితాలో పేరు చేర్చుకోవడానికి ఓటర్లపై కఠినమైన, భారమైన నిబంధనలు విధిస్తున్నారని ఆరోపణలు వచ్చాయి. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా (సర్) రాజ్యాంగబద్ధమైనదా కాదా అనే విషయంపై సుప్రీం కోర్టు నెలల తరబడి నిర్ణయం తీసుకోకపోవడంతో కొన్ని లోపాలు చోటుచేసుకున్నాయి. చివరకు మే 27న కోర్టు తీర్పు ఇచ్చే సమయానికి బీహార్, పశ్చిమబెంగాల్, రెండో దశలోఉన్న ఇతర రాష్ట్రాల్లో 'సర్' ప్రక్రియ అప్పటికే ప్రారంభమై, వాస్తవ పరిస్థితిని మార్చేసింది. సుప్రీం కోర్టు తీర్పు ఎడిఎం జబల్‌పూర్ కేసులో ప్రభుత్వం పట్ల కోర్టు చూపిన విధేయతను గుర్తు చేసేలా ఉందన్న విమర్శలు తలెత్తాయి. 'సర్'ను ఆచరణలో ఎలా అమలు చేశారన్న దానికంటే సిద్ధాంతపరంగా ఎలా ఉండాలో కోర్టు చూసింది. అసాధారణమైన, నిర్దిష్టమైన సందర్భాల్లో మాత్రమే చేయాల్సిన ఓటర్ల జాబితా సవరణ నిబంధనను, రాష్ట్రవ్యాప్తంగా భారీస్థాయిలో సవరణ చేయడానికి అనుమతిగా భావించారు. ఇప్పటికే ఓటర్ల జాబితాలో ఉన్నవారు అర్హులేనని నిరూపించాల్సిన అవసరం లేదని చెప్పినప్పటికీ, సర్ ద్వారా వారు మళ్లీ తమ అర్హతను నిరూపించుకోవలసి వచ్చింది. అలాగే 1995 నాటి సుప్రీం కోర్టు తీర్పులో ఓటర్ల జాబితాలో ఎవరి పేరునైనా తొలగించడానికి వ్యక్తిగత కారణం ఉండాలని వెల్లడించిన విషయాన్ని కూడా ఇప్పటి సుప్రీం కోర్టు తీర్పు పక్కన పెట్టిందని విమర్శలు వస్తున్నాయి. పశ్చిమబెంగాల్ లోని ట్రైబ్యునల్ తీర్పు ఇచ్చిన అప్పీళ్లలో 90 శాతానికి పైగా, అసెంబ్లీ ఎన్నికలు జరిగిన కొన్ని నెలల తర్వాత తొలగించబడిన ఓటర్లను మళ్లీ ఓటర్ల జాబితాలో చేర్చారు.అలాగే ఢిల్లీ లోని మూడోవంతు నియోజకవర్గాల్లో, ముసాయిదా ఓటర్ల జాబితాలో ఉన్న ఓటర్ల సంఖ్య 2025లో వాస్తవంగా ఓటు వేసిన వారికంటే తక్కువగా ఉంది. ఢిల్లీలో ఆగస్టు 31న విడుదలైన ముసాయిదా ఓటర్ల జాబితాలో 97.5లక్షల మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 31.6 లక్షల మందికి రెండు కారణాల కింద నోటీసులు జారీ చేశారు. ఒకటి ఓటరు వివరాలను సంబంధిత పాత రికార్డులతో సరిపోల్చలేకపోవడం, రెండోది తార్కిక వ్యత్యాసాలు. రెండోది.. ఓటరు వివరాల్లో కొన్ని అసంగతలు ఉండడం. దీంతో 31.6లక్షల మంది ఓటర్లు ఇఆర్ఒ, ఎఇఆర్ఒ కార్యాలయాలకు స్వయంగా వెళ్లాల్సి వస్తుందేమో అన్న ఆందోళన ఏర్పడింది. అయితే ఇప్పుడు ఎన్నికల కమిషన్ వెల్లడించిన వివరాల ప్రకారం బూత్‌లెవెల్ అధికారులు (బిఎల్ఒ) ఓటర్ల ఇళ్లకే వెళ్లి వివరాలను పరిశీలిస్తారు. అత్యవసరమైన, ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే వ్యక్తిగతంగా విచారణకు హాజరు కావలసి ఉంటుంది. అంటే పౌరుడు ఇబ్బందులు పడుతూ అధికారులను సంప్రదించాల్సిన పరిస్థితి లేకుండా సంస్థే పౌరుడు దగ్గరకు వెళ్లే విధానం అమలవుతుంది.అయితే ఈ పనిని కేవలం 14,000 మంది బూత్ లెవెల్ అధికారులు ఎలా నిర్వహిస్తారనేది ఆందోళన కలిగించే విషయం. రాత్రుళ్లు షెల్టర్లలో నివసించే వారు, కూలీలు, పేదలు, నిరాశ్రయులు, మొదలైన వారి వివరాల నమోదు కోసం తగిన హెల్ప్ డెస్కులు, ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తామని ఎన్నికల కమిషన్ చెబుతోంది. మరి ఇది ఎలా అమలవుతుందో చూడాలి. మరో ముఖ్యమైన ఓటరు సమస్య ఫారం 6. ఓటర్ల జాబితాలో కొత్తగా పేరు నమోదు చేసుకునే ప్రతి పెద్దవారు ఈ ఫారమ్‌ను నింపాలి. ఆన్‌లైన ఫారమ్ 6 లో కొత్త ఓటర్లు తమ తల్లిదండ్రులు, లేదా తాతయ్య, అమ్మమ్మలు చివరి 'సర్'కు సంబంధించిన ఓటర్ల జాబితాలో ఉన్నారా? అన్నది ప్రకటించాలి. అయితే కొత్త ఓటర్లు ఎలాంటి డిక్లరేషన్ ఇవ్వకుండానే ఫారమ్ 6 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. అయితే 'సర్' ప్రక్రియలో ఇలాంటి నిబంధన ఉండకూడదన్న వాదన వస్తోంది. శనివారం ఎన్నికల సంఘం విడుదల చేసిన ప్రెస్‌నోట్‌లో పెద్దగా మార్పేమీ కనిపించడం లేదు. ప్రభుత్వ ఆధిపత్యం చెలాయించలేని విధంగా ఉండే ఎంపిక కమిటీ ద్వారా ఎన్నికల కమిషన్‌ను పునర్వ్యవస్థీకరించాలి.

## మైనర్ల డిజిటల్ భద్రతకు చట్టరక్షణ



మన దైనందిన జీవితంలో సామాజిక మాధ్యమాలు విడదీయలేని భాగంగా మారాయి. సమాచారాన్ని తెలుసుకోవడం, భావాలను వ్యక్తం చేయడం, ప్రపంచంతో అనుసంధానమవడం వంటి ఎన్నో ప్రయోజనాలు వీటి ద్వారా చేకూరుతున్నాయి. అయితే ఇదే వేదికలు బాలబాలికల పాలిట ప్రమాదకరంగా మారుతున్న సందర్భాలూ పెరుగుతున్నాయి. వయసుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటున్న డిజిటల్ ప్రపంచంలో పిల్లల భద్రత ప్రశ్నార్థకమవుతోంది. సైబర్ వేధింపులు, అసభ్యకరమైన కంటెంట్, ఆన్‌లైన్ మోసాలు, వ్యక్తిగత సమాచార దుర్వినియోగం, డిజిటల్ వ్యసనం వంటి సమస్యలు వారి శారీరక, మానసిక వికాసంపై ప్రభావం చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో 18 ఏళ్లలోపు పిల్లలు సామాజిక మాధ్యమాల్లో ఖాతాలు తెరవడానికి తల్లిదండ్రుల సమ్మతిని తప్పనిసరి చేసే అంశాన్ని పరిశీలించాలని సుప్రీం కోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించడం ప్రాధాన్యం సంతరించుకుంది. మైనర్లు సామాజిక మాధ్యమాలను ఉపయోగించడం సమస్య కాదు. వారి వయసుకు తగిన అవగాహన, విచక్షణ, పరిణతితో సంబంధం లేకుండా ఎలాంటి నియంత్రణలూ లేని వాతావరణంలోకి ప్రవేశించడమే అసలు సమస్య. పిల్లలను ఆకట్టుకునేలా రూపొందించిన అల్గారిథమ్‌లు వారిని గంటల తరబడి తెరలకు అతుక్కుపోయేలా చేస్తున్నాయి.

# కౌలు రైతుకు రక్షణ కరవు

భారతదేశం వ్యవసాయిక దేశం అనడంలో ఎటువంటి సందేశానికి ఆస్కారం లేదు. భారత ప్రభుత్వ వ్యవసాయిక శాఖ 2024 -25 నివేదిక ప్రకారం మొత్తం నికర సాగు భూమి 35 కోట్ల ఎకరాలకు పైగా ఉంది. పచ్చికబయల్లు, తోటలు, సాగుకి అనుకూలమైన భూములు కలుపుకుంటే 44.1 కోట్ల ఎకరాల సాగు భూమి ఉంది. దేశం మొత్తం భూమిలో ఇది 59%గా ఉంది. ఫ్యూడల్ వ్యవస్థనుంచి నేటి అర్ధభూస్వామ్య వ్యవస్థ వరకు కౌలుదారీ విధానం కొనసాగుతున్నది. అనధికారిక అంచనాల, ప్రపంచ బ్యాంకు, జాతీయ నమూనా సర్వే సంస్థల గణాంకాల ప్రకారం 2.13 కోట్లకుపైగా కౌలు రైతుల కుటుంబాలు ఉన్నాయి. ఇది ఖచ్చితమైన లెక్కగా భావించలేము. ఎందుకంటే 92% పైగా కౌలు ఒప్పందాలు నోటి మాటగానే ఉన్నాయి. అలాంటి వారికి కౌలు రైతులుగా గుర్తింపు ఉండదు. వారు రైతుల లెక్కల్లోకి రారు. అందువల్ల వాస్తవ పరిశీలనలో కౌలు రైతుల సంఖ్య కోట్ల కొద్ది పెరుగుతుంది. కౌలు రైతులు సాగు చేసే వాస్తవ భూమి 8.5 కోట్ల ఎకరాలు ఉంటుందని ఆర్థిక సంస్థల, స్వచ్ఛంద సంస్థల అధ్యయనాల అంచనాగా ఉంది. దేశం లోని కౌలు రైతుల్లో 36% మందికి సొంత భూమి సెంట్ కూడా లేదు.దేశవ్యాప్తంగా సగటు కౌలు భూమి 25% దాకా ఉన్నప్పటికీ, నిర్దిష్ట వ్యవసాయ ఆధారిత రాష్ట్రాల్లో కౌలు భూమి చాలా ఎక్కువగా ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రొఫెసర్ రాధాకృష్ణ కమిషన్, కౌలు రైతుల సంఘాల నివేదిక ప్రకారం రాష్ట్రంలో వాస్తవంగా 32 లక్షల మంది కౌలు రైతులు ఉన్నారు. సాగు భూమిలో 60% నుండి 70% కౌలు భూమిగా ఉంది. కృష్ణా, గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాల్లో 80% కౌలు రైతులే ఉన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్రలో 50% పైగా కౌలు రైతులు ఉన్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతాల్లో కూడా కౌలు రైతుల సంఖ్య వేగంగా పెరుగుతున్నది. ఎపి రాష్ట్రంలోని కౌలు రైతుల్లో పదిలక్షల మందికి సెంటు సొంత భూమి లేదు. తెలంగాణ రాష్ట్రంలో వాస్తవ సాగు భూమిలో 35% భూమిని, మొత్తం రైతుల్లో 36% ఉన్న కౌలు రైతులే సాగు చేస్తున్నారు. ప్రతి ముగ్గురులో ఒకరు కౌలు రైతుగా ఉన్నాడు. పంజాబ్ రాష్ట్రం వ్యవసాయ పరంగా అభివృద్ధి చెందినా, అక్కడ దేశంలోనే అత్యధికంగా 73% కుటుంబాలకు సొంత భూమి లేదు. సుమారు 25% వ్యవసాయ కుటుంబాలు కౌలు



రైతులుగా ఉన్నట్లు జాతీయ నమూనా సర్వే, వివిధ అధ్యయనాల గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 25% భూమి కౌలు ఒప్పందాల కిందనే సేద్యం సాగుతున్నది. బీహార్‌లో మొత్తం రైతుల్లో సుమారు 40% దాకా కౌలు రైతులు ఉన్నారని వివిధ వ్యవసాయ నివేదికలు, ఆర్థిక అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.వ్యవసాయ కుటుంబాల్లో 91%పైగా చిన్న, సన్నకారు రైతులే ఉన్నారు. వీరిలో ఎక్కువ మందికి సొంత భూమి లేకపోవడం వల్ల కౌలుదారులుగా ఇతరుల భూములు సాగు చేస్తున్నారు. సుమారు 23% భూమి కౌలు రూపంలో సేద్యం జరుగుతున్నది. ఇక్కడ కూడా నోటి మాట కౌలు విధానం అమలు జరుగుతున్నది. వివిధ రాష్ట్రాల్లో ఉన్న కౌలుదారీ చట్టాలు అలంకారప్రాయంగా ఉన్నాయి. భూకామందుల ప్రయోజనాలు కాపాడుతున్నాయి. రాత పూర్వక ఒప్పందం ఉంటేనే కౌలుదారుగా గుర్తింపు ఉంటుంది. రాత పూర్వక కౌలు ఒప్పందం లేకపోవడం వల్ల కౌలు రైతులకు ఎలాంటి చట్టపరమైన హక్కులు లేవు. భూకామందు దయ మీద కౌలు భూమి ఆధారపడి ఉంది. ఆంధ్రప్రదేశ్ లోతెచ్చిన పంట సాగుదార్ల హక్కుల చట్టంలో భూయజమాని అనుమతి సంతకం ఉంటేనే కౌలు రైతుకు ప్రభుత్వం గుర్తింపు కార్డు ఇస్తుంది. భూ యజమానులు అలా సంతకం పెట్టటానికి అంగీకరించకపోవడంవల్ల కౌలురైతుగా గుర్తింపు లేక పంటరుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీలు, పంట నష్ట పరిహారాలు పొందలేకపోతున్నారు. రాష్ట్రంలో 87% మంది రైతులకు కౌలు గుర్తింపు కార్డులు ప్రభుత్వం ఇవ్వలేదు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ గణనీయంగా కౌలు రైతులు ఉండటానికి కారణం వారి సొంత భూమి లేకపోవడమే. భూ కేంద్రీకరణ పెరగడమే. దేశ వ్యవసాయ భూమిలో దాదాపు 44% భూమి కేవలం 10% అత్యంత ధనిక భూకామందు కుటుంబాల వద్ద ఉంది. వీరిలో కూడా 5% కుటుంబాల వద్ద 32% భూమి ఉంటే, 1% కుటుంబాలు ఏకంగా 10% భూమిని తమ ఆధీనంలో ఉంచుకున్నారు. బీహార్‌లోని కొన్ని గ్రామాల్లో ఒక పెద్ద భూస్వామి కుటుంబం గ్రామం మొత్తం భూమిలో 20% కలిగి ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన భూ సంస్కరణల చట్టాలు భూ కేంద్రీకరణను బద్దలు చేసి పేదలకు భూ పంపిణీ చేయడంలో పూర్తిగా విఫలం అయ్యాయి. పాలకులు చేసిన భూ సంస్కరణల చట్టాలన్నీ భూస్వామ్య వర్గానికి నష్టం లేకుండా చేసిన కావటమే అందుకు కారణంగా ఉంది. దేశంలోను, తెలుగు రాష్ట్రాల్లోను ప్రధానంగా రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు సాగునీరు, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం, మార్కెట్ సౌకర్యం లేకపోవడం, గిట్టుబాటు ధరలు రాక పోవడం.ఈ సమస్యలకు కారణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే. పై సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యాయి. సేద్యపు ఖర్చులు పెరుగుతున్న, అందుకు అనుగుణంగా పంటలకు ధరలు లభించకపోవడం వల్ల, ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులు ముఖ్యంగా కౌలు రైతుల బాగా నష్టపోయి అప్పుల పాలై, తీర్చేమార్గం లేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. దేశంలో 1995 2023 మధ్య అధికారిక నివేదికల విశ్లేషణల ప్రకారం 4,05,000 పైగా రైతులు బలవన్మరణాలకు పాల్పడ్డారు. వీరిలో కౌలు రైతులే ఎక్కువగా ఉన్నారు. ఇటీవల నమోదైన రైతుల మరణాల్లో 56% కంటే ఎక్కువ మంది వ్యవసాయ కూలీలే (కౌలు రైతులు) ఉన్నారు. టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్, రైతు స్వారాజ్య వేదిక వంటి సంస్థలు తెలుగు రాష్ట్రాల్లో ఆత్మహత్యలు చేసుకున్న రైతుల్లో 75% నుండి 80% దాకా కౌలు రైతులే ఉన్నారని తెలిపాయి. కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం విప్లవాత్మక భూ సంస్కరణల ద్వారా కౌలు రైతుల తోసహా గ్రామీణ పేదలందరికీ భూ పంపిణీ జరగాలి. కౌలు రైతులకు పూర్తి రక్షణ ఉండాలి. గ్రామీణ ప్రజల అభివృద్ధికి, దేశాభివృద్ధికి ఆటంకంగా ఉన్న అర్ధఫ్యూడల్ సంబంధాలను, భూ కేంద్రీకరణను బద్దలుకొట్టాలి. ఈ పని నేటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయవు. గ్రామీణ ప్రజలే సమష్టిగా ఉద్యమించి సాధించుకోవాలి

# ముందు నుయ్యి.. వెనుక గొయ్యి

పన్నెండేళ్ల పాలనలో కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం అత్యంత తీవ్రమైన ఒత్తిడిలో ఉంది. ప్రతిష్ఠాత్మక భారత ఎన్నికల సంఘం (ఇసి) వివాద విషయంలో ఎటూ పాలుపోని పరిస్థితి. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్‌ను తప్పించడమా? కొనసాగించడమా? తేల్చుకోలేని సందిగ్ధత! సవరణలతో వచ్చిన కొత్త ఎన్నికల చట్టం (2023) ప్రకారం సిఇసిని ఎవరూ తప్పించజాలరు. ఇసి బాధ్యత నిర్వహణకు సంబంధించినంత వరకు సిఇసి చర్యల్ని ఎవరూ ప్రశ్నించనూ లేరు. ప్రతిపక్షం కూడా ప్రజాక్షేత్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వాన్ని, బిజెపి నాయకత్వాన్ని ఎండగట్టడానికి 'అభిశంసన' అంటూ బెదిరించగలదే తప్ప, అందుకు సంఖ్యాబలం సరిపోదు. సుమారు ఏడాది కాలంగా ఎన్నికల సంఘంలో ఏకాభిప్రాయం లేదు, పైగా మెజారిటీ అభిప్రాయానికి (2/3) విరుద్ధంగా ఏకపక్ష (1/3) నిర్ణయాలే అమలవుతున్నాయన్న మీడియా పరిశోధనా కథనం ఓటర్ జాబితాల సమగ్ర సవరణ (సర్) ప్రక్రియనే వివాదంలో పడేసింది. 13 కోట్లమంది ఓట్లు పోయాయనేది విమర్శ. ఇందుకు బాధ్యుడ్ని చేస్తూ సిఇసిని తప్పించాలని రాజకీయ పక్షాలు, పౌర సమాజం నుండి పెరుగుతున్న ఒత్తిడే తాజా స్థితికి కారణం.భారత ఎన్నికల సంఘం సిఇసి వివాద వ్యవహారాన్ని సకాలంలో చక్కదిద్దడంలో బిజెపి వ్యూహకర్తలు విఫలమయ్యారు. ఒక అవకాశం వారికి మొదట్లో ఉండింది. ఏడాది కాలంగా తరచూ వివాదాస్పదం అవుతున్న 'సర్', ఇంకా ఇతర విషయాల్లో సిఇసి ఏపక్షంగా వ్యవహరిస్తున్నారు, కేంద్ర ప్రభుత్వం చెప్పుచేతుల్లో కీలుబొమ్మ అయ్యారు అని నివేదికలు, నిర్దిష్ట ఆరోపణలు, విమర్శలు వచ్చిన వెంటనే కేంద్రం అప్రమత్తం కావాల్సింది. ముగ్గురు ఎన్నికల కమిషనర్లను కూర్చోబెట్టి, 'అటువంటిదేమీ లేదు, ప్రతి కీలక నిర్ణయంలోనూ మేం ఏకాభిప్రాయంతోనే ఉన్నాం, ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల ప్రక్రియ అంతా 'ఇసి' ఉమ్మడి నిర్ణయమే' అని ప్రకటింపజేయాల్సింది. అది జరగలేదు. అంటే, దానర్థం ఇసిలో ఏకాభిప్రాయం లేదని స్పష్టమయ్యింది.అది తప్పు కనుక ఇప్పుడు సిఇసిని తప్పించక తప్పని పరిస్థితి ఏలికలకు తలెత్తింది. అది జరగాలంటే సర్కారు వ్యూహకర్తలు సంప్రదింపులు జరిపి గౌరవంగా సిఇసి తప్పుకునేలా చూడడం ఒక మార్గం.ఇంత జరిగాక సిఇసిని తప్పించినా, కాదని పట్టుదలకుపోయి కొనసాగించినా.. పాలక పక్షానికి ఇబ్బందికర పరిస్థితే! రాబోయే రెండున్నర సంవత్సరాల కాలం అటువంటిది. జ్ఞానేశ్ కుమార్ పదవీకాలం 2029 జనవరి వరకుంది. అంటే, 27 నెలల సుదీర్ఘ పదవీ కాలమాయనది. 2029 మధ్యలో తదుపరి సార్వత్రిక ఎన్నికలు జరగాల్సి ఉంది. ఈ



మధ్యకాలంలో ఉత్తరప్రదేశ్ తోపాటు పంజాబ్, ఉత్తరాఖండ్, గోవా, గుజరాత్, కర్ణాటక, మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్, తెలంగాణ వంటి ముఖ్య రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలున్నాయి. సిఇసి విషయంలో తీసుకోబోయే నిర్ణయం తప్పనిసరిగా ఆ ఎన్నికల్ని ప్రభావితం చేస్తుంది. మెజారిటీ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లోనో, కాదని తక్కువ రాష్ట్రాల్లో గెలిచినా.. 2029లో మోడీ దిగిపోవాల్సిందే అంటాయి ప్రతిపక్షాలు. విపక్షాలు ఓడిపోతే 'ఎన్నికల చోరీ' ఇంకా సాగుతోందంటారు.2024 లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల ముందు జ్ఞానేశ్ కుమార్ ఇసికి వచ్చి సిఇసి అయ్యారు. అప్పుడే అరుణ్ గోయల్ రాజీనామాతో వైదొలగారు. దేశంలో అత్యధికంగా 12కోట్ల మంది ఓటర్ల పేర్లు జాబితాలనుంచి తొలగిపోయిన ఏడాది కాలం భారత ఎన్నికల చరిత్రలోనే అత్యంత కీలక సమయం. మహారాష్ట్ర, బీహార్, పశ్చిమబెంగాల్ ఎన్నికల సందర్భంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ఎంతో వివాదాస్పదమైంది. కోటికిపైగా ఓట్లను తొలగించారు. వారు ఓటేయలేదు. తదుపరి ట్రిబ్యునల్ దర్యాప్తులో అందులో అత్యధికులు అర్హులైన ఓటర్లేనని తేలుతోంది. సరిగ్గా అదే పది నెలల కాలంలో ఇసి నిర్ణాయక ప్రక్రియపైన నీలినీడలు పరుచుకున్నాయి. 10 నెలల్లో 14 ముఖ్య నిర్ణయాల్లో ఇతర కమిషనర్లు వ్యక్తం చేసిన అభ్యంతరాలను తోసిరాజని, సిఇసి తీసుకున్న ఏకపక్ష నిర్ణయాలతో సాగిన 'సర్' పక్రియ తీవ్ర విమర్శలకు కారణమయింది. అందుకే దేశంలోని ప్రతిపక్ష పార్టీలు స్వరం పెంచాయి. 'మీ రాజకీయ మనుగడ కోసం కాకుండా ప్రజాస్వామ్య పరిరక్షణకు, పౌరుల ఓటు హక్కు కాపాడటానికి పనిచేయండ'ని విపక్షాలను కోరుతూ దేశంలోని 32 మంది ప్రముఖులు బహిరంగ లేఖ రాయడం ఈ దిశలో ప్రభావవంతమైన తాజా పరిణామం. ఇదీ ఓ రకం ఒత్తిడే!అత్యున్నత పదవుల్లో ఒకటి ప్రజాస్వామ్య వ్యవస్థల్లో భారత రాజ్యాంగం సంపూర్ణ స్వేచ్ఛ, భద్రత కల్పించిన అత్యున్నత బాధ్యతలు గలది ఎన్నికల సంఘానికి నేతృత్వం వహించే సిఇసి పదవి. గడిచిన 75 సంవత్సరాల్లో 26 మంది ఆ పదవిలోకి వస్తే ఇద్దరి పేర్లే ప్రజల నాలుకల మీద బాగా నానాయి. 90లలో ఎంతో క్రియాశీలంగా పనిచేసి, ఎన్నికల సంఘం ఉనికినే శిఖరాయమాన స్థితికి తెచ్చిన టి.ఎన్. శేషన్ ఒకందుకు ప్రచారంలోకి వస్తే, ప్రస్తుతం జ్ఞానేశ్ కుమార్ ఇంకొందుకు గణుతికెక్కారు. ఎన్నికల సంఘం స్వేచ్ఛ, స్వతంత్రతను గంగలో కలిపి కేంద్ర ప్రభుత్వం చెప్పుచేతుల్లోకి వెళ్లిపోయారనే విమర్శ నెదుర్కొంటున్నారు. మిగతా ఇద్దరు కమిషనర్లను బేఖాతరని ఏకపక్షంగా వ్యవహరించి వివాదాస్పదమయ్యారు. అప్పటివరకున్న రాజ్యాంగ స్ఫూర్తి, ఎన్నికల సంఘం నిబంధనలు, ఆచరణ మార్గదర్శకాలు, సంస్కరణ పరిధిలోనే ఎన్నికల విధుల్ని వికేంద్రీకరించి శేషన్ ఇసి పేరును ఇనుమడింపజేశారు. అందుకు పూర్తి విరుద్ధంగా, నిర్ణయాధికారాన్ని, నిర్వహణ ప్రక్రియను మరింత కేంద్రీకృతం చేసి జ్ఞానేశ్‌కుమార్ ఇసి ప్రతిష్ఠను దిగజార్చారు. ఒక దశ దాటి, శేషన్ లో నియంతృత్వ ధోరణ పెరిగినపుడు, ఇసి పాలనాధికారాల్లోనే తప్ప విధాన నిర్ణయాల్లో, అమలులో, సమీక్షాధికారాల్లో ముగ్గురు కమిషనర్లు సమానమే అని శేషన్ నేలకు దిగేలా చేసింది మనోహర్ సింగ్ (ఎం.ఎస్) గిల్. అప్పుడు, తెలుగు వాడైన జి.వి.జి. కృష్ణమూర్తి మరో సహచర కమిషనర్. గిల్ తదనంతరం దివంగత ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో మంత్రిగా కూడా పని చేశారు. తర్వాత లింగ్డో, ఎస్.వై. ఖరేషీ, నవీన్ చావ్లా పేర్లు సిఇసిలుగా అప్పుడప్పుడు వినిపించినా మిగతా 20 మంది సిఇసిలు అనామకంగానే పదవీ విరమణ చేశారు. తమ స్థాయిలో ఎంతో కొంత భారత ఎన్నికల సంఘం ప్రతిష్ఠతను వారంతా ఇనుమడింపజేశారే తప్ప దిగజార్చలేదన్నది నిర్వివాదాంశం ఇకనైనా నోరిప్పుతారా? సిఇసి వ్యవహారం ఇప్పుడు ఎన్‌డిఎ నాయకత్వానికి 'ముందు నుయ్యి వెనుక గొయ్యి' అన్నట్టుగా తయారయింది. బిజెపి అధికార ప్రతినిధుల ప్రెస్ కాన్ఫరెన్స్‌లు, అనధికార లీక్‌లతో వ్యవహారం గాడిన పడేలా లేదు. ఎన్నికల సంఘమే బలమైన ఐక్య స్వరం వినిపించి పరిస్థితిని చక్కదిద్దుకోవడానికి గల దశ ఎప్పుడో దాటిపోయింది. మిగిలింది ఇక ప్రభుత్వాధినేత అయిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నోరు విప్పి మాట్లాడటమే. 'ప్రజాస్వామ్యానికి భారత్ తల్లి వంటింది' అని స్వయంగా ప్రకటించి, మన ఎన్నికల ప్రక్రియను ఎన్నో అంతర్జాతీయ వేదికలపై ప్రస్తుతించిన ప్రధాని ఇప్పుడు అదే బాధ్యత ఎన్నికల సంఘం ప్రతిష్ఠ నిలపడానికి గొంతెత్తుతారా? గొంతు విప్పితే ఏం మాట్లాడుతారు? ఇది సర్వత్రా ఆసక్తిని రేపేదే! ఏం మాట్లాడకుండానే వ్యవహారం చక్కదిద్దుతారా? అన్నదీ ఉత్కంఠ రేపేదే! ఈ సంకట స్థితిలో ప్రధాని తీసుకోబోయే నిర్ణయం.

## ఎనిమిది అడుగుల కాలభైరవుడు అర్ధరాత్రి ఎడ్లబండి ఆగిపోయిన చోటే ఆలయం! రామారెడ్డి కాలభైరవ క్షేత్రం కథ ఇదే!



పరమ శివుని అత్యంత భీకరమైన, శక్తిమంతమైన, రౌద్ర రూపమే కాలభైరవ స్వరూపం. కాలానికి, మృత్యువుకు అధిపతి కాలభైరవుడు. విశ్వ రక్షణ, ఆలయాల రక్షణ బాధ్యత వహించే కాలభైరవ స్వామి.

**ఎవరీ కాలభైరవుడు?**

"నేను" అనే అహంకారమే మనిషి పతనానికి కారణం అని ఆధ్యాత్మిక తత్వం చెబుతుంది. పురాణ కథనం ప్రకారం, బ్రహ్మదేవునిలో ఏర్పడిన అహంకారాన్ని అణచివేసిన శివుని ఉగ్ర స్వరూపమే కాలభైరవుడు.

శివుని నుంచి ఆవిర్భవించిన కాలభైరవుడు

పరమేశ్వరుని కాలభైరవ స్వరూపం "నాకంటే గొప్పవాడు లేడు" అనే అహంకారం ఎవరిలోనూ ఉండకూడదు అనే గొప్ప సందేశాన్ని అందిస్తాడు. అహంకారాన్ని తొలగించి, ధర్మ మార్గంలో నడిపించే దైవం స్వరూపంగా కాలభైరవుడిని భక్తులు ఆరాధిస్తారు. దేశవ్యాప్తంగా అనేక పుణ్యక్షేత్రాల్లో కాలభైరవ స్వామి ఆలయాలున్నాయి. ఈ సందర్భంగా ్యం గురించి తెలుసుకుందాం.

**క్షేత్రపాలకుడు**

హిందూ సంప్రదాయం ప్రకారం ఆలయాలను, దిక్కులను ఆలయ ప్రాంగణాలను రక్షించే శక్తిగా కాలభైరవుడిని భావిస్తారు. ప్రముఖ పుణ్యక్షేత్రం కాశీ నగరానికి ఇతనే ప్రధాన రక్షకుడు. అంతేకాదు అనేక శివాలయాలకు కూడా కాలభైరవుడే రక్షకుడు. దాదాపుగా ప్రతి శివాలయంలోని కాలభైరవుని స్వరూపాన్ని దర్శించుకోవచ్చు.

**పాప విమోచకుడు**

కాలభైరవుడుని భక్తుల భయాలను, బాధలను తొలగించి, వారి పాపాలను నశింపజేసే దైవంగా పూజిస్తారు. ఈ క్రమంలో తెలంగాణ కామారెడ్డి పట్టణంలో వెలసిన కాలభైరవ క్షేత్ర విశేషాలు తెలుసుకుందాం.

రామారెడ్డి కాలభైరవ క్షేత్రం

తెలంగాణలోని కామారెడ్డి పట్టణానికి సుమారు 8 కిలోమీటర్ల దూరంలో వెలసిన ఈ ప్రాచీన కాలభైరవ క్షేత్రం ఎంతో విశిష్టమైనది. ఈ క్షేత్రంలో కాలభైరవుడు స్వయంభువుగా వెలసినట్లు ఆలయ స్థల పురాణం ద్వారా తెలుస్తోంది.

**ఆలయ స్థల పురాణం**

ఆలయ స్థల పురాణం ప్రకారం, సుమారు 16వ శతాబ్దంలో కాశీ నుంచి కాలభైరవ స్వామివారి విగ్రహాన్ని ఎడ్లబండిపై తీసుకువస్తుండగా, ఈ ప్రాంతానికి చేరుకునే సమయానికి రాత్రి అయిందట. దీంతో భక్తులు అక్కడే విశ్రాంతి తీసుకున్నారు. హఠాత్తుగా అర్ధరాత్రి సమయంలో భారీ శబ్దం రావడంతో ఎడ్లబండి విరిగిపోయి, స్వామివారి విగ్రహం అక్కడే నిటారుగా నిలిచిపోయిందని చెబుతారు. ఈ సంఘటన స్వామి వారి సంకల్పంగా భావించిన భక్తులు, ఆ ప్రదేశంలోనే ఆలయాన్ని నిర్మించారని స్థలపురాణం ద్వారా తెలుస్తోంది.

ఎనిమిది అడుగుల కాలభైరవుడు!

గర్భాలయంలో శునకాన్ని వాహనంగా చేసుకున్న సుమారు ఎనిమిది అడుగుల ఎత్తైన కాలభైరవ స్వామి వారి మూలవిరాట్టు భక్తులకు దర్శనమిస్తుంది. స్వామివారి విశ్వరూపాన్ని దర్శించుకోవడం భక్తులకు ఎంతో ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తుంది. ఆలయ ప్రాంగణంలో ఇటీవల శనీశ్వర స్వామి వారి ఆలయాన్ని కూడా నిర్మించారు.

**ఆలయ విశేషాలు**

దాదాపు రెండు వేల సంవత్సరాల క్రితం ఈ గుడి నిర్మించారు. ఈ గుడిలోని దిగంబర కాలభైరవుని విగ్రహం సా.శ.13వ శతాబ్ధ కాలం నాటిదని చరిత్రకారుల అభిప్రాయం. ఈ గ్రామంలో అష్టభైరవులు వెలసినట్లు అక్కడివారు చెబుతుంటారు. పూర్వం కరువు వచ్చినపుడు కాలభైరవుని విగ్రహానికి పేడ పూసేవారు. తర్వాత ఆ పేడను తొలగించుకోవడం కోసం వర్షాలు బాగా కురిసేవని స్థానిక ప్రజల నమ్మకం. 1974లో దేవాదాయ శాఖ ఈ గుడిని తమ అధీనంలోకి తీసుకుంది. అనంతరం దాతల సహకారంతో 2001లో దేవాలయం నిర్మించి, రేకుల షెడ్డులో ఉన్న స్వామి విగ్రహాన్ని దేవాలయానికి మార్చారు.

## నారదుడికి అంకితమైన ఆలయాలు ఎక్కడున్నాయో తెలుసా? గద్దె నుంచి సరస్సు వరకు ఆసక్తికర విశేషాలివే!

శ్రీ మహావిష్ణువుకు అత్యంత ప్రియ భక్తుడు, ఘోటక బ్రహ్మచారి నారద మహర్షి! లోకానికి జ్ఞానాన్ని ప్రసాదించేవాడే నారదుడు! త్రిలోక సంచారిగా ప్రసిద్ధి చెందిన నారదుడు బ్రహ్మ మానస పుత్రుడు! నారద మహర్షికి అంకితమైన ఆలయాలు ఉన్నాయి. అవి ఎక్కడ ఉన్నాయో తెలుసా? ఆ విశేషాలేంటో చూద్దాం



**ఎవరీ నారద మహర్షి!**

నారద మహర్షి హిందూ పురాణాల్లో ప్రసిద్ధులైన దేవర్షి, త్రిలోక సంచారి, పరమ విష్ణు భక్తుడు. "నారం" అనగా జ్ఞానం, "దదాతి" అనగా ఇచ్చువాడు. అనగా లోకానికి జ్ఞానాన్ని ప్రసాదించేవాడే నారదుడు. నారద మహర్షి స్వర్గ, భూమి, పాతాళ లోకాలతో పాటు ముల్లోకాలు అవలీలగా సంచరించగలడు. నారద మహర్షి సరస్వతీ దేవి అనుగ్రహంతో సంగీత విద్యను అభ్యసించి, "మహతి" అనే వీణను మీటుతూ నిత్యం "నారాయణ" నామాన్ని జపిస్తుంటాడు.

**భక్తి ప్రచారం**

ప్రహ్లాదుడు, ధ్రువుడు, వాల్మీకి, వ్యాసుడు వంటి మహానుభావుల్లో భక్తిభావాన్ని పెంపొందించి వారిని ఉత్తమ భక్తులుగా తీర్చి దిద్దడంలో నారదుని పాత్ర కీలకం. భారత, భాగవతాది గ్రంథాల్లో నారదుని ఉనికి ప్రత్యక్షంగా కనిపిస్తుంది. ఎన్నో సందర్భాల్లో మహర్షులకు నారదుడు దర్శనమిచ్చి కర్తవ్యాన్ని బోధించినట్లుగా తెలుస్తోంది.

**లోక కల్యాణ కారకం- కలహ ప్రియత్వం**

పురాణాలను పరిశీలిస్తే అనేక సందర్భాల్లో నారదుని ప్రవర్తన పైకి కలహ ప్రియంగా కనిపించినప్పటికీ, దాని వెనుక ధర్మ రక్షణ, చెడును అంతం చేయడం, లోక కల్యాణమే ప్రధాన లక్ష్యంగా ఉంటుంది. నారద మహర్షికి ప్రత్యేకించిన ఆలయాలు అతి తక్కువే అయినప్పటికీ ఆ ఆలయాలన్నీ నారదునికి అంకితం చేసి ఉండటం విశేషం. నారద మహర్షికి అంకితమైన ఈ ఆలయాలు **ఎక్కడెక్కడ ఉన్నాయి?**

కృష్ణానదీ తీరంలో నారదుని ఆలయం

కర్ణాటకలోని దావణగెరెకు 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న చిగతేరి ప్రాంతంలో రాయచూర్ నగరానికి దగ్గరలోని కోర్వా ద్వీపంలో, కృష్ణానదీ తీరంలో వెలసిన నారదుని గుడి ప్రకృతి రమణీయతకు పెట్టింది పేరు.

**నారద గద్దె**

పచ్చని ప్రకృతి సౌందర్యాలు నడుమ ప్రశాంతమైన వాతావరణంలో ఒక ద్వీపంలో నెలకొని ఉన్న ఈ ఆలయం యాత్రికులను విశేషంగా ఆకర్షిస్తోంది. కొన్ని దశాబ్దాల నుంచి ఈ గుడిలో భక్తులు నారదమహర్షిని దేవుడిగా కొలవడం ఆచారంగా వస్తోంది. అందుకే కోర్వా ప్రాంతాన్ని 'నారద గద్దె' అని కూడా పిలుస్తుంటారు.

నారద మహర్షి తపస్సు చేసిన ప్రదేశం

కోర్వా ప్రాంతమంటేనే ద్వీప సముదాయం. ఆ ద్వీపం మధ్యలో నదీతీరంలో కొలువైన నారదమహర్షి ఆలయాన్ని దర్శించుకోవడానికి దేశ విదేశాల నుంచి కూడా ఎందరో భక్తులు తరలి రావడం విశేషం. ఈ ద్వీపంలోనే నారదమహర్షి కొన్నాళ్లు ఆశ్రమం ఏర్పరచుకుని తపస్సు ఆచరించారని తెలుస్తోంది. అందుచేతనే ఇక్కడ నారద మహర్షి ఆలయం వెలసి ఉందని విశ్వాసం.

**మధ్యప్రదేశ్‌లో మరో ఆలయం**

కేవలం కర్ణాటకలోనే కాదు, మధ్యప్రదేశ్‌లోని భీండ్ జిల్లాలో కూడా నారదుడికి ఒక ఆలయం ఉంది. కాళీ సింధ్ నదీ తీరంలో వెలసిన ఈ ఆలయం కూడా పురాతనమైనదే! పర్వదినాల సమయంలో, ఏకాదశి తిథుల్లో భీండ్‌లోని ప్రఖ్యాత శివుని ఆలయంతో పాటు నారదమహర్షి ఆలయాన్ని కూడా దర్శించుకోవడానికి విపరీతంగా భక్తులు తరలి వస్తుంటారు. ఆయా సమయాల్లో ఈ

## భారత్‌లో రేంజ్ రోవర్ స్పోర్ట్ ఎలక్ట్రిక్ బుకింగ్స్ ఓపెన్: సింగిల్ ఛార్జ్‌తో 609ఎం రేంజ్!



జాగ్వార్ ల్యాండ్ రోవర్ తన ఎలక్ట్రిక్ పోర్ట్‌ఫోలియోను విస్తరిస్తోంది. కంపెనీ సరికొత్త "రేంజ్ రోవర్ స్పోర్ట్ ఎలక్ట్రిక్"ను ఆవిష్కరించడంతో పాటు భారత్‌లో బుకింగ్స్‌ను కూడా ప్రారంభించింది. రేంజ్ రోవర్ స్పోర్ట్ లైనప్‌లో ఇది మొట్టమొదటి పూర్తి ఎలక్ట్రిక మోడల్ కావడం విశేషం. ఈ కొత్త ఎలక్ట్రిక్ ాఖు, గతంలో విడుదలైన రేంజ్ రోవర్ ఎలక్ట్రిక్ ప్లాట్‌ఫామ్‌నే పంచుకుంటుంది. ఫుల్ ఛార్జ్‌పై ఇది 609 కిలోమీటర్ల వరకు ొూా రేంజ్‌ను అందిస్తుందని కంపెనీ చెబుతోంది. పనితీరు విషయానికొస్తే, ఈ ాఖు డ్యూయల్-మోటార్ సెటప్‌తో పనిచేస్తుంది. ఇది ఆల్-వీల్ డ్రైవ్ (ూాఔణ) డ్రైవ్‌ట్రెయిన్‌ను కలిగి ఉంది. ఎ8-పవర్డ్ రేంజ్ రోవర్ స్పోర్ట్‌కు సమానమైన పనితీరును ఈ ఎలక్ట్రిక్ వెర్షన్ అందిస్తుందని జీూ= తెలిపింది.హనం కావడంతో భారత్-యూకే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఖీూా) కింద లభించే సుంకాల రాయితీలు దీనికి వర్తించవు. ఈ ాఖు ధర సుమారు రూ. 2.5 కోట్లు (ఎక్స్-షోరూమ్) ఉంటుందని అంచనా. ఇది సాధారణ నాన్-ూ రేంజ్ రోవర్ స్పోర్ట్ కంటే ఎక్కువ.రేంజ్ రోవర్ స్పోర్ట్ ఎలక్ట్రిక్: ోనెట్‌పై రేంజ్ రోవర్ అక్షరాలు ఉంటాయి. బంపర్‌లో ఫంక్షనల్ ఎయిర్ వెంట్లు అమర్చారు.రేంజ్ రోవర్ స్పోర్ట్ ఎలక్ట్రిక్ ఇంటీరయర్రేంజ్ రోవర్ స్పోర్ట్ ఎలక్ట్రిక్ ఇంటీరియర్ (ఫొటో క్రెడిట్:సైడ్ ప్రొఫైల్‌లో ఏరోడైనమిక్ ఇన్సర్ట్‌లతో 22-అంగుళాల అల్లాయ్ వీల్స్, జుఎ కోసం ప్రత్యేకంగా డిజైన్ చేసిన వీల్ క్యాప్స్, బాడీలోకి ఇమిడిపోయే డోర్ హ్యాండిల్స్ ఉంటాయి. పిల్లర్లు, రూఫ్, వింగ్ మిర్రర్లు నలుపు రంగులో ఉంటాయి. వెనుక డిజైన్‌లో పెద్దగా మార్పు లేదు. గ్లాస్-బ్లాక్ ప్యానెల్‌పై రేంజ్ రోవర్ అక్షరాలు, ాజుణ టెయిల్‌ల్యాంప్‌లు యథావిధిగా ఉంటాయి. టెయిల్‌గేట్‌పై నలుపు రంగు స్పోర్ట్ బ్యాడ్జ్ తప్ప జుఎ అని ప్రత్యేక బ్యాడ్జ్ ఉండదు.ఈ ఎలక్ట్రిక్ ాఖు క్యాబిన్ పెట్రోల్ మోడల్‌ను పోలి ఉంటుంది. అందులోని టచ్-సెన్సిటివ్ కంట్రోల్స్‌తో మూడు-స్పోక్ స్టీరింగ్ వీల్, పవర్‌ట్రెయిన్‌రేంజ్ రోవర్ స్పోర్ట్ ఎలక్ట్రిక్‌ను, రేంజ్ రోవర్ ఎలక్ట్రిక్‌లో ఉపయోగించిన అదే ఆర్కిటెక్చర్ అయిన జీూ= 800-వోల్ట్ మీూా ఫ్లెక్స్ ప్లాట్‌ఫామ్‌పై నిర్మించారు. ఇది అదే 118.5ఎెౌష్ట బ్యాటరీ ప్యాక్‌ను ఉపయోగిస్తుంది. కానీ 609 కిలోమీటర్ల రేంజ్‌ను అందిస్తుందని పేర్కొన్నారు. ఇది పెద్ద రేంజ్ రోవర్ ఎలక్ట్రిక్ కంటే 9 కిలోమీటర్లు అధికం. ఈ బ్యాటరీకి ఎనిమిది సంవత్సరాలు లేదా 1.6 లక్షల కిలోమీటర్లు, ఏది ముందుగా వస్తే దాని ప్రకారం ప్రామాణిక వారంటీ లభిస్తుంది.రేంజ్ రోవర్ స్పోర్ట్ ఎలక్ట్రిక్: ఎక్స్?టీరియర్, ఇంటీరియర్ డిజైన్ఈ ఎలక్ట్రిక్ మోడల్ చూసేందుకు పెట్రోల్‌తో నడిచే రేంజ్ రోవర్ స్పోర్ట్ మాదిరిగానే ఉంటుంది. ముందు భాగంలో ఆకర్షణీయమైన ాజుణ హెడ్‌లైట్లు, ఏరోడైనమిక్ డిజైన్‌లో నలుపు రంగు గ్రిల్, దానిపై అడ్డంగా ఉండే ప్యాటర్న్, పక్కకు అమర్చిన ల్యాండ్ రోవర్ బ్యాడ్జ్ కనిపిస్తాయి. బోనెట్‌పై రేంజ్ రోవర్ అక్షరాలు ఉంటాయి. బంపర్‌లో ఫంక్షనల్ ఎయిర్ వెంట్లు అమర్చారు.రేంజ్ రోవర్ స్పోర్ట్ ఎలక్ట్రిక్ ఇంటీరయర్రేంజ్ రోవర్ స్పోర్ట్ ఎలక్ట్రిక్ ఇంటీరియర్ (ఫొటో క్రెడిట్:సైడ్ ప్రొఫైల్‌లో ఏరోడైనమిక్ ఇన్సర్ట్‌లతో 22-అంగుళాల అల్లాయ్ వీల్స్, జుఎ కోసం ప్రత్యేకంగా డిజైన్ చేసిన వీల్ క్యాప్స్, బాడీలోకి ఇమిడిపోయే డోర్ హ్యాండిల్స్ ఉంటాయి. పిల్లర్లు, రూఫ్, వింగ్ మిర్రర్లు నలుపు రంగులో ఉంటాయి. వెనుక డిజైన్‌లో పెద్దగా మార్పు లేదు. గ్లాస్-బ్లాక్ ప్యానెల్‌పై రేంజ్ రోవర్ అక్షరాలు, ాజుణ టెయిల్‌ల్యాంప్‌లు యథావిధిగా ఉంటాయి. టెయిల్‌గేట్‌పై నలుపు రంగు స్పోర్ట్ బ్యాడ్జ్ తప్ప జుఎ అని ప్రత్యేక బ్యాడ్జ్ ఉండదు.ఈ ఎలక్ట్రిక్ ాఖు క్యాబిన్ పెట్రోల్ మోడల్‌ను పోలి ఉంటుంది. అందులోని టచ్-సెన్సిటివ్ కంట్రోల్స్‌తో మూడు-స్పోక్ స్టీరింగ్ వీల్, 13.1-అంగుళాల టచ్‌స్క్రీన్, 13.7-అంగుళాల క్లస్టర్ ఇందులోనూ ఉన్నాయి. అయితే వీటిలో ఈ-వెర్షన్‌కు తగ్గ మెనూలు ఉంటాయి. సెంటర్ కన్సోల్, డ్రైవ్-మోడ్ సెలెక్టర్ విషయంలో మాత్రం పెట్రోల్ మోడల్ డిజైన్‌నే యథాతథంగా కొనసాగించారు.స్పోర్ట్ ఎలక్ట్రిక్ ఐదు సీట్ల కాన్ఫిగరేషన్‌తో వస్తుంది. వైర్‌లెస్ ఫోన్ ఛార్జర్, ఫోర్-జోన్ క్లైమేట్ కంట్రోల్, వెనుక విండో సన్‌బ్లైండ్స్ వంటి ం

## తిన్న తర్వాత నడక మంచిదట! - ఎందుకు? - నడవకపోతే ఏం జరుగుతుంది?



నడక వల్ల ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాలెన్నో. అయితే చాలా మంది భోజనం చేశాక కూర్చోవడం, పడుకోవడం చేస్తుంటారు. కానీ, తిన్న వెంటనే ఇలా చేయడం కంటే 10 నిమిషాల పాటు నడవడం వల్ల ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. అవేంటంటే..

ప్రయోజనాలేమిటి? :రక్తంలో చక్కెర స్థాయిల నియంత్రణ : భోజనం చేసిన వెంటనే శరీరంలో గ్లూకోజ్ స్థాయిలు పెరుగుతాయంటున్నారు నిపుణులు. అందుకే, తిన్న తర్వాత నడవడం వల్ల కండరాలు ఆ గ్లూకోజ్?ను శక్తిగా వాడుకుంటాయని అంటున్నారు. దీనివల్ల బ్లడ్ షుగర్ స్పైక్స్ తగ్గుతాయని పేర్కొంటున్నారు. ఇది ముఖ్యంగా డయాబెటిస్ ఉన్నవారికి చాలా మేలు చేస్తుందని వివరిస్తున్నారు.

జీర్ణక్రియ మెరుగు : నడక వల్ల జీర్ణవ్యవస్థ చురుగ్గా పనిచేస్తుందని నిపుణులు చెబుతున్నారు. జీర్ణాశయంలో ఆహారం సులభంగా కదలడానికి, త్వరగా అరగడానికి సహాయపడుతుందని అంటున్నారు.

కడుపు ఉబ్బరం, గ్యాస్ సమస్యలు : చాలామందికి తిన్న తర్వాత కడుపు భారీగా అనిపించడం, గ్యాస్ లేదా ఉబ్బరం వంటి సమస్యలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. కాసేపు నడవడంతో ఆ ఇబ్బందులు తగ్గుతాయని అంటున్నారు.

యాసిడ్ రిఫ్లక్స్ నివారణ : తిన్న వెంటనే పడుకోవడం వల్ల జీర్ణాశయంలోని ఆమ్లాలు పైకి వస్తాయంటున్నారు నిపుణులు. అయితే నడవడం వల్ల శరీరం నిటారుగా ఉండి, గుండెల్లో మంట లేదా ఎసిడిటీ వచ్చే అవకాశం తగ్గుతుందని చెబుతున్నారు.

బరువు నియంత్రణ : తిన్నాక నడవడం వల్ల శరీరంలో అదనపు క్యాలరీలు ఖర్చవుతాయని నిపుణులు చెబుతున్నారు. ఇది బరువు పెరగకుండా చూస్తుందని అంటున్నారు.

తరచూ కండరాల నొప్పులా? - మెగ్నీషియం లోపం కావొచ్చంటున్న నిపుణులు!

నడవకపోతే ఏమవుతుంది? : భోజనం తర్వాత రక్తం అంతా జీర్ణక్రియ కోసం పొట్ట భాగంలోకి కేంద్రీకృతమవుతుందని నిపుణులు చెబుతున్నారు. దీనికి తోడు కదలకుండా కూర్చుంటే మెదడుకు, ఇతర భాగాలకు రక్త ప్రసరణ తగ్గి బద్ధకం, నిద్రమత్తు ఆవహిస్తాయని అంటున్నారు. అదే పది నిమిషాలు నడిస్తే రక్త ప్రసరణ మెరుగై చురుగ్గా ఉంటారని తెలియజేస్తున్నారు.

తిన్న ఆహారం ద్వారా వచ్చిన క్యాలరీలను శరీరం ఖర్చు చేయనప్పుడు, అది కొవ్వు రూపంలో మారి ముఖ్యంగా పొట్ట, నడుము భాగాల్లో పేరుకుపోతుందని నిపుణులు చెబుతున్నారు. ఇది ఒబెసిటీకి దారితీస్తోందని హెచ్చరిస్తున్నారు.

తిన్న వెంటనే రక్తంలో కొవ్వులు కూడా పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు. కదలికలు లేకపోవడం వల్ల ఈ కొవ్వులు కరగవు అని అంటున్నారు. ఇది దీర్ఘకాలంలో రక్తనాళాల్లో అడ్డంకులకు, బీపీ పెరగడానికి, గుండె జబ్బులకు కారణం కావచ్చని తెలియజేస్తున్నారు.షుగర్, బీపీ ఉన్నవారికి భోజనం తర్వాత నడక ఓ అద్భుతమైన ఔషధంలా పనిచేస్తుంది. తిన్న వెంటనే నడవడం వల్ల కండరాలు రక్తంలోని గ్లూకోజ్?ను నేరుగా వాడుకుంటాయి. దీనివల్ల షుగర్ లెవెల్స్ అకస్మాత్తుగా పెరగవు. అలాగే, రక్తప్రసరణను మెరుగుపరిచి బీపీని అదుపులో ఉంచడంతో పాటు గుండెను ఆరోగ్యంగా ఉంచడానికి సహాయపడుతుంది. అలాగే, షుగర్ ఉన్న వారికి పాదాల రక్షణ చాలా ముఖ్యం. ఇంట్లో, బయట నడిచినా కచ్చితంగా మెత్తటి, సౌకర్యవంతమైన చెప్పులు లేదా షూస్ ధరించాలి. రాత్రి భోజనం తర్వాత నడవడమనేది వీరికి చాలా అవసరం. ఇది రాత్రిపూట వచ్చే ఎసిడిటీని తగ్గించి, ఉదయానికి ఫాస్టింగ్ షుగర్ లెవెల్స్ అదుపులో ఉండేలా చేస్తుంది. బీపీ ఎక్కువగా ఉన్నప్పుడు తిన్న వెంటనే నడవొద్దు. కాసేపు విశ్రాంతి తీసుకోవాలి.- శ్రీనివాస్?రావు, జీర్ణకోశ వైద్య నిపుణులుఎలా నడవాలి? :

ఉదయం అల్పాహారం తీసుకున్నాక కంగారుగా కాకుండా ప్రశాంతంగా 10 నిమిషాలు నడవాలని నిపుణులు చెబుతున్నారు

ఆఫీసులో మధ్యాహ్నం భోజనం చేసిన వెంటనే సీట్లలో కూర్చుంటారు. దీనివల్ల పొట్ట చుట్టూ కొవ్వు చేరుతుందంటున్నారు. కాబట్టి, కారిడార్?లో లేదా క్యాంపస్?లో 10 నిమిషాలు తిరగడం మంచిదట.

రాత్రి తిన్న వెంటనే పడుకోవడం వల్ల గ్యాస్, ఎసిడిటీ సమస్యలు పెరుగుతాయని హెచ్చరిస్తున్నారు. అందుకే, 10 నిమిషాలు నెమ్మదిగా నడవాలని అంటున్నారు. దీనివల్ల నిద్ర కూడా బాగా పడుతుందని చెబుతున్నారు.

తిన్న వెంటనే పరుగుపెట్టడం లేదా వేగంగా నడవడం వల్ల కడుపునొప్పి లేదా జీర్ణ సమస్యలు తలెత్తొచ్చట. జిమ్?కు వెళ్లడం లేదా బరువులు ఎత్తడం వంటివి చేయకూడదని పేర్కొంటున్నారు.ఇది వ్యాయామం కోసం చేసే నడక కాదు. కేవలం తిన్నది అరగడానికి చేసేది కాబట్టి చాలా నెమ్మదిగా, తేలికగా నడవాలని నిపుణులు చెబుతున్నారు. వేగంగా నడిస్తే రక్తం జీర్ణవ్యవస్థకు వెళ్లకుండా కండరాలకు మళ్లుతుందని.. దీనివల్ల గుండెపై ఒత్తిడి పడటమే కాకుండా అజీర్తి చేస్తుందని వివరిస్తున్నారు.చీూజు : ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. కానీ, వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# భీమసింగి షుగర్ ఫ్యాక్టరీ పై అసత్య కథనాలు అల్లొద్దు

**మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హితవు**



**గజపతినగరం, అక్టోబర్ 1 :** భీమసింగి షుగర్ ఫ్యాక్టరీ పై అసత్య కథనాలను అల్లవద్దనీ రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హితవు పలికారు. గురువారం భీమసింగి కథనాలపై విలేకరులు అడిగిన ప్రశ్నకు మంత్రి ఘాటుగా సమాధానం అందించారు. అనని మాటలను అన్నట్లు ఎన్టీవీ లో కథనం వచ్చినట్లు ప్రచారం చేయటం విడ్డూరంగా ఉందన్నారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న విషయాన్ని ఎన్టీవీ యాజమాన్యం వారు ప్రచారం చేయలేదని తెలిపారన్నారు. గత వైసిపి ప్రభుత్వం లోనే భీమ సింగి ఫ్యాక్టరీని మూసివేసిన సంగతి అందరికీ తెలిసిందేనన్నారు. వైసిపి వారు అపోహలను సృష్టించి ఫ్యాక్టరీకి సంబంధించిన వారిని ఆందోళనకు గురి చేయటం సిగ్గుచేటని, భీమసింగి షుగర్ ఫ్యాక్టరీ రైతులకు, ఉద్యోగులకు, కార్మికులకు, పెట్టుబడిదారులకు అన్ని విధాల సహకారం అందించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి తెలిపారు. ఉనికి కాపాడుకోవడం కోసం వైసీపీ నాయకులు రైతు, కూలి సంఘాలను రెచ్చగొట్టడం సబబు కాదని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హితవు పలికారు

# పేదల సామాజిక భద్రతకు ఎన్‌టీఆర్ భరోసా

- జిల్లాలో 2,23,883 మంది లబ్ధిదారులకు రూ. 86.59 కోట్లు
- పెన్షన్ల పంపిణీలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, అక్టోబర్ 01, 2026 :** స్వర్ణాంధ్ర ఏ 2047 లక్ష్యాల సాధనకు అనుగుణంగా పేదలకు సామాజిక భద్రత కల్పించేందుకు, పేదరిక నిర్మూలనకు ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ల ఫలాలను అర్హుల ఇంటివద్దకే అందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.గురువారం విజయవాడ అర్బన్, మధురానగర్ లో ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ పాల్గొన్నారు. లబ్ధిదారులతో మాట్లాడి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పారదర్శకంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందుతున్న వారు వాటిని సద్వినియోగం చేసుకుని తమ కుటుంబాల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. జిల్లాలో 2,23,883 మంది లబ్ధిదారులకు రూ. 86.59 కోట్లు మేర పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు, ఇతర లబ్ధిదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది ఇంటిదగ్గరే పెన్షన్లు అందిస్తున్నట్లు వివరించారు. పంపిణీ సమయంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి కరకట్ట సర్వేను అడ్డుకున్న కొల్లుచెరువు సొసైటీ సభ్యులు



**బూర్గంపహాడ్, అక్టోబర్ 01 :** బూర్గంపహాడ్ మండల కేంద్రంలో కొల్లు చెరువు సమీపంలో చేపట్టిన గోదావరి కరకట్ట సర్వే పనులను కొల్లుచెరువు సొసైటీ సభ్యులు గురువారం అడ్డుకున్నారు. కరకట్ట నిర్మాణ పనులకు సంబంధించి కొల్లుచెరువు ప్రాతంలో సర్వేయర్ సంజీవ్ ఆధ్వర్యంలో సర్వే నిర్వహిస్తుండగా కొల్లుచెరువు తమ జీవనాధారమని, ఈ సర్వే పనుల్లో కొల్లుచెరువును కోల్పోతే ఎప్పటి నుంచో ఇక్కడ చేపలు పెంచుతూ జీవనం సాగిస్తున్న తమకు జీవనాధారం కోల్పోతామని, తమ కుటుంబాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ ప్రాంతంలో సర్వే నిలిపివేసి కొల్లుచెరువు సర్వేలో పోకుండా చూడాలని డిమాండ్ చేశారు. చెరువును కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, సర్వేలో కొల్లుచెరువును కోల్పోతే తమకు ప్రభుత్వం నుండి పరిహారం అందేలా చూడాలని సొసైటీ సభ్యులు సర్వేను అడ్డుకోవడంతో తాత్కాలికంగా సర్వే పనులు నిలిపివేశారు. సర్వేను అడ్డుకున్న వారిలో సొసైటీ అధ్యక్షుడు గుండె నర్సింహారావు, సభ్యులు బిల్లకంటి పాపయ్య, గోనెల వెంకటేశ్వర్లు, బొగ్గుల సతీష్, చంద్రయ్య సభ్యులు, రైతులు ఉన్నారు.

# కరెంట్ సమస్యలతో తాగునీటికి కటకట



**వేములవాడ, అక్టోబర్ 1:** విద్యుత్తు సమస్యలతో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ, సిరిసిల్ల మున్సిపాలిటీలలో తాగునీటి కటకట ఏర్పడింది. ఈ రెండు మున్సిపాలిటీలకు వేములవాడ అర్బన్ మండలం మారుపాక ఫిల్టర్ బెడ్ ద్వారా మంచినీటి సరఫరా జరుగుతున్నది. సిరిసిల్లకు 95 లక్షలు, వేములవాడకు 85 లక్షల లీటర్లను నిత్యం సరఫరా చేయాల్సి ఉంటుంది. పంప్ హౌసుల్లో మొత్తం మూడు మోటర్లు ఉండగా, రెండు మోటర్లు నిర్విరామంగా పనిచేస్తుంటాయి. అత్యవసర పరిస్థితులలో వినియోగించేందుకు ఒకటి అందుబాటులో ఉంచారు.ఇటీవల పెరిగిన విద్యుత్తు వినియోగం, గ్రామాల్లో వ్యవసాయానికి ఉదయం మాత్రమే సరఫరా కావడం, ఒకేసారి అందరూ వినియోగించడం ద్వారా కరెంట్ హెచ్చుతగ్గులతో బుధవారం మోటర్లు కాలిపోయాయని సంబంధిత అధికారులు తెలిపారు. ఒకేసారి రెండు మోటర్లు కాలిపోవడంతో మున్సిపాలిటీల్లో నీటి సరఫరాపై తీవ్ర ప్రభావం పడింది. ప్రస్తుతం ఒకే మోటర్‌ను రన్ చేస్తుండగా, ఒకరోజు ఒక మున్సిపాలిటీ, మరొక రోజు ఇంకో మున్సిపాలిటీకి సరఫరా చేస్తున్నారు.

# పోషకాహార లోపం నివారణలో అంగన్వాడీలు కీలకం



**కామవరపుకోట :** అంగన్వాడీల సేవలను గర్భిణీలు, బాలింతలు సద్వినియోగించుకోవాలని ఐసీడీఎస్ పీడి పి.శారద పిలుపు ఇచ్చారు. జాతీయ పోషణ మాస వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని కామవరపుకోట – 6 అంగన్వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శారద మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలకు సమాజ ఆరోగ్యం, పోషకాహార ప్రాధాన్యతపై తగు సూచనలు, సలహాలు అందించారు. గ్రామీణ ప్రాంతాల్లో పోషకాహార లోపాన్ని నివారించడంలో అంగన్వాడీ కార్యకర్తల పాత్ర ఎంతో కీలకం అని ఆమె పేర్కొన్నారు. జంగారెడ్డిగూడెం సీడీపీవో బ్యూలా మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తోన్న పోషకాహారం, ఆరోగ్య పర్యవేక్షణ సేవలు ప్రతి ఒక్కరికి అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మజ్యోతి, స్థానిక అంగన్వాడీ కార్యకర్తలు, ఆయా కేంద్రాల పరిధిలో తల్లులు, బాలింతలు పాల్గొన్నారు.

# డిజిటల్ మార్కెటింగ్ ఉచిత శిక్షణ

- డిజిటల్ మార్కెటింగ్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం
- జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు
- జిల్లా ఉపాధి కల్పన అధికారి సి.మధుభూషణ్ రావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు.



**విజయవాడ: అక్టోబర్ 1,2026 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే ఉద్దేశంతో కానూరు తులసినగర్‌లోని ఫెడరల్ స్కిల్ అకాడమీ ట్రైనింగ్ సెంటర్లో డిజిటల్ మార్కెటింగ్ పై ఉచిత సర్టిఫికెట్ శిక్షణ నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. శిక్షణ అనంతరం ప్రముఖ ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు.ఏదైనా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన 18 నుంచి 30 సంవత్సరాల వయస్సు గల అభ్యర్థులు ఈ శిక్షణకు అర్హులని తెలిపారు. అక్టోబర్ 5,2026 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు విద్యార్హత ధ్రువపత్రాలు, ఆధార్ కాపీ, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో కానూరు తులసినగర్‌లోని ఫెడరల్ స్కిల్ అకాడమీ ట్రైనింగ్ సెంటర్‌కు నేరుగా హాజరై నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 87146 92747, 87146 92748 నంబర్లను సంప్రదించాలని కోరారు.

# కృష్ణసాగర్ పంచాయతీలో స్వచ్ఛ భారత్



**బూర్గంపహాడ్, అక్టోబర్ 01 :** బూర్గంపహాడ్ మండల పరిధిలోని కృష్ణసాగర్ పంచాయతీలో ఐటీసీ వాష్, ఐటీసీ సంస్థల ఆధ్వర్యంలో సర్పంచ్, ఉప సర్పంచులు గురువారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. గ్రామంలో సర్పంచ్ తాటి వాణి, ఉప సర్పంచ్ భూక్యా మోహనరావు ఐటీసీ వాష్, ఐటీసీ ఎనీవోల ప్రతినిధులు, గ్రామస్థులతో కలిసి శ్రమదానం నిర్వహించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపట్టారు. వీబీజీ రామ్ జీ ఆధ్వర్యంలో మ్యాప్‌ను రూపొందించి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. గ్రామంలో పరిశుభ్రత, పారిశుధ్యం, పరిసరాల పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం పంచాయతీలో సేవలందిస్తున్న ఎంపీడబ్ల్యూ వర్కర్లను శాలువాతో సత్కరించారు. పాలకవర్గ సభ్యులు, కార్యదర్శి నాగిరెడ్డి, ఎంపీడబ్ల్యు వర్కర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# మహారాష్ట్రలో విషాదం బీచ్‌లో మునిగి ఎనిమిది మంది కాలేజీ విద్యార్థులు మృతి



మహారాష్ట్రలో ఘోర విషాదం జరిగింది. సరదాగా బీచ్‌కు పిక్నిక్ వెళ్లిన ఎనిమిది మంది విద్యార్థులు సముద్రంలో గల్లంతయ్యారు. వారి మృతదేహాలను అధికారులు వెలికితీశారు. ఈ ఘటన మహారాష్ట్ర, రాయ్‌గఢ్ జిల్లాలోని దివేగర్ బీచ్‌లో గురువారం సాయంత్రం జరిగింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలివి. పూనే జిల్లాలోని అలాండిలోని ఒక ప్రైవేటు కోచింగ్ సెంటర్‌కు చెందిన కొందరు 11, 12 తరగతుల విద్యార్థులు రాయ్‌గఢ్ శ్రీవర్ధన్ తాలూకాలోని దివేగర్ బీచ్‌కు పిక్నిక్‌కు వచ్చారు. ఇది స్థానికంగా చాలా ప్రముఖమైన పర్యాటక కేంద్రం. మొత్తం 48 మంది విద్యార్థులు ఈ బీచ్‌కు వచ్చారు. వీరిలో 25 మంది అబ్బాయిలు, 17 మంది అమ్మాయిలు, ఆరుగురు టీచర్లు ఉన్నారు. బీచ్‌కు వచ్చిన తర్వాత సముద్ర జలాల్లో ఆడుకునేందుకు కొందరు విద్యార్థులు నీళ్లలోకి వెళ్లారు. ఈ క్రమంలో నీటి లోతును, అలలను అంచనా వేయలేకపోవడంతో ఆ నీటిలోనే కొట్టుకుపోయారు. ఎనిమిది మంది విద్యార్థులు మునిగిపోవడంతో టీచర్లు, తోటి విద్యార్థులు వెంటనే స్థానికులు, రెస్క్యూ బృందాలను అలర్ట్ చేశారు. వారు వేగంగా స్పందించి రంగంలోకి దిగారు. అక్కడే ఉన్న మహాకాళి వాటర్ స్పోర్ట్స్ ఎంప్లాయిస్, టూరిస్టులు, స్థానికులు కలిసి గల్లంతైన వారి కోసం గాలించారు. ఈ క్రమంలో ఎనిమిది మంది మృతదేహాలను గుర్తించి, వెలికి తీశారు. మృతదేహాల్ని బొర్లి పంచతన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. సముద్రంపై వారికి అవగాహన లేకపోవడం, లోతును, అలలను అంచనా వేయలేకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని అధికారులు భావిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. ఈ ప్రమాదంపై మహారాష్ట్ర మంత్రి నితీష్ రానే సంతాపం వ్యక్తం చేశారు.

# గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన చింతలపూడి ఎమ్మెల్యే రోషన్ కుమార్, ఏలూరు ఎంపీ మహేష్ కుమార్



**ఏలూరు జిల్లా, లింగపాలెం, అక్టోబర్ 1 :** గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను మెరుగుపరిచి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తోందని ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. మండలంలోని అయ్యప్పరాజుగూడెంలో రూ. 2.53 కోట్ల నిధులతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మహేష్ కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధితో ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు సులభంగా తరలించేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి సమప్రాధాన్యం ఇస్తూ ప్రజలకు పథకాలను చేరువ చేస్తోందన్నారు. త్వరలోనే చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభిస్తామని తెలిపారు. పర్యావరణ అనుమతులు లభించాయని అన్నారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. రానున్న రోజుల్లోనూ ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని పేర్కొన్నారు.

# ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం షెడ్యూల్‌లో మార్పు



**విజయవాడ: అక్టోబర్ 01, 2026 :** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చేపడుతున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమానికి సంబం ధించి సవరించిన షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం ప్రకటించిందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి. లక్ష్మీశ తెలిపారు. ఎన్నికల సంఘం ఉత్తర్వుల ప్రకారం సవరించిన షెడ్యూల్‌లో భాగంగా క్లెయిమ్‌లు, అభ్యంతరాల నోటీసుల దశ, వాటి పరిష్కార ప్రక్రియ జూలై 31,2026 నుంచి అక్టోబర్ 10,2026 వరకు కొనసాగుతుందని తెలిపారు. అనంతరం తుది ఓటర్ల జాబితా అక్టోబర్ 16, 2026న ప్రచురించబడుతుందని పేర్కొన్నారు. సవరించిన షెడ్యూల్‌కు సంబంధించి జిల్లా స్థాయిలో సంబంధిత అధికారులు, సిబ్బందికి సమాచారం అందించి, ప్రజలకు విస్తృతంగా ప్రచారం కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అలాగే గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు కూడా సవరించిన షెడ్యూల్‌ను లిఖితపూర్వకంగా తెలియజేయనున్నట్లు పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలో తమ పేరు, వివరాలను పరిశీలించుకోవాలని, ఏవైనా అభ్యంతరాలు లేదా సవరణలు అవసరమైతే నిర్ణీత గడువులోగా సంబంధిత ఎన్నికల అధికారులను సంప్రదించాలని జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి డా.జి. లక్ష్మీశ ప్రజలకు సూచించారు.

# జర్నలిస్టుల హక్కుల సాధనకై రేపు టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో నిరసనలు



**జూలూరుపాడు, అక్టోబర్ 01 :** జర్నలిస్టుల హక్కుల సాధన కోసం టీయుడబ్ల్యూజె (ఐజెయు) ఆధ్వర్యంలో రేపు నిర్వహించే నిరసనలో జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ సభ్యుడు మోదుగు ప్రభాకర్ పిలుపునిచ్చారు. గురువారం జూలూరుపాడు మండల కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని అక్టోబర్ 2వ తేదీ ఉదయం 11 గంటలకు జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంతో పాటు భద్రాచలం, పినపాక, ఇల్లెందు నియోజక కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. జర్నలిస్టుల సంక్షేమం, హక్కులు, రక్షణ, వృత్తిపరమైన సమస్యల పరిష్కారం కోసం జర్నలిస్టులు ఐక్యతతో ముందుకు కదలాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఆధునిక సాంకేతికత వైద్యులను భర్తీ చేస్తుందా..

# నిపుణులు ఏం చెబుతున్నారు



వైద్య రంగం కేవలం వ్యాధులను గుర్తించడం, చికిత్స అందించడానికే పరిమితం కాకుండా వేగంగా మారుతోంది. ఆసుపత్రుల్లో అపాయింట్‌మెంట్ బుకింగ్ నుంచి వైద్య రికార్డులను పొందడం, పరీక్షలు చేయించుకోవడం, చికిత్స తీసుకోవడం, డిశ్చార్జ్ తర్వాత వైద్యులతో సంప్రదింపులు కొనసాగించడం వరకు ప్రతి దశలో సాంకేతికత వినియోగం పెరుగుతోంది. ఆరోగ్యంపై అవగాహన పెరగడంతో పాటు వైద్య సమాచారాన్ని సులభంగా పొందే అవకాశం రావడంతో రోగుల అంచనాలు కూడా మారుతున్నాయి. చికిత్సకు సంబంధించిన స్పష్టమైన సమాచారం, ఖర్చుల్లో పారదర్శకత, ఆసుపత్రిలో సులభమైన అనుభవాన్ని వారు కోరుకుంటున్నారు. ఈ మార్పులకు అనుగుణంగా ఆసుపత్రుల్లో డిజిటల్ సేవలు, అనుసంధానమైన వ్యవస్థలు, అధునాతన వైద్య సాంకేతికతలు అందుబాటులోకి వస్తున్నాయి. వైద్యులను భర్తీ చేస్తుందా..ఇకపై డిజిటల్ వైద్య సేవల వినియోగం మరింత పెరిగే అవకాశం ఉంది. ఎలక్ట్రానిక్ మెడికల్ రికార్డుల ద్వారా రోగి ఆరోగ్యానికి సంబంధించిన ముఖ్యమైన వివరాలను వైద్యులు, ఇతర ఆరోగ్య సిబ్బంది సులభంగా తెలుసుకునే అవకాశం ఉంటుంది. దీంతో చికిత్సలోని వివిధ దశల్లో ఒకే సమాచారాన్ని పదేపదే సేకరించాల్సిన అవసరం తగ్గుతుంది. ఆసుపత్రి నమోదు, వైద్యుల సంప్రదింపులు, పరీక్షలు, చికిత్స, డిశ్చార్జ్ వంటి ప్రక్రియలను అనుసంధానించే వ్యవస్థలు కూడా పెరుగుతున్నాయి. అపాయింట్‌మెంట్లు బుక్ చేసుకోవడం, పరీక్షల నివేదికలను పొందడం వంటి సేవలను రోగులు డిజిటల్‌గా ఉపయోగించుకునే అవకాశం పెరుగుతోంది. అయితే సాంకేతికత వైద్యులను భర్తీ చేయదని, వైద్యుల నిర్ణయ సామర్థ్యం, మానవీయత, రోగులతో సమర్థవంతమైన సంభాషణకు ఎప్పటికీ ప్రాధాన్యం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.వ్యాధుల నిర్ధారణలోనూ కొత్త సాంకేతికతలు కీలకంగా మారుతున్నాయి. అధిక స్పష్టత కలిగిన ఎంఆర్ఐ, సీటీ స్కాన్‌లు, పీఈటీ–సీటీ, త్రీడీ ఇమేజింగ్, ఆధునిక ప్రయోగశాల, దీంతో వ్యాధి ని మరింత కచ్చితంగా అంచనా వేసి, రోగి అవసరాలకు అనుగుణంగా చికిత్సను రూపొందించే అవకాశం ఉంటుంది. మరోవైపు రోబోటిక్ సహాయంతో చేసే శస్త్రచికిత్సలు, తక్కువ కోతలతో నిర్వహించే చికిత్సలు కూడా ఎంపిక చేసిన రోగులకు అందుబాటులోకి వస్తున్నాయి.

# పెన్షన్ లబ్ధిదారులలో వెల్లి విరుస్తున్న ఆనందం





మంత్రి కొండపల్లి శ్రీనివాస్

- గజపతినగరంలో డిబిటి పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభం
- రాష్ట్రవ్యాప్తంగా 2,692.34 కోట్లు మంజూరు
- పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ
- 2 నెలలుగా పెన్షన్ తీసుకొని 156.21 కోట్లు బకాయిలు విడుదల

**గజపతినగరం, అక్టోబర్ 1 :** కూటమి ప్రభుత్వ అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్లుతో లబ్ధిదారుల్లో ఆనందం వెల్లి విరుస్తుందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం విజయనగరం జిల్లా గజపతినగరం తానా వీధిలో కేంద్ర ఆదేశాల మేరకు ద్వారా నేరుగా బ్యాంక్ ఖాతాల్లో (ఐడీ) పింఛన్ జమ చేసే విధానాన్ని పైలట్ ప్రాతిపదిక పెన్షన్లను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ కొత్త విధానం కింద గజపతినగరం మండలంలోని చీపురుపల్లి... చీపూర్పా పింఛనుదారుల ఖాతాల్లో నేరుగా రు. 6 లక్షలు జమ చేయటం జరిగిందన్నారు. ఈ ఐడీ చెల్లింపు నిబంధన కేవలం చీపూర్పా పరిధిలోని 1919 మంది పింఛనుదారులకు మాత్రమే వర్తిస్తుందనీ, మిగిలిన 6,138,529 లక్షల మంది ఎన్టీఆర్ భరోసా పింఛనుదారులకు యథావిధిగా ఇంటి వద్దే నగదు రూపంలో పింఛన్ అందించడం జరుగుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అక్టోబర్ నెల పింఛన్ల పంపిణీ కోసం రూ.2,692.34 కోట్లను ప్రభుత్వం విడుదల చేయటం జరిగిందన్నారు. అక్టోబర్ నెలలో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 61,40,448 లక్షల మంది పింఛనుదారులకు లబ్ధి చేకూరుతుందన్నారు. పంపిణీ చేసే నిధుల్లో రూ.2,675.63 కోట్లను సంబంధిత స్వర్ణ గ్రామం/స్వర్ణ వార్డు పింఛను బ్యాంక్ ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. తాత్కాలిక వలసల వల్ల ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో పింఛను తీసుకోలేని వారికి బకాయిలతో కలిపి రూ.156.21 కోట్లు విడుదల చేసామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు పింఛన్ల కోసం రూ.76,199.38 కోట్ల రూపాయలు అందజేశామని, 2026--27 ఆర్థిక సంవత్సరానికి గానూ ఎన్టీఆర్ భరోసా పింఛన్ల చెల్లింపుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.33,485.10 కోట్లను కేటాయించడం జరిగిందన్నారు.

గజపతినగరం మండలంలో 8, 096 మందికి పెన్షన్లు అందజేసినట్లు తెలిపారు. వృద్ధులు వికలాంగుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం పెన్షన్ అందించడంతో ఆదుకోవడం జరుగుతుందన్నారు ఈ కార్యక్రమంలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు గంట్యాడ శ్రీదేవి, కేఎంసీ చైర్మన్ పి వి వి గోపాలరాజు, డిఆర్డిఏ పిడి శ్రీనివాస ఫణి తదితరులు పాల్గొన్నారు

# బొటానిక్స్ కంపెనీ ఉత్తరాంధ్ర రైతులకు వరం

మంత్రి కొండపల్లి శ్రీనివాస్



- పసుపు, కాఫీ ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతి
- యువకులు పరిశ్రమ రంగంలోకి రావడం సంతోషం
- పరిశ్రమల స్థాపనకు ఎంఎస్ఎమ్ఈ ప్రోత్సాహం

**విజయనగరం, అక్టోబర్ 1 :** పసుపు కాఫీ ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేసి విదేశాలకు ఎగుమతి చేయటానికి దోహదపడే విధంగా బొటానిక్స్ కంపెనీ ప్రారంభించటం ఉత్తరాంధ్ర రైతులకు వరం అని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం జిల్లాలోని నెల్లిమర్ల నియోజకవర్గం సవరవిల్లీ వద్ద యువ పారిశ్రామికవేత్తలు సురేష్, మధు లు ఏర్పాటుచేసిన బొటానిక్స్ కంపెనీని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఉత్తరాంధ్రకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువ నాయకులు లోకేష్ సారధ్యంలో కూటమి ప్రభుత్వం అనేక పరిశ్రమలను తీసుకురావడం జరుగుతుందన్నారు. భోగాపురం విమానాశ్రయం ద్వారా దేశ విదేశాలకు ఉత్తరాంధ్ర వ్యవసాయ మరియు ఉత్పత్తులను ఎగుమతి చేసుకునే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. బొటానిక్స్ ద్వారా 400 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు కల్పించడంతోపాటు 1100 కుటుంబాలకు మేలు జరగటం మరి ఎంతో సంతోషాన్ని కలగజేస్తుందన్నారు పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే వారికి ఎం ఎస్ ఎం ఈ ద్వారా బ్యాంకర్లతో మాట్లాడి రుణాలు మంజూరు చేయడానికి పాలసీని తీసుకురాబోతున్నట్లు తెలిపారు. ఎంపి కలిసెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఇప్పటికే పరిశ్రమల స్థాపించడానికి కూటమి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని, వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేసే బొటానిక్స్ పరిశ్రమ మన ప్రాంతంలో ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి మాట్లాడుతూ స్థానికంగా రైతులు పండించే పసుపు అల్లం కొబ్బరి మామిడి వంటి పంటలను అమెరికా ఆసియా పసిఫిక్ దేశాలకు ఎగుమతి చేసేందుకు ఉపయోగకరమైన బొటానిక్స్ కంపెనీ ఏర్పాటు చేయడం శుభపరిణామన్నారు.

మార్క్ ఫెడ్ చైర్మన్ కరోతు బంగారు రాజు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కమిషన్లకు కక్కుర్తి పడి కంపెనీలు రాకుండా చేసేవారని కూటమి ప్రభుత్వం పరిశ్రమలు పెట్టే వారిని ప్రోత్సహించటం జరుగుతుందన్నారు. ఆయిల్ఫెడ్ చైర్మన్ గండి బాబ్జీ మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు ఉత్తరాంధ్రలో అనేక అవకాశాలు ఉన్నాయని, అటువంటి అవకాశాలను అందుపుచ్చుకుని పరిశ్రమలు ఏర్పాటుకు మరింత మంది యువకులు ముందుకు రావాలన్నారు. లోక్సత్తా నాయకులు బాబ్జి మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు వచ్చేవారికి సింగల్ విండో పథకం ద్వారా అనుమతులు మంజూరు చేసినట్లయితే మరింత మంది పరిశ్రమలు స్థాపించడానికి ముందుకు వస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడిఏ రీజనల్ చైర్మన్ ఆర్ పి నాయుడు తదితరులు పాల్గొన్నారు

## చేనేత వైభవానికి

# 'చేనేత బజారు' చేయూత

జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



- క్రాఫ్ట్స్ కౌన్సిల్ సేవలు అభినందనీయం
- సంస్కృతి, వారసత్వ సంపద పరిరక్షణకు కృషి

**విజయవాడ, అక్టోబర్ 01, 2026 :** రాష్ట్ర చేనేత, హస్తకళల వైభవాన్ని ముందుకు తీసుకెళ్లడంతో పాటు నేత కార్మికులు, కళాకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ క్రాఫ్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. విజయవాడలోని పీవీపీ స్క్వేర్ మాల్లో క్రాఫ్ట్స్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (సీసీఏపీ) ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చేనేత బజారును గురువారం జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.. ఆయన సతీమణితో పాటు సీసీఏపీ కార్యదర్శి ఎస్.రంజన, వైస్ ఛైర్పర్సన్ బి.సుజాత తదితరులతో కలిసి ప్రారంభించారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని అక్టోబర్ 1 నుంచి 4వ తేదీ వరకు ఉదయం 9.30 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఈ బజారు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చేనేత, హస్తకళలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, ముఖ్యంగా యువతలో చేనేత, హస్తకళలపై అవగాహన పెంచి, మన సంప్రదాయ కళలను భావితరాలకు అందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. చేతివృత్తులు, చేనేత వస్త్రాల సుస్థిర అభివృద్ధి కోసం ఎలాంటి లాభాపేక్షా లేకుండా క్రాఫ్ట్స్ కౌన్సిల్ కృషిచేస్తోందన్నారు. చేనేత కార్మికులు, హస్తకళాకారుల సంక్షేమం, డిజైన్ అభివృద్ధి, శిక్షణ, మార్కెటింగ్ తదితరాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. వెంకటగిరి, పొందూరు, పెడన తదితర ప్రాంతాల చేనేత వస్త్రాలతో పాటు సంప్రదాయ కళాకృతులను ప్రత్యేక కార్యక్రమాల ద్వారా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. చేనేత, హస్తకళల పరిరక్షణ, ప్రోత్సాహానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. త్వరలో విజయవాడలో జాతీయ సరస్ అజీవిక మేళా జరగనుందని వెల్లడించారు.

కొండపల్లి, ఏటికొప్పాక వంటి అపురూప కళా సంపద పరిరక్షణ కూ విశేష కృషిచేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు చేనేత బజారును సందర్శించి చేనేత వస్త్రాలు, హస్తకళా ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా నేత కార్మికులు, కళాకారులకు చేయూత నివ్వాలని కోరారు. కార్యక్రమంలో సీసీఏపీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వయోవృద్ధులు సమాజానికి అమూల్య సంపద

జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



- వారి అనుభవాలు భావితరాలకు బంగారు బాటలు
- వయోవృద్ధుల రక్షణ, గౌరవం, సంక్షేమానికి ప్రభుత్వం అండగా ఉంటోంది

**విజయవాడ, అక్టోబర్ 01, 2026 :** వయోవృద్ధులు సమాజానికి అమూల్య సంపద అని, వారి జీవిత అనుభవాలు భావితరాలకు ఎంతో విలువైన మార్గదర్శకాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. వయోవృద్ధులు ఎలాంటి పరిస్థితుల్లోనూ అధైర్యపడవద్దని, వారి రక్షణకు చట్టపరమైన రక్షణలు ఉన్నాయని తెలిపారు.

అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్టీఆర్ జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కార్యక్రమాన్ని గురువారం విజయవాడ బందర్ లాకులలోని స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.. డీసీపీ కేజీవీ సరిత, రెండో అదనపు జిల్లా జడ్జ్ ఎం.సునీల్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం వయోవృద్ధులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తోందని పేర్కొన్నారు. పిల్లలు తమ తల్లిదండ్రులను గౌరవించాలని..

వారిపట్ల ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని సూచించారు. వయోవృద్ధుల పట్ల నిర్లక్ష్యం లేదా చట్టవిరుద్ధంగా వ్యవహరించే వారిపై చట్టప్రకా రం చర్యలు తప్పవన్నారు. వయోవృద్ధుల జీవి తానుభవాలు కుటుంబానికి, నేటి తరానికి, సమాజానికి ఎంతో విలువైనవని పేర్కొన్నారు. డీసీపీ కేజీవీ సరిత మాట్లాడుతూ వయోవృద్ధులు భావితరాలకు మార్గదర్శకులని, వారి అనుభ వాలు సమాజానికి ఎంతో విలువైనవని తెలిపా రు. వయోవృద్ధుల భద్రత, గౌరవం, సంక్షేమా నికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ సందర్భంగా 80 నుంచి 100 సంవత్సరాల వయసున్న పలువురు వయోవృద్ధులతో పాటు వృద్ధాశ్రమాల నిర్వాహకులను ఘనంగా సన్మానించారు. జిల్లా వయోవృద్ధుల సంఘాలు, వృద్ధాశ్రమాలకు చెందిన సుమారు 200 మంది వయోవృద్ధులు కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఎన్టీఆర్ జిల్లా విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు వాడ్రేవు కామరాజు, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షులు వేమూరి బాబూరావు, కార్యదర్శి మోతుకూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# రక్తపోటు సమస్య ఉన్నవారు ఎలాంటి ఆహారం తీసుకోవాలి గుండెను ఎలా రక్షించుకోవాలి




అధిక రక్తపోటు సాధారణంగా కనిపించే ఆరోగ్య సమస్య అయినప్పటికీ, దాన్ని నిర్లక్ష్యం చేస్తే గుండె జబ్బులు, పక్షవాతం, మూత్రపిండాలు దెబ్బతినడం, చూపు కోల్పోవడం వంటి తీవ్రమైన సమస్యలకు దారితీసే అవకాశం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. రక్తపోటును నియంత్రణలో ఉంచేందుకు జీవనశైలిలో మార్పులు చేసుకోవడంతోపాటు అవసరమైతే వైద్యుల సూచన మేరకు మందులు వాడడం, క్రమం తప్పకుండా రక్తపోటును పర్యవేక్షించడం కీలకమని నిపుణులు చెబుతున్నారు. ఆహారం, నిద్ర, ఒత్తిడి, శారీరక చలనం, శరీర బరువు, వయసు, కుటుంబంలో అధిక రక్తపోటు చరిత్ర వంటి అనేక అంశాలు రక్తపోటుపై ప్రభావం చూపుతాయని వారు సూచిస్తున్నారు. ఉప్పును తగ్గించాలి.. రక్తపోటును ఆరోగ్యకరంగా ఉంచడంలో ఉప్పు, సోడియం తీసుకునే పరిమాణాన్ని తగ్గించడం ముఖ్యమైన చర్యల్లో ఒకటి. ప్యాకేజ్డ్ ఆహారాలు, అధికంగా ప్రాసెస్ చేసిన పదార్థాలు, చిప్స్ వంటి ఉప్పు ఎక్కువగా ఉండే చిరుతిళ్లు, ప్రాసెస్ చేసిన మాంసాహారం, తయారుగా లభించే సాస్లు, రెడీమేడ్ ఆహారాలను పరిమితం చేయడం మంచిది. వీటికి బదులుగా తాజా, సహజమైన ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే పొటాషియం, పీచు అధికంగా ఉండే ఆలుగడ్డలు, చిలగడదుంపలు, వివిధ రకాల పండ్లు, కూరగాయలు, పప్పులు, చిక్కుళ్లు, సంపూర్ణ ధాన్యాలను ఆహారంలో చేర్చుకోవడం రక్తపోటు నియంత్రణకు తోడ్పడతాయి. మేలు చేసే మెగ్నీషియం..మెగ్నీ షియం కూడా శరీరంలోని కండరాలు, నరాలు, గుండె, రక్తనాళాల సాధారణ పనితీరుకు అవసరమైన ఖనిజం. అందువల్ల బాదం వంటి గింజలు, విత్తనాలు, పప్పులు, పాలకూర, సంపూర్ణ ధాన్యాలు వంటి మెగ్నీషియం అధికంగా ఉండే ఆహారాలను తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అవసరాన్ని బట్టి మెగ్నీషియం సప్లిమెంట్లను తీసుకోవాలంటే వైద్యుల సలహా తీసుకోవడం మంచిది. ఆహారంలో సహజమైన, పోషకాలు అధికంగా ఉండే పదార్థాలకు ప్రాధాన్యం ఇవ్వడం ముఖ్యమని చెబుతున్నారు. రక్తపోటును ఆరోగ్యకరంగా ఉంచ డంలో ఉప్పు, సోడియం తీసుకునే పరిమాణాన్ని తగ్గించడం ముఖ్యమైన చర్యల్లో ఒకటి. ప్యాకేజ్డ్ ఆహారాలు, అధికంగా ప్రాసెస్ చేసిన పదార్థా లు, చిప్స్ వంటి ఉప్పు ఎక్కువగా ఉండే శారీరక చలనం కూడా రక్తపోటు నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తుంది. వారానికి సుమారు 150 నిమిషాల మితమైన శారీరక వ్యాయామం చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. ఉదాహరణకు రోజు కు 30 నిమిషాల చురుకైన నడకను వారంలో ఐదు రోజులు చేయవచ్చు. దీనితోపాటు రోజు కు 7 నుంచి 9 గంటల నాణ్యమైన నిద్ర పొంద డం, ఒత్తిడిని తగ్గించుకోవడం కూడా అవసర ం. లోతైన శ్వాస, ధ్యానం, తేలికపాటి శారీరక కదలికలు, క్రమబద్ధమైన నిద్ర అలవాట్లు ఒత్తిడిని తగ్గించేందుకు సహాయపడతాయి. ఆహారంలో సహజమైన, పోషకాలు అధికం

రక్తపోటును ప్రభావి తం చేసే అంశాలను తెలుసుకుని, క్రమం తప్పకుండా దాన్ని పర్యవేక్షిస్తూ అవసరమైన సమయంలో చర్యలు తీసుకోవడం ద్వారా ఆరోగ్యపరమైన ప్రమాదాలను తగ్గించుకోవచ్చు ని నిపుణులు సూచిస్తున్నారు.

# మానసిక దృఢత్వంతో ఒత్తిడికి చెక్

జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



- ఒత్తిడిని జయించేందుకు.. అవగాహన, ఆచరణ అవసరం
- విజయవంతంగా 18వ స్ట్రెస్ మేనేజ్మెంట్ కార్యక్రమం

**విజయవాడ, అక్టోబర్ 01, 2026 :** ఉద్యోగ విధులు, కుటుంబ బాధ్యతలు తదితర కారణాలతో ఏర్పడే ఒత్తిడిని గుర్తించి, సమర్థవంతంగా నియంత్రించుకునే నైపుణ్యాలను ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. మానసిక దృఢత్వంతో ఒత్తిడికి చెక్ పెట్టొచ్చని పేర్కొన్నారు.

గురువారం ఆకర్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో ప్రభుత్వ ఉద్యోగులకు జరిగిన 18వ స్ట్రెస్ మేనేజ్మెంట్ కార్యక్రమానికి కలెక్టర్ హాజరయ్యారు.

నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ డా. విమల ముఖ్య వక్తగా పాల్గొని మాట్లాడుతూ జీవితంలో ఒత్తిడి సహజమేనని.. ఉద్యోగం, కుటుంబం, పిల్లలు, భార్యాభర్తల సంబంధాలు వంటి వివిధ సందర్భాల్లో ఒత్తిడి ఏర్పడవచ్చని తెలిపారు. ముందుగా ఒత్తిడి అంటే ఏమిటి, అది మనపై ఎలాంటి ప్రభావం చూపుతుందనే విషయాన్ని ప్రతిఒక్కరూ అర్థం చేసుకోవాలని సూచించారు. సమయ పాలన, ప్రవర్తనలో మార్పు, సంబంధాల నిర్వహణ వంటి అంశాలపై దృష్టిసారించడం ద్వారా ఒత్తిడిని సమర్థవంతంగా నియంత్రించుకో వచ్చని వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆకర్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్ట్రెస్ మేనేజ్మెంట్ కార్యక్రమాలు విజయవం తంగా కొనసాగుతున్నాయని తెలిపారు.

ఈ కార్యక్రమాల ద్వారా అనేక మంది ఉద్యోగులు ప్రయోజనం పొందుతున్నారని, సిబ్బంది నుంచి మంచి స్పందన లభిస్తోందని పేర్కొన్నారు.

ఉద్యోగుల మానసిక ఆరోగ్యం, ఒత్తిడి నియంత్రణకు ఇటువంటి అవగాహనా కార్యక్రమాలు ఉపయోగకరంగా ఉంటాయని, భవిష్యత్తులోనూ ఇలాంటి కార్యక్రమాల నిర్వహ ణకు జిల్లా యంత్రాంగం తరఫున అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు.

సైకాలజిస్ట్ డా. టి.ఎస్.రావు, ఆకర్ష ఫౌండేషన్ చైర్మన్ డా. గర్రె శంకరరావు మాట్లాడుతూ ఒత్తిడి నిర్వహణతో పాటు మాదకద్రవ్యాల నిర్మూలన, వాటి వినియోగం నివారణపైనా ప్రభుత్వ శాఖలతో కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తు న్నామని చెప్పారు. కార్యక్రమంలో సైకాలజిస్టు లు శ్రీపతి జగదీష్, శామ్యూల్, డా. కృష్ణకుమా రి, వేణుగోపాల్, ట్రైనీ సైకాలజిస్ట్ ఇందుమతి, కలెక్టరేట్ నోడల్ అధికారిణి జి.జ్యోతి తదిత రులు పాల్గొన్నారు.

# ఆసియా క్రీడల్లో భారత హాకీ జట్టు విజయాల పరంపర



## పాక్‌పై భారత్ సంచలన విజయం నమోదు

ఆసియా క్రీడల్లో భారత హాకీ జట్టు తన 10 ఏళ్ల విజయ పరంపరను కొనసాగించింది. ఉత్కంఠభరితమైన సెమీఫైనల్‌లో పాకిస్థాన్‌ను 4–3 తేడాతో ఓడించి భారత హాకీ జట్టు అద్భుత ప్రదర్శన కనబరిచి స్వర్ణ పతక పోరుకు అర్హత సాధించింది. భారత విజయంలో కీలక పాత్ర పోషించిన కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ రెండు గోల్స్ చేయగా.. సుఖ్‌జీత్ సింగ్, అభిషేక్ చెరొక గోల్ సాధించారు. స్కోరు 3–3తో సమమైన తర్వాత 60వ నిమిషంలో భారత్ తన చివరి గోల్‌ను నమోదు చేసింది. గిఫు ప్రిఫెక్చురల్ గ్రీన్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్ ఎంతో ఉత్కంఠభరితంగా సాగింది. భారత్ తరఫున కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ రెండు గోల్స్ చేశాడు. 5వ, 13వ నిమిషాల్లో లభించిన పెనాల్టీ కార్నర్లను గోల్స్‌గా మలచి భారత్‌కు తొలి ఆధిక్యాన్ని అందించాడు. ఆ తర్వాత 23వ నిమిషంలో సుఖ్‌జీత్ సింగ్ గోల్ చేసి జట్టుకు ఆధిక్యాన్ని అందించాడు. అనంతరం పాకిస్థాన్ తమ రక్షణ శ్రేణితో గట్టి పోటీ ఇచ్చి పుంజుకోవడానికి ప్రయత్నించింది. 30వ నిమిషంలో అబు మహమూద్, 38వ నిమిషంలో అమ్మాద్ బట్ గోల్స్ చేసి పాకిస్తాన్ జట్టుకు తిరిగి ఆశలు కల్పించారు. మ్యాచ్ చివరి పావుగంటలో, పాకిస్తాన్ స్కోరును సమం చేయడానికి తీవ్రంగా ప్రయత్నించింది. 45వ నిమిషంలో షాహిద్ హనన్ గోల్ చేసి స్కోరును 3–3తో సమం చేశాడు. మ్యాచ్ చివరి క్షణాల్లో అభిషేక్ అద్భుతమైన పెనాల్టీని సాధించి భారత్‌కు విజయాన్ని ఖాయం చేశాడు.

# లంకను గెలిచిన భారతం



## 45 పరుగులకే శ్రీలంక ఆలౌట్..

## 124 పరుగుల తేడాతో భరత్ విక్టరీ

## విధ్వంసం సృష్టించిన ఇషాన్ కిషన్

2026 ఆసియా క్రీడల రెండో క్రికెట్ సెమీ–ఫైనల్ పూర్తిగా ఏకపక్షంగా సాగింది. ఈ టోర్నీలో తొలిసారిగా అడుగుపెట్టిన భారత్.. వర్షం వచ్చినప్పుడల్లా భారత్‌ను ఎందుకు ఛాంపియన్‌గా పరిగణిస్తారో నిరూపించింది. మొదట బ్యాటింగ్ చేసిన భారత్ 169 పరుగులు చేసింది. ఆ తర్వాత 9.5 ఓవర్లలో శ్రీలంకను 45 పరుగులకే ఆలౌట్ చేసి.. 124 పరుగుల తేడాతో మ్యాచ్‌ను గెలుచుకుంది. ఈ మ్యాచ్‌లో భారత్ తరఫున అభిషేక్ శర్మ మోస్ట్ సక్సెస్‌ఫుల్ బౌలర్‌గా నిలిచాడు. అభిషేక్ శర్మ కేవలం 5 బంతుల్లో 2 పరుగులకే 2 వికెట్లు పడగొట్టాడు. అభిషేక్ శర్మ ఓవర్‌లోని చివరి మూడు బంతులకు శ్రీలంక వికెట్లు కోల్పోయింది. తొమ్మిది ఓవర్ల తర్వాత శ్రీలంక స్కోరు 43–7గా ఉండగా.. ఆ తర్వాతి ఐదు బంతుల్లో అభిషేక్ శర్మ బౌలింగ్ భారత్‌కు విజయాన్ని ఖాయం చేసింది. జపాన్‌లో నిషిన్ నగరంలోని కొరోగి స్పోర్ట్స్ పార్క్ స్టేడియం వేదికగా శ్రీలంక జట్టుతో జరుగుతున్న ఆసియా క్రీడల సెమీ–ఫైనల్ మ్యాచ్ లో భారత్ అద్భుతంగా రాణించింది. క్లిష్టమైన పిచ్ పై భారత్ అద్భుతంగా పోరాడి భారీ లక్ష్యాన్ని నమోదు చేసింది. నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 169 పరుగులు చేసింది. శ్రీలంక ముందు 170 పరుగు భారీ లక్ష్యాన్ని ఉంచింది. టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ ఎంచుకున్న శ్రీలంకకు ఆరంభంలోనే అద్భుతమైన ప్రారంభం లభించింది. మొదటి 3 ఓవర్లలోనే అభిషేక్ శర్మ, సంజూ శాంసన్‌లను వరుసగా పెవిలియన్ పంపి టీమిండియాను దెబ్బతీసింది. ఇన్నింగ్స్ ఆరంభంలోనే భారత్ తడబడుతున్న సమయంలో యువ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ భయపడకుండా కౌంటర్ ఎటాక్ ప్రారంభించాడు. కేవలం 21 బంతుల్లో 38 పరుగులు సాధించి ఇన్నింగ్స్‌కు ఊపు తెచ్చాడు. వైభవ్ సూర్యవంశీ దాడితో భారత్ పవర్‌ప్లే ముగిసేసరికి 58/2 స్కోరుతో బలమైన స్థితిలో నిలిచింది. అయితే మిడిల్ ఓవర్లలో శ్రీలంక స్పిన్నర్లు మ్యాచ్ ను మళ్లీ తమ వైపు తిప్పుకున్నారు. సహన్ అరచ్చిగే బౌలింగ్‌లో వైభవ్ సూర్యవంశీ ఔట్ కాగా.. వనుజ సహన్ బౌలింగ్‌లో శ్రేయస్ అయ్యర్ (13) క్లీన్ బౌల్డ్ అయ్యాడు. లంక స్పిన్నర్లు పకడ్బందీ బౌలింగ్‌తో రన్ రేట్‌ను కట్టడి చేస్తూ వరుస వికెట్లు పడగొట్టారు. అక్షర్ పటేల్, తిలక్ వర్మ, శివమ్ దూబే తక్కువ స్కోర్లకే నిష్క్రమించడంతో భారత్ ఒకానొక దశలో 151/7తో కష్టాల్లో పడింది. ఓ వైపు వరుసగా వికెట్లు పడుతున్నప్పటికీ ఇషాన్ కిషన్ ఒంటరి పోరాటం చేస్తూ ఇన్నింగ్స్ ను నిలబెట్టాడు. ఆరంభంలో నిలకడగా ఆడిన ఇషాన్ కిషన్.. డెత్ ఓవర్లలో చెలరేగిపోయి 46 బంతుల్లో 80 పరుగులు సాధించాడు. చివరిలో వాషింగ్టన్ సుందర్ మెరుపు కామియో జోడించడంతో భారత్ నిర్ణీత ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 169 పరుగులు చేసింది. శ్రీలంక ఫైనల్ టికెట్ ఖాయం చేసుకోవాలంటే 170 పరుగులు చేయాల్సి ఉంది. పిచ్ స్పిన్ కు అనుకూలిస్తుండటంతో ఈ ఛేజింగ్ చివరి వరకు ఉత్కంఠ భరితంగా సాగనుంది. మ్యాచ్‌లో భారీ స్కోరు చేయడం ద్వారా భారత్ తన విజయాన్ని దాదాపు ఖాయం చేసుకుంది. ఆ తర్వాత, జస్ప్రీత్ బుమ్రా తొలి ఓవర్‌లోనే 2 వికెట్లు తీసి భారత్ విజయాన్ని దాదాపు ఖాయం చేశాడు. ఆ తర్వాత శ్రీలంక జట్టు పేకముక్కల్లా కూలిపోయి 45 పరుగులకే ఆలౌట్ అయింది. 124 పరుగుల తేడాతో గెలిచి భారత్ రికార్డు కూడా సృష్టించింది. ఫైనల్‌లో భారత్ పాకిస్తాన్‌తో తలపడను ంది. సెమీఫైనల్స్‌లో బంగ్లాదేశ్‌ను ఓడించి పాకిస్థాన్ ఫైనల్‌కు చేరుకుంది. అయితే ఆసియాలో ఏ జట్టు కూడా భారత జట్టుకు సవాలు విసరలేకపోతోంది. అందువల్ల భారత్ స్వర్ణ పతకం విజయం ఖాయంగా భావిస్తున్నారు.

# 148 ఏళ్ల క్రికెట్ చరిత్రలోనే ఇదే తొలిసారి..!



క్రికెట్ చరిత్రలోనే కనీ వినీ ఎరుగని రికార్డ్‌ను టీమిండియా సొంతం చేసుకుంది. తొలి 30 ఓవర్లలోనే 300 పరుగులు చేసిన తొలి జట్టుగా చరిత్ర సృష్టించింది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా వెస్టిండీస్‌తో గౌహతి వేదికగా జరిగిన రెండో వన్డేలో టీమిండియా ఈ ఫీట్ సాధించింది. ఈ మ్యాచ్‌లో 406 పరుగుల భారీ లక్ష్యఛేదనకు దిగిన భారత్.. శుభ్‌మన్ గిల్(130 బంతుల్లో 25 ఫోర్లు, 8 సిక్స్‌లతో 217 నాటౌట్), రోహిత్ శర్మ(75 బంతుల్లో 10 ఫోర్లు, 6 సిక్స్‌లతో 101) విధ్వంసకర బ్యాటింగ్‌తో 29.1 ఓవర్లలోనే 300 పరుగులు చేసింది. మరో 39 బంతులు మిగిలి ఉండగానే ఈ భారీ లక్ష్యాన్ని ఛేదించి రికార్డ్ విజయాన్ని అందుకుంది. క్రికెట్ చరిత్రలోనే మరే జట్టు కూడా 30 ఓవర్లలోపు 300 పరుగులు చేయలేదు. రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడటంతో ఈ రికార్డ్ సాధ్యమైంది. 10 ఓవర్లలోనే 92పరుగులు చేసిన ఈ జోడీ.. 21.1 ఓవర్లలో 200 పరుగుల మైలురాయిని అందుకుంది. వన్డే క్రికెట్ చరిత్రలోనే అత్యంత వేగంగా 200 పరుగులు చేసిన జట్టుగానూ భారత్ నిలిచింది. తొలి వికెట్‌కు 255 పరుగులు జోడించిన అనంతరం రోహిత్ శర్మ ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగినా.. క్రీజులోకి వచ్చిన కోహ్లీ దూకుడుగా ఆడాడు. శుభ్‌మన్ గిల్ కూడా బౌండరీల మోత మోగించడంతో భారత్ 29.1 ఓవర్లలోనే (175 బంతుల్లో) 300 పరుగులు చేసి క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. గతంలో సౌతాఫ్రికా మాత్రమే 32.2 ఓవర్లలో 300 పరుగులు చేసింది. 2006లో జోహన్నెస్‌బర్గ్‌లో ఆస్ట్రేలియాపై ఈ ఫీట్ సాధించింది. 2006లో శ్రీలంకపై ఇంగ్లండ్ 33.1 ఓవర్లలో, 2009లో శ్రీలంకపై భారత్ 34.1 ఓవర్లలో 300 పరుగులు చేశాయి. ఈ పాత రికార్డ్‌లన్నింటిని తాజాగా భారత్ బద్దలుకొట్టింది. 30 ఓవర్లలోపే 300 పరుగులు సాధించిన తొలి జట్టుగా చరిత్రకెక్కింది. ఈ విజయంతో మూడు వన్డేల సిరీస్‌ను భారత్ మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2–0తో సిరీస్ కైవసం చేసుకుంది. నామమాత్రపు ఆఖరి వన్డే శనివారం న్యూ చండీఘడ్ వేదికగా జరగనుంది.

# ప్రపంచకప్ కంటే గోల్డ్ మెడల్ గొప్పది



ఆసియా గేమ్స్ 2026లో బంగారు పతకం గెలవడం చాలా ప్రత్యేకమైన అనుభవమని, ప్రపంచకప్ కంటే గొప్ప విజయమని టీమిండియా ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ అన్నాడు. ఆసియా గేమ్స్ 2026లో భారత్ పురుషుల క్రికెట్ టీమ్ ఫైనల్‌కు దూసుకెళ్లిన సంగతి తెలిసిందే. గురువారం శ్రీలంకతో జరిగిన సెమీఫైనల్లో భారత్ 124 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. శనివారం జరిగే ఫైనల్లో పాకిస్థాన్‌తో శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని భారత జట్టు అమీతుమీ తేల్చుకోనుంది. సెమీఫైనల్ విజయానంతరం బ్రాడ్‌కాస్టర్‌తో మాట్లాడిన అక్షర్ పటేల్..తన అనుభవాలను పంచుకున్నాడు. గేమ్ విలేజ్‌లో ఉండటం ప్రత్యేక అనుభూతినిస్తోందని చెప్పాడు. 'ఏ జట్టు అయినా గెలవాలంటే గట్టిగా ప్రయత్నించాలి. మేం చేయాల్సింది మేం చేశాం. అయితే ఈ మ్యాచ్ ఆడేందుకు చాలా రోజులు ఎదురుచూడాల్సి వచ్చింది. వర్షం పడటం వల్ల మ్యాచ్‌లు జరగలేదు. సుదీర్ఘ విరామం తర్వాత మ్యాచ్ జరిగినప్పటికీ జట్టులోని ప్రతీ ఒక్కరూ అద్భుతమైన ప్రదర్శన కనబర్చారు. పాకిస్తాన్, బంగ్లాదేశ్ మ్యాచ్‌లు కూడా ఇదే పిచ్‌పై జరిగాయి. ఆ మ్యాచ్‌లు చూశాక ఈ వికెట్‌పై 140–150 పరుగులు చేస్తే గెలిచే అవకాశం ఉంటుందని అంచనా వేశాం. కానీ మేం అదనంగా(169) 10–15 పరుగులు ఎక్కువే చేశాం. మ్యాచ్ ఆరంభంలో బంతికి డ్రిఫ్ట్, టర్న్, బౌన్స్ బాగా లభించాయి. పాకిస్థాన్‌తో జరిగే ఫైనల్ మ్యాచ్ ఏ వికెట్‌పై ఆడిస్తారనే దానిపై ప్రస్తుతం మాకూ సమాచారం లేదు. దీని గురించి మాట్లాడాం కానీ ఇంకా ఖరారు కాలేదని చెప్పారు. అయితే ఇక్కడి మైదానంలో మూడు వికెట్లు ఉన్నాయి. మూడూ దాదాపు ఒకేలా పగుళ్లతో కనిపిస్తున్నాయి. కాబట్టి ఏ వికెట్‌పై ఆడినా పిచ్ ప్రవర్తనలో ఎలాంటి తేడా ఉండే అవకాశం లేదు. ఇక్కడి భారతీయ రెస్టారెంట్ల నుంచి పార్సిల్ తెప్పించుకొని తింటున్నాం. తిండి విషయంలో ఎలాంటి ఇబ్బంది లేదు. ఇక్కడ మూడు, నాలుగు ఇండియన్ రెస్టారెంట్లు ఉన్నాయి. వాళ్ల ఫుడ్ బాగా వండుతున్నారు. జపాన్‌లో క్రికెట్ ఎక్కువగా ఆదరన్న విషయం తెలిసిందే. కానీ వాళ్ళు చేస్తున్న కృషి మాత్రం అద్భుతం. మైదానంతో పాటు వాతావరణం విషయంలో వాళ్ళ పరిమితుల మేరకు మంచి ఏర్పాట్లు చేశారు. రాబోయే రోజుల్లో క్రికెట్ సౌకర్యాలను మరింత పెంచి, ఇంకా మంచి పరిస్థితులు కల్పిస్తారని ఆశిస్తున్నా. నేను గేమ్స్ విలేజ్‌లో ఉండటం ఇదే తొలిసారి. ఈ అనుభవం చాలా బాగుంది. గతంలో మేం ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ లేదా ఇతర దేశాలకు వెళ్లినప్పటి అనుభవాలకు ఇక్కడికి చాలా తేడా ఉంది. కానీ ఏషియన్ గేమ్స్‌లో ఇతర క్రీడాకారులతో కలిసి ఉండటం ఒక కొత్త అనుభూతినిస్తోంది. ఇక్కడున్న ప్రతీ ఒక్కరికీ ఐడీ కార్డులు ఇచ్చారు. ఆ ఐడీ కార్డు వేసుకుని బయట నడుస్తున్నప్పుడు జనాలు మమ్మల్ని చూసే విధానం చాలా భిన్నంగా ఉంటుంది. అథ్లెట్లు అని జనాలు గుర్తించి ప్రత్యేకంగా చూస్తుంటారు. ఇది నాకు చాలా సంతోషాన్నిస్తోంది. గోల్డ్ మెడల్ గెలవడం అనేది ప్రత్యేకమైన అనుభవం. మేం గతంలో ప్రపంచకప్, ఇతర పెద్ద టోర్నీలు గెలిచాం. అక్కడ బీసీసీఐ తరఫున దేశం కోసం ఆడుతాం. కానీ ఆసియా గేమ్స్‌లో పరిస్థితులు వేరు. ఇక్కడ నేరుగా దేశం తరఫున ఆడి స్వర్ణం సాధించే అవకాశం లభిస్తుంది. నా దృష్టిలో ప్రపంచకప్ కంటే ఇది చాలా ముఖ్యమైనది. మా ఆట తీరు చూస్తుంటే స్వర్ణం గెలిచే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఒకవేళ స్వర్ణం గెలిస్తే.. అది నాకు చాలా గర్వకారణమైన క్షణం అవుతుంది.'అని అక్షర్ పటేల్ చెప్పుకొచ్చాడు.

# భారత్ తరఫున ఆడటం వేరే ఫీలింగ్!

## • వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్

ఆసియా క్రీడల్లో భారత్ తరఫున ఆడటం.. అందులోనూ పతకం కోసం పోరాడటం చాలా ప్రత్యేకమైన అనుభూతినిస్తుందని వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ అన్నాడు. సాధారణ అంతర్జాతీయ మ్యాచ్‌లతో పోలిస్తే ఆసియా క్రీడల్లో కొంత ఎక్కువ ఒత్తిడి ఉంటుందని చెప్పాడు. శ్రీలంకతో జరిగిన సెమీఫైనల్లో ఇషాన్ కిషన్ అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. 80 పరుగులతో రాణించి భారత్ 169 పరుగులు చేయడంలో కీలక పాత్ర పోషించాడు. అనంతరం భారత బౌలర్లు శ్రీలంకను కేవలం 45 పరుగులకే ఆలౌట్ చేయడంతో భారత్ ఘన విజయం సాధించింది. "భారత్ కోసం ఆడుతున్నప్పుడు.. ముఖ్యంగా పతకం కోసం ఆడుతున్నప్పుడు మనసులో ఏదో ప్రత్యేకమైన భావన ఉంటుంది. ఇక్కడ బీసీసీఐ కోసం కాదు.. మొత్తం దేశం కోసం ఆడుతున్నామనే ఫీలింగ్ వస్తుంది. చుట్టూ భారత జెండాలు కనిపించడం, అభిమానులు పెద్ద సంఖ్యలో మద్దతు ఇవ్వడం ఆ అనుభూతిని మరింత పెంచుతుంది. బయటకు చూపించకపోయినా లోపల మాత్రం కొంత ఎక్కువ ఒత్తిడి ఉంటుంది" అని ఇషాన్ చెప్పాడు. పగుళ్లు కనిపించే పిచ్‌పై బ్యాటింగ్ చేయడం అంత సులభం కాదని ఇషాన్ తెలిపాడు. ఇలాంటి పరిస్థితుల్లో కనీసం 150 పరుగులు చేస్తే సురక్షితంగా ఉంటామని ముందే అంచనా వేసినట్లు చెప్పాడు. ఒక బ్యాటర్ క్రీజులో కుదురుకుంటే చివరి వరకు ఉండి భారీ స్కోరు చేయాలన్నది జట్టు ప్రణాళికగా ఉందని వివరించాడు. "ఇలాంటి పిచ్‌లపై వ్యక్తిగత లక్ష్యాల కంటే జట్టు అవసరాలే ముఖ్యం. పరిస్థితిని గమనిస్తూ చిన్న చిన్న విషయాలపై దృష్టి పెట్టాలి" అని పేర్కొన్నాడు. ఇక శనివారం పాకిస్థాన్‌తో జరగనున్న స్వర్ణ పతక పోరుపై కూడా ఇషాన్ స్పందించాడు. మ్యాచ్ గురించి ఎక్కువగా ఆలోచించకుండా ప్రశాంతంగా ఉండాలని, ఆ క్షణాలను ఆస్వాదిస్తూ ఆడాలని జట్టు భావిస్తోందన్నాడు. జపాన్‌లో లభించిన ఆతిథ్యంపై ఇషాన్ ప్రశంసలు కురిపించాడు. భాష సమస్య ఉన్నప్పటికీ స్థానికులు ఎంతో సహాయం చేశారని చెప్పాడు. భారత అభిమానులు ఎక్కడికి వెళ్లినా మద్దతుగా నిలుస్తున్నారన్నారు. గెలిచినా ఓడినా తమకు అండగా ఉంటున్న అభిమానులకు ఎప్పటికీ కృతజ్ఞతలు చెబుతామని అన్నాడు.





# ఇంత భిన్నమైన అభిప్రాయాలు వస్తాయని ఊహించలేదు.. 'ది ప్యారడైజ్' రిజల్ట్‌పై నాని

నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వచ్చిన 'ది ప్యారడైజ్'కు ప్రేక్షకుల నుంచి భిన్నమైన స్పందనలు వస్తున్నాయి. సినిమా నచ్చిందని కొందరు చెబుతుండగా.. మరికొందరు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో నాని స్పందించారు. తన 18 ఏళ్ల కెరీర్‌లో 33 సినిమాలు చేసినా.. ఇలాంటి భిన్నమైన స్పందనను తొలిసారి చూస్తున్నానని చెప్పారు.సినిమాపై విమర్శలు వచ్చినా వాటిలో కనిపిస్తున్న తీవ్రతను తాము సానుకూలంగానే తీసుకున్నామని నాని తెలిపారు. సినిమా నచ్చలేదని ఎవరైనా బలంగా చెబితే.. అది కూడా ప్రేక్షకుల స్పందనేనని పేర్కొన్నారు.'ది ప్యారడైజ్'కు తీవ్ర స్థాయిలో స్పందనలు రావొచ్చని ముందే తెలుసని నాని చెప్పారు. అయితే ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్‌లో ఇంత భిన్నమైన అభిప్రాయాలు వస్తాయని ఊహించలేదన్నారు. ఇది తనకు ఒక కొత్త అనుభవమని చెప్పారు.మరోవైపు దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కూడా స్పందించారు. సినిమాకు వస్తున్న మిశ్రమ స్పందనను ఇంకా పూర్తిగా అర్థం చేసుకోలేకపోతున్నానని తెలిపారు. మరికొంత సమయం తీసుకుని ప్రేక్షకుల స్పందనను అర్థం చేసుకోవాల్సి ఉందన్నారు.

ఇదే విషయంపై నాని, సినిమా విడుదలైన మరుసటి రోజే సోషల్ మీడియాలో స్పందించారు. ప్రేక్షకుల ప్రేమతో పాటు, ట్రోల్స్‌ను కూడా స్వీకరిస్తున్నానని చెప్పారు. సినిమా బాగోలేదని విమర్శకులు చెప్పిన అంశాల నుంచి కూడా నేర్చుకున్నానని తెలిపారు. ప్రేక్షకుల కోసం ఎంతో కష్టపడి ప్రత్యేకమైన అనుభవాన్ని అందించేందుకు సినిమా చేశామని పేర్కొన్నారు.సెప్టెంబర్ 24న విడుదలైన 'ది ప్యారడైజ్'లో మోహన్ బాబు, కయాదు లోహర్, రాఘవ్ జుయల్ కీలక పాత్రల్లో నటించారు. ఎస్ఎల్‌వీ సినిమాస్, ఐవీ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా నిర్మించిన ఈ సినిమా రూ.100 కోట్ల క్లబ్‌లోకి చేరిపోయింది.



# సరిగమ వాదనతో ఏకీభవించిన సుప్రీంకోర్టు.. ఇళయరాజాకు ఎదురుదెబ్బ

ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజాకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. దశాబ్దాల నాటి 'ఎన్ ఇనియ పొన్ నిలవే' పాట కాపీరైట్ హక్కుల వివాదంలో ఆయన దాఖలు చేసిన అప్పీల్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఈ విషయంలో ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది.జస్టిస్ జె.బి. పర్దివాలా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. 1980 నాటి తమిళ చిత్రం 'మూడు పానీ'లోని ఈ పాట ట్యూన్‌కు (సంగీతానికి) మాత్రమే ఇళయరాజాకు హక్కులు ఉంటాయని... పాట సాహిత్యం, సౌండ్ రికార్డింగ్‌పై ఆయనకు ఎలాంటి హక్కులు ఉండవని కోర్టు తేల్చిచెప్పింది.

సినిమా నిర్మాత నుంచి సౌండ్ రికార్డింగ్ హక్కులను పొందిన మ్యూజిక్ లేబుల్ 'సరిగమ'కు అనుకూలంగా ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. 'అగతియా' అనే మరో సినిమాలో ఈ పాటను రీక్రియేట్ చేయడంతో ఈ వివాదం మొదలైంది. తాజాగా సుప్రీంకోర్టు తీర్పుతో ఈ కేసులో సరిగమ సంస్థకు పూర్తిస్థాయిలో న్యాయపరమైన ఉపశమనం లభించినట్లయింది.

# షూటింగ్‌లో జారిపడ్డ బిగ్ బీ.. మోకాలికి దెబ్బ



బాలీవుడ్ సీనియర్ నటుడు అమితాబ్ బచ్చన్ గాయపడ్డారు. ఆయన హోస్ట్‌గా వ్యవహరిస్తున్న ప్రముఖ టెలివిజన్ రియాలిటీ షో 'కౌన్ బనేగా కరోడ్‌పతి' (కేబీసీ) సెట్‌లో ఈ ఘటన జరిగింది. షూటింగ్‌లో భాగంగా నడుస్తుండగా ఆయన ప్రమాదవశాత్తు జారిపడటంతో మోకాలికి గాయమైంది. ఈ విషయాన్ని అమితాబ్ స్వయంగా షోలోనే వెల్లడించారు.కేబీసీ తాజా ఎపిసోడ్ ప్రారంభంలో ఈ సంఘటన గురించి బిగ్ బీ ప్రేక్షకులకు తెలిపారు. సాధారణంగా షో ప్రారంభంలో నిల్చొని మాట్లాడే ఆయన, ఈసారి మాత్రం కూర్చునే కనిపించారు. దీనికి కారణం వివరిస్తూ, "నిన్న షూటింగ్ సమయంలో జారిపడటంతో నా ఎడమ మోకాలికి గాయమైంది. అందుకే నిలబడటంలో కొద్దిగా ఇబ్బందిగా ఉంది" అని చెప్పారు. దీంతో సెట్‌లోని సిబ్బంది, అక్కడున్న వైద్యులు వెంటనే స్పందించి ఆయనకు చికిత్స అందించారు.

అయితే, గాయం తీవ్రమైనదేమీ కాదని, కంటెస్టెంట్ల కోసం తాను తప్పకుండా నిలబడతానని అమితాబ్ ప్రేక్షకులకు భరోసా ఇచ్చారు. ఈ వయసులో కూడా ఆయన ఎంతో చురుకుగా షూటింగ్‌లో పాల్గొంటుండగా ఈ ప్రమాదం జరగడంతో అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా బిగ్ బీ త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తూ పోస్టులు పెడుతున్నారు.

# సాంప్రదాయం, చిలిపిదనం కలిస్తే మమితా బైజు..



మలయాళీ ముద్దుగుమ్మ మమితా బైజు తన క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో .. అద్భుతమైన నటనతో యూత్‌లో విపరీతమైన ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది. -ప్రేమలు- సినిమాతో ఒక్కసారిగా టాలీవుడ్, కోలీవుడ్ అనే తేడా లేకుండా అన్ని సినీ పరిశ్రమల్లోనూ క్రేజీ హీరోయిన్‌గా మారిపోయింది. ఈ బ్యూటీ సోషల్ మీడియాలో ఏ చిన్న పోస్ట్ పెట్టినా క్షణాల్లో వైరల్ అవుతుండటం విశేషం. తాజాగా మమితా బైజు ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన కొన్ని కొత్త ఫోటోలు నెట్టింట తెగ చక్కర్లు కొడుతున్నాయి. --విస్పర్స్ ఆఫ్ సిల్క్ అండ్ లైట్-- అనే క్యాప్షన్‌తో ఈ బ్యూటీ షేర్ చేసిన ఈ అందమైన ఫోటోలు అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. సంప్రదాయ సిల్క్ దుస్తుల్లో దేవకన్యలా మెరుస్తున్న తన గ్లామర్, క్యూట్ స్మైల్ నెటిజన్లను ఫిదా చేస్తున్నాయి. ఈ ట్రెండీ లుక్ వెనుక పెద్ద టీమ్ శ్రమ ఉంది. ప్రముఖ డిజైనర్ దీప్తి అందించిన అవుట్‌ఫిట్ ధరించగా.. అర్చన అఖిల్ రావు స్టైలింగ్ చేశారు. కర్ణిక జ్యువెల్స్ వారి ఆభరణాలు.. ఫోటోగ్రాఫర్ విష్ణు అందించిన అద్భుతమైన కెమెరా యాంగిల్స్ ఈ ఫొటోషూట్‌ను మరింత హైలైట్ చేశాయి. ఇక హెయిర్ అండ్ మేకప్ అందించిన టీమ్ సహకారంతో మమితా రూపం మరింత కళకళలాడుతోంది. ట్రెడిషన్ ప్లస్ అందం అంటూ ఈ లుక్ పై ప్రశంసలు కురుస్తున్నాయి. ఫోటోలు పోస్ట్ చేసిన క్షణాల వ్యవధిలోనే లైకులు, కామెంట్ల వర్షం కురుస్తోంది. అభిమానులు ఈ బ్యూటీని -నేషనల్ క్రష్- అని, -మాతా పితా మమిత- అంటూ రకరకాల కామెంట్లతో అభినందిస్తున్నారు. బ్యాక్‌గ్రౌండ్‌లో లనా డెల్ రే పాటను జోడించడం కూడా ఈ పోస్ట్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని ఫ్యాన్స్ మురిసిపోతున్నారు. మొత్తానికి మమితా బైజు తాజా లుక్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.

# వెంకీ 'ఆదర్శ కుటుంబం'.. అక్టోబర్ 6న ట్రైలర్ విడుదల



విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో వస్తున్న 'ఆదర్శ కుటుంబం' చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ క్రేజీ కాంబినేషన్‌పై ఉన్న ఆసక్తిని మరింత పెంచుతూ చిత్రబృందం వరుస అప్‌డేట్స్‌తో ముందుకొస్తోంది. సినిమా విడుదల తేదీ అక్టోబర్ 9 సమీపిస్తుండటంతో ప్రమోషన్ల వేగాన్ని పెంచింది. తాజాగా నిర్మాత నాగవంశీ ఈ సినిమా ట్రైలర్ విడుదల, టికెట్ బుకింగ్స్‌కు సంబంధించిన కీలక వివరాలను వెల్లడించారు.నాగవంశీ తెలిపిన వివరాల ప్రకారం.. 'ఆదర్శ కుటుంబం' థియేట్రికల్ ట్రైలర్‌ను అక్టోబర్ 6వ తేదీన విడుదల చేయనున్నారు. ఇప్పటివరకు విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్‌తో సినిమాపై అంచనాలు పెరగ్గా, ట్రైలర్‌తో కథాంశం, పాత్రల తీరుతెన్నులపై పూర్తి స్పష్టత రానుంది. ముఖ్యంగా తొలిసారి వెంకటేశ్‌ను త్రివిక్రమ్ ఎలా చూపించబోతున్నారనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. ట్రైలర్ విడుదలైన మరుసటి రోజే, అంటే అక్టోబర్ 7 నుంచి తెలుగు రాష్ట్రాల్లో టికెట్ బుకింగ్స్‌ను ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. దీంతో అభిమానులు, ప్రేక్షకులు సినిమా విడుదలకు రెండు రోజుల ముందే తమ టికెట్లను రిజర్వ్ చేసుకునే అవకాశం కలుగుతుంది.ఈ సందర్భంగా నాగవంశీ మాట్లాడుతూ.. 'ఆదర్శ కుటుంబం' ఒక సంపూర్ణ కుటుంబ కథా చిత్రమని, కామెడీ, యాక్షన్, భావోద్వేగాల కలబోతగా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. "పిల్లల పరీక్షలు పూర్తయ్యాక, కుటుంబమంతా కలిసి థియేటర్‌కు వచ్చి హాయిగా నవ్వుకునే సినిమా ఇది. ప్రతి ఒక్కరూ ఈ చిత్రాన్ని ఆస్వాదిస్తారు" అని ఆయన పేర్కొన్నారు. త్రివిక్రమ్ మార్క్ సంభాషణలు, ఆయన శైలి మేకింగ్‌కు వెంకటేశ్ ఎనర్జీ, టైమింగ్ తోడైతే వినోదం ఏ స్థాయిలో ఉంటుందోనని ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.ఈ చిత్రంలో వెంకటేశ్ సరసన 'కేజీఎఫ్' ఫేమ్ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తుండగా, నివేదా పేతురాజ్, నారా రోహిత్, పూజిత పొన్నాడ, రావు రమేశ్, సత్య, యువినా పార్థవి వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. అక్టోబర్ 9న థియేటర్లలోకి రానున్న ఈ సినిమాపై తాజా అప్‌డేట్స్‌తో అంచనాలు మరింతగా పెరిగాయి.

# అక్టోబర్ 30న 'క్రేజీ కల్యాణం'..



అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తెలుగు ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'క్రేజీ కల్యాణం' విడుదల తేదీ ఖరారైంది. బద్రప్ప గజులా దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా అక్టోబర్ 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. ఈ విషయాన్ని చిత్ర నిర్మాణ సంస్థ ఆరో సినిమాస్ బుధవారం ప్రకటించింది. ఈ సందర్భంగా సినిమాలోని రెండో పాట 'అలసెంద్రవంకోలే ఉన్నావే పిల్ల' ప్రోమోను విడుదల చేసింది.

ఇటీవల విడుదలైన ఈ సినిమా టీజర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచింది. కీర్తి పాత్రలో అనుపమ పరమేశ్వరన్ కనిపించనుండగా, ఆమె తండ్రి పాత్రను డాక్టర్ నరేశ్ పోషించారు. కూతురి పెళ్లిని ఘనంగా చేయాలని ఆశపడే తండ్రి చుట్టూ టీజర్‌లోని కథ సాగుతుంది. కూతురికి ఎంత బంగారం కావాలన్నా కొనిస్తానని, నచ్చినన్ని చీరలు తీసుకోవచ్చని, స్నేహితులందరినీ పెళ్లికి పిలవొచ్చని ఆయన చెబుతారు.తన కూతురికి మంచి సంబంధం చూడాలనే ప్రయత్నంలో సోదరుడితోనే ఆయన గొడవకు దిగుతారు. అయితే కీర్తికి మాత్రం తనదైన ఆలోచనలు ఉంటాయి. తన తండ్రిలాగే తాను కూడా మొండిదాన్నేనని అమ్మమ్మతో చెప్పే సన్నివేశం టీజర్‌లో నవ్వులు పూయిస్తుంది. దేవుడిని ప్రార్థిస్తూ తన పెద్ద అల్లుడి కంటే పేదవాడైన మరో అల్లుడు తన సోదరుడికి దొరకాలని నరేశ్ కోరుకునే సన్నివేశం కూడా వినోదాన్ని పంచుతుంది. చివర్లో కీర్తి ఓ వ్యక్తిపై ఎండుమిరపకాయలు విసరడం, ఆమెను పెళ్లి చేసుకునేవాడి పని అయిపోయినట్టేనని అతడు అనడం సినిమాపై ఆసక్తిని పెంచుతోంది.బద్రప్ప గజులా ఈ సినిమాతో దర్శకుడిగా తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగుపెడుతున్నారు. అనుపమతో పాటు అఖిల్ రాజ్ ఉద్దేమరి, డాక్టర్ నరేశ్ విజయకృష్ణ, తరుణ్ భాస్కర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. శ్యామ్ దుపాటి ఛాయాగ్రహణం అందిస్తుండగా, సురేశ్ బొబ్బిలి సంగీతం సమకూరుస్తున్నారు. కథ, దర్శకత్వ బాధ్యతలు బద్రప్ప గజులా నిర్వహించగా, శ్రీనివాస రవీంద్ర స్క్రీన్‌ప్లే అందించారు.

Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com